
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-1-2025 సోమవారం సంపుటి: 30 సంచిక: 352 పేజీలు: 10+4 వెల: 6.50



ఖోఖో ఛాంపియన్‌షిప్ భారత్ కైవసం 2

# హైదరాబాద్‌లో సింగపూర్ భారీ ఐటి పార్క్

## రూ.450 కోట్లతో ఏర్పాటుకు అంగీకరించిన సింగపూర్ కేపిటల్‌లాండ్ కంపెనీ

## 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి

## కేపిటల్‌లాండ్ ఆధ్వర్యంలో ఇప్పటికే టెక్‌పార్క్, సైబర్ పెర్ల్ పార్కులు


ఆదివారం సింగపూర్‌లో కేపిటల్‌లాండ్ కంపెనీ ప్రతినిధులతో భేటీ అయిన సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి19:** సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో ముందడుగు వేసింది. తెలంగాణ రాష్ట్రంలో రూ.450 కోట్ల పెట్టుబడులకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో అత్యాధునిక ఐటీ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రపంచస్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటైన క్యాపిటల్ ల్యాండ్ హైదరాబాద్‌లో 10 లక్షలచదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సింగపూర్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో క్యాపిటల్ ల్యాండ్ ఈ నిర్ణయం ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి >>2



# అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ పదవీస్వీకారం నేడే

## కేపిటల్ హిల్స్‌కు చేరిన దేశ, విదేశ ప్రముఖులు

## భారత్ తరపున హాజరవుతున్న విదేశాంగ మంత్రి జైశంకర్

2

## దావోస్ సదస్సుకు సిఎం బృందం పయనం 2

## నేడు, రేపు పాట్నాలో స్పీకర్లు, చైర్మన్ల సదస్సు 3

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక మహాకుంభ్‌మేళా
-ప్రధాని మోడీ 5

## పేలిన పెట్రోలు టాంకర్.. 77 మంది మృతి 5

# ఎస్సీ వర్గీకరణ తర్వాతే డిఎస్సీ నోటిఫికేషన్!

## ఫిబ్రవరి మొదటి వారంలో హైకోర్టుకు ఏకసభ్య కమిషన్ నివేదిక

**హైదరాబాద్, జనవరి19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరోసారి ఉపాధ్యాయపోస్టుల నియామకండీఎస్సీ-2025 కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. అయితే ఎస్సీ వర్గీకరణపై స్పష్టత వచ్చిన తరువాతనే డీఎస్సీ- 2025కి నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. డీఎస్సీ ద్వారా చేపట్టే ఉపాధ్యాయుల నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్లను ఉపకులాల వారీగా వర్గీకరణ చేపట్టిన అనంతరమే నోటిఫికేషన్‌ను జారీ చేయాలని విద్యాశాఖ భావిస్తున్నట్టు తెలుస్తోంది. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టడానికి అనుకూలంగా అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా రాష్ట్రాల్లో ఇదే విషయంపై చర్చ జరుగుతోంది. అయితే తెలంగాణ రాష్ట్రంలో విద్య, ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఇకపై రాబోయే ఉద్యోగాల నోటిఫికేషన్లలో ఎస్సీలకు కేటాయించే >>2












ఆదివారం సింగపూర్ నదిలో పడవలో ప్రయాణించి నది పునరుజ్జీవన క్రమాన్ని పరిశీలిస్తున్న సిఎం రేవంత్

# సింగపూర్ భారీ ఐటి పార్క్

>> జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎంవో స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ తరఫున ఇండియా ట్రస్ట్ మేనేజ్మెంట్ సీఈవో గౌరీశంకర్ నాగభూషణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు. క్యాపిటల్‌ల్యాండ్ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వాగతించారు. క్యాపిటల్ ల్యాండ్ గ్రూప్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలను క్యాపిటల్‌ల్యాండ్ నిర్మించే ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా గౌరీ శంకర్ నాగభూషణం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిరంగా వృద్ధి చెందుతోందని, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్‌ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటిపిహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలోనే అందుబాటులోకి వస్తుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది.

**సింగపూర్ నదిలో సిఎం రేవంత్‌రెడ్డి పడవ ప్రయాణం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగపూర్ పర్యటన విజయవంతంగా సాగింది. ఆదివారం సింగపూర్ నదిలో పడవ ప్రయాణం చేసి,అక్కడి నది పునరుద్ధరణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా పలు విషయాలను పంచుకున్నారు. సింగపూర్ నదిలో పడవ ప్రయాణం చేసి,నదుల పునరుజ్జీవనం సిటీ–స్టేట్ అనుసరించిన ఉత్తమ పద్ధతులు తెలుసుకున్నట్లు తెలిపారు. నీటి నిర్వహణలో పురోగతి, వారసత్వ భవనాల పునరుద్ధరణ,అద్భుతమైన కొత్త ఐకానిక్ భవనాలు, కార్యాలయాలు, నివాసాలు.పట్టణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం గమనించినట్లు పేర్కొన్నారు. ఇలా వరల్డ్ క్లాస్ హైదరాబాద్‌ను క్రియేట్ చేయడానికి మనం ఇంకా ఉత్తమ పద్ధతులను స్వీకరించడం నేర్చుకోవాలి. మనం చేస్తాము అని ధీమా వ్యక్తం చేశారు.

## ఢిల్లీ ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్‌గా సిఎం రేవంత్

### నియమించిన కాంగ్రెస్ హై కమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి19:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ హైకమాండ్ కీలక బాధ్యతను అప్పగించింది. రానున్న ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌ని స్టార్ క్యాంపెయినర్‌గా నియమించింది. రేవంత్ రెడ్డితో పాటు 40 మందిని కాంగ్రెస్ క్యాంపెయినర్లుగా నియమించింది. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు ప్రచారకర్తల జాబితాలో ఉన్నారు. అలాగే హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్టార్ క్యాంపెయినర్లుగా ఢిల్లీ ఎన్నిక ప్రచారంలో పాల్గొననున్నారు. కాగా దావోస్ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి ఈనెల 24వ తేదీన హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. మరుసటి ఢిల్లీకి వెళ్లి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేయనున్నారని సమాచారం. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

**వారం - వర్జ్యం**

తేది : 20-01-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
షష్ఠి ఉ.9.59
హస్త రా.8.29
వర్జ్యం : తె.5.31-7.20
దు.ము.12.48-1.33, 2) మ.3.03-3.48
శుభసమయం: ఉ.6.00-7.00
సా.3.50-4.30
రాహుకాలం - ఉ.7.30-9.00

**వార్తాఫలం**

**మేషం :** తనఖాలను విడిపించ గలుగుతారు. చాలా సందర్భాలలో మీ అంచనాలు తారుమారు అవుతాయి.

**వృషభం:** కుటుంబ ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**మిథునం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు చేయడం మంచిది. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కర్కాటకం:** సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఉపకరిస్తాయి. ధనలాభం.

**సింహం:** మానసిక, శారీరక శ్రమ అధికంగా ఉండటం వలన కొన్ని సందర్భాలలో ఏకాగ్రత లోపిస్తుంది.

**కన్య :** ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఒక వర్గానికి కావాలని చెరువ అవుతారు.

**తుల :** అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. అయితే ఇది తాత్కాలికంగా అయివుంటాయి.

**వృశ్చికం:** ఊహాజనితమైన మాటలతో మిమ్మల్ని నమ్మించడం కష్టతరమని ఇతరులు తెలుసుకోగలుగుతారు.

**ధనుస్సు:** ఉన్నతాధికారులు మీ శ్రమను గుర్తిస్తారు. తనఖా వస్తువులను విడిపించుకోగలుగుతారు.

**మకరం:** తోటలు కొనాలనుకునే మీ ఆలోచనలకు రూపం కల్పించడంలో కృతకృత్యులవుతారు.

**కుంభం:** కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి. సెల్ఫ్ డ్రైవింగ్‌లో జాగ్రత్తలు అవసరం.

**మీనం :** క్రమశిక్షణకు ప్రాధాన్యత నిచ్చి లాభపడుతారు. పట్టుదలతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## దావోస్ సదస్సుకు
# సిఎం బృందం పయనం

### వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సుకు హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మూడు రోజుల సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. అక్కడ నుంచి ఆదివారం రాత్రి సీఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు దావోస్‌కు బయల్దేరారు. సోమవారం స్విట్జర్‌లాండ్‌లోని దావోస్‌కు చేరుకుంటారు. అక్కడ నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ప్రపంచ వేదికపై తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటి చెప్పి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్య స్థానంగా పరిచయం చేసే భారీ లక్ష్యంతో రాష్ట్ర ప్రతినిధి బృందం దావోస్ పర్యటనకు బయల్దేరుతోంది. సింగపూర్ పర్యటన విజయవంతం కావటంతో దావోస్ సదస్సుపై భారీ అంచనాలు పెట్టుకుంది. చివరి రోజున సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అక్కడి ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బిఎఫ్) ప్రతినిధులతో ముఖాముఖి సంభాషణలు, చర్చలు జరిపింది. ఇండియన్ ఓషన్ గ్రూప్ ఫౌండర్, సీఈవో ప్రదీప్తో బిశ్వాస్, డీబీఎస్ కంట్రీ హెడ్ లిమ్ హిమ్ చౌన్, డీబీఎస్ గ్రూప్ హెడ్ అమిత్ శర్మ, బ్లాక్ స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండీ, ఛైర్మన్ గౌతమ్ బెనర్జీ, బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ సీనియర్ ఎండీ పెంగ్ వీ టాన్, మెయిన్ హార్ట్ గ్రూప్ సీఈవో ఒమర్ షాజాద్‌తో చర్చలు జరిపింది. హైదరాబాద్ లో పెట్టుబడులు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వారికి వివరించారు.

**విజయవంతమైన సింగపూర్ పర్యటన**

సింగపూర్‌లో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రతినిధి బృందం బిజీ బిజీగా గడిపింది. వివిధ రంగాల్లో పేరొందిన ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక చర్చల్లో పాల్గొంది. ఆశించిన పెట్టుబడుల ఒప్పందాలతో పాటు సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటీఈ)తో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన కుదుర్చుకోవటం కీలక పరిణామం. హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. రూ.3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో భారీ ఐటీ పార్కు ఏర్పాటుకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.450 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేయనుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.

# ట్రంప్ త్వరలోనే భారత్ పర్యటన?

**వాషింగ్టన్, జనవరి 19:** అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మరికొన్ని గంటల్లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. బాధ్యతల స్వీకరణ తర్వాత ఆయన భారత్‌లో పర్యటించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చైనాలోనూ పర్యటించే అవకాశాలున్నాయని సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. తాను అధికారం చేపట్టాక చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీజింగ్‌తో తన సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బాధ్యతల స్వీకరణ తర్వాత చైనాలో పర్యటించనున్నట్లు సమాచారం.

మరోవైపు.. భారత్‌లో పర్యటించే అంశంపైనా సలహాదారులతో చర్చలు జరిపినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. మరికొద్ది నెలల్లో వైట్‌హౌస్‌లో జరిగే దేశాధినేతల సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీని ట్రంప్ ఆహ్వానించే అవకాశముంది. ఈ సమావేశాల అనంతరం ఆయన భారత్‌లో పర్యటిస్తారనేది మీడియా కథనాల సారాంశం. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఇటీవల ట్రంప్ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ప్రపంచ శాంతి కోసం ఇరువురం కలిసి సాధ్యమైనంత మేరకు కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. కాబోయే అమెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకారానికి జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా ఇదివరకే పేర్కొంది. తమ ప్రతినిధిగా వైస్‌ప్రెసిడెంట్ హాన్‌జెంగ్‌ను పంపించనున్నట్లు వెల్లడించింది. భారత్ తరఫున విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ప్రమాణస్వీకారానికి హాజరుకానున్న విషయం విదితమే.

## పారాగ్లైడింగ్‌లో పట్టుతప్పి లోయలోపడి ఇద్దరుమృతి

**పనాజి, జనవరి 19:** పారాగ్లైడింగ్‌చేస్తూ ప్రమాదవశాత్తూ వంద అడుగుల ఎత్తునుంచి లోయలో పడిపోవడంతో పర్యాటకురాలు ఇన్‌స్ట్రక్టర్ మృతిచెందారు. ఈ ఘటన ఉత్తరగోవాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం మహారాష్ట్రలోని పూణెకు చెందిన 27 ఏళ్ల మహిళా పర్యాటకురాలు శనివారం సాయంత్రం గోవాలోని కేరి గ్రామానికి వచ్చింది. సుమల్ నేపాలి(26) అనే ఇన్‌స్ట్రక్టర్‌సాయంతో పారాగ్లైడింగ్‌కువెళ్లింది. 100 అడుగుల ఎత్తులో వీరు పట్టుతప్పి లోయలోపడిపోయా రు. ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఘటనా స్థలానికిచేరుకున్న పోలీసులు అడ్వెంచర్‌స్పోర్ట్స్ కంపెనీచట్ట విరుద్ధంగా పారా గ్లైడింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. కంపెనీ యజమాని శేఖర్ రైజాదాపై కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండురోజులక్రితం హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా,కులు జిల్లాల్లో24 గంటల వ్యవధిలో రెండు వేరువేరు పారా గ్లైడింగ్‌ప్రమాదాల్లో ఇద్దరు పర్యాటకులు మృతిచెందారు.

## జగన్ ఆస్తులపై
# అమిత్‌షా ఆరా!

### విశాఖ ప్యాలెస్‌కు రూ.200 కోట్ల జరిమానా?

**విజయవాడ,జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆస్తులు, ప్యాలెస్‌లపై ఏపీ మానవవనరుల శాఖా మంత్రిని అమిత్‌షా అడిగినట్లు టీడీపీ వర్గాలు విస్తృత ప్రచారం జరుగుతుంది. జగన్ కు ఎక్కడెక్కడ ఎన్నెన్ని ప్యాలెస్‌లు ఉన్నాయి, వాటి విస్తీర్ణం ఎంత అని ఆరా తీసినట్లు తెలిసింది. విశాఖ రుషికొండపై కట్టిన ప్యాలెస్‌కు ఎన్జీటీ నిబంధనల ప్రకారం రూ.200 కోట్ల జరిమానా కట్టేల్సిందేనని అమిత్‌షా అభిప్రాయపడినట్లు తెలిసింది.

సీఎం చంద్రబాబు నివాసంలో జరిగిన గత రాత్రి విందు సందర్భంగా జరిగిన భేటీలో అమిత్‌షా జగన్ ప్యాలెస్‌ల గురించి అడిగి మరీ తెలుసుకున్నట్లు సమాచారం. ఇడుపులపాయ, బెంగళూరు ఎలహంక, హైదరాబాద్ లోటస్‌పాండ్, తాడేపల్లిలో ప్యాలెస్‌లు ఉన్నాయని లోకేశ్ అమిత్‌షాకు వివరించారు. ఒక్కొక్కటి ఎన్ని ఎకరాలు ఉండొచ్చని అడగ్గా హైదరాబాద్, తాడేపల్లి ప్యాలెస్‌లో పది ఎకరాల్లోపు ఉంటాయని లోకేశ్ బదులిచ్చారు. బెంగళూరు ప్యాలెస్ విస్తీర్ణం గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. సుమారు 30 ఎకరాలకు పైనే ఉందని లోకేశ్ అందుకు బదులిచ్చారు. దానికి అన్ని ఎకరాల్లోనా? అంటూ అమిత్ షా అశ్చర్యం వ్యక్తం చేసినట్లు సమాచారం.

**ఎన్జీటీ 200 కోట్ల జరిమానా వేసిందన్న లోకేశ్**

విశాఖలోనూ రూ.500 కోట్లు వెచ్చించి ప్యాలెస్ కట్టించారని లోకేశ్ చెప్పగా అది ప్రభుత్వ డబ్బుతో కట్టిందే కదా? అని అమిత్ షా అన్నారు. నిక్షేపంగా ఉన్న పాత పర్యాటకశాఖ కాటేజీలను కూల్చేసి, పర్యావరణాన్ని విధ్వంసం చేసి ఆ ప్యాలెస్లు కట్టారని లోకేశ్ వివరించారు. దానికి ఎన్జీటీ రాష్ట్రప్రభుత్వానికి 200 కోట్ల జరిమానా వేసిందని లోకేశ్ గుర్తు చేశారు. ఆ భారం ఇప్పుడు తమ ప్రభుత్వంపై పడిందని వివరించారు. ఆ జరిమానా కట్టేశారా? అని షా ప్రశ్నించగా ఇంకా లేదని లోకేశ్ బదులిచ్చారు.

**ఎన్జీటీ జరిమానాను కట్టాల్సిందేనన్న అమిత్ షా**

ఎన్జీటీ నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయని అమిత్ షా తెలిపారు. ఎన్జీటీకి ఆ డబ్బు ఎప్పటికైనా కట్టాల్సిందేనని అమిత్‌షా అన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ ప్రజల్లో తిరుగుతున్నారా? అని షా ప్రశ్నించారు. అందుకు బదులుగా ఎక్కువగా బెంగళూరులోనే ఉంటూ, అప్పుడప్పుడూ వచ్చి ప్రకటనలు మాత్రం ఇస్తున్నారని లోకేశ్ వివరించారంటున్నారు.ఆదివారం అమిత్‌షా జగన్ ఆస్తులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆరా తీసారంటున్నారు.

## అమెరికా అధ్యక్షుడుగా
# ట్రంప్ పదవీస్వీకారం నేడే

### కేపిటల్ హిల్స్‌కు చేరిన దేశ, విదేశ ప్రముఖులు

### భారత్ తరఫున హాజరవుతున్న విదేశాంగ మంత్రి జైశంకర్

**వాషింగ్టన్, జనవరి 19:** అగ్రరాజ్యం అధ్యక్షపదవీస్వీకారంపై ప్రపంచదేశాలు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఆహ్వానాలు అందుకున్న అధినేతలు అందరూ ఇప్పటికే అమెరికాకు చేరుకున్నారు. గడ్డకట్టే చలిలో అమెరికా 47వ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారంచేసేందుకు ఇప్పటికే డొనాల్డ్‌ట్రంప్ వాషింగ్టన్ చేరుకున్నారు. సోమవారం వాషింగ్టన్ డిసిలో మైనస్ 11 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుందన్న అంచనాలతో ట్రంప్ పార్లమెంటు భవనంలోనే రోటుండా కాంప్లెక్స్‌లోప్రమాణ స్వీకారంచేస్తారు. తూర్పు ప్రామాణిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుంది. అదే భారత కాలమానంప్రకారం రాత్రి 10.30 గంటలకు ప్రమాణస్వీకారం జరుగుతుంది. ముందుగా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ప్రమాణంచేసి బాధ్యతలు స్వీకరిస్తారు. తర్వాత అధ్యక్షుడి ప్రమాణస్వీకారం ఉంటుంది. తన తల్లి ఇచ్చిన బైబిల్‌తోపాటు మరొక ప్రత్యేక బైబిల్‌ను చేతబూని ట్రంప్‌చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిప్రమాణస్వీకారంచేయిస్తారు. క్యాపిటల్ హిల్స్‌లో జరిగే ప్రమాణ స్వీకారానికి శరవేగంగాఏర్పాట్లుపూర్తిచేసారు. డొనాల్డ్‌ట్రంప్ కుటుంబ సమేతంగా ఇప్పటికే వర్జీనియాలోని తన గోల్ఫ్‌క్లబ్‌కు చేరుకున్నారు. తన కేబినెట్ నామినిలు పీటే హెగ్‌సేత్, లీజెల్డిన్‌లు కూడా ఆయన వెంట ఉన్నారు. పూర్వ అధ్యక్షులతోపాటు పలుదేశాల ప్రతినిధులు, అధినేతలు మాజీలు కూడా ఈ ప్రమాణస్వీకారానికి హాజరవుతున్నారు. ఇప్పటికే టికెట్లు పొందిన అతిథులు అందరూ క్యాపిటల్‌హిల్స్ వైపు రాసాగారు. టెక్, పారిశ్రామిక దిగ్గజాలతోపాటు మాజీ అధ్యక్షులు వారి కుటుంబాలతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పూర్వ అధ్యక్షులు బిల్‌క్లింటన్, జార్జి డబ్ల్యు బుష్, బరాక్ ఒబామా, ప్రస్తుతం దిగిపోనున్న అధ్యక్షుడు జోబైడెన్ సతీసమేతంగా హాజరవుతారు. అయితే బరాక్ ఒబామా సతీమణి మిషెల్ ఒబామా తాను రాలేనని ప్రకటించడంతో ఒబామా మాత్రమే హాజరవుతున్నారు. హిల్లరీ క్లింటన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, ఇటాలియన్ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, అర్జంటీనా అధ్యక్షుడు గ్జేవియర్ మిలీ, హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్, భారత్ తరఫున విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్, జపాన్ విదేశాంగమంత్రి తకేసి ఇవాయాలు హాజరవుతున్నారు. ఇంగ్లండ్ మాజీఅధ్యక్షుడు నిగెల్‌పాల్ ఫారెజ్, ఎరిక్ జెమ్మూర్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్‌బోల్సో నారోలు కూడాఆహ్వానితుల్లో ఉన్నారు. ఎనిమిదేళ్లక్రితం ట్రంప్ తొలిసారి 2017లో అమెరికా అధ్యక్షుడుగా వచ్చారు. 2017నుంచి 2021వరకూ సేవలందించారు. 2020 ఎన్నికల్లో జోబైడెన్ చేతిలో ఓటమి చవిచూసారు. అయితే అనూహ్యంగా గత ఏడాదిజరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ట్రంప్ విజయం సాధించారు. దీనితో సోమవారం 47వ అధ్యక్షునిగా ప్రమాణస్వీకారంచేస్తారు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌కు ఆహ్వానం వెళ్లలేదు. అయితే తర్వాత పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక భేటీ కానున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీలు ఈ కార్యక్రమానికి హాజరుకావడంలేదు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ వున్‌కు ఆహ్వానం ఉందా లేదా అన్నది స్పష్టత రాలేదు. కాగా 2020లో క్యాపిటల్‌హిల్స్ భవనంపై దాడిలో ఉన్న నిందితులకు కూడా ఆహ్వానం అందింది. వారంతా కోర్టు అనుమతులు తీసుకుని ఈకార్యక్రమంలో పాల్గొంటున్నట్లు సమాచారం.

## దేశంలో 90కోట్లు దాటేసిన ఇంటర్నెట్ వినియోగదారులు


**న్యూఢిల్లీ, జనవరి 19:** దేశంలో ఇంటర్నెట్ వినియోగించే చందాదారుల సంఖ్య 90 కోట్లను దాటేసింది. డిజిటల్ కంటెంట్‌కోసం ప్రాంతీయ భాషల వినియోగంపెరగడమే ఇందుకు కారణమని ఐఎఎంఎఐ కాంటార్‌నివేదిక స్పష్టంచేసింది. ది ఇంటర్నెట్ ఇన్ ఇండియా రిపోర్ట్ 2024 పేరిట ఈ నివేదిక విడుదలచేసింది. 2023తోపోలిస్తే 2024లో ఇంటర్నెట్ చందాదారులసంఖ్య 8శాతంపెరిగి 88.6 కోట్లుగా ఉంది. గ్రామీణభారత్‌లో 48.8 కోట్లమంది ఇంటర్నెట్ వినియోగదారులున్నారు. మొత్తం ఇంటర్నెట్ జనాభాలో గ్రామీణ వాటా 55శాతంగా ఉంది. భారత్‌లో ఇంటర్నెట్ వినియోగధోరణ/ల్లో ప్రాంతీయభాషలు కీలకపాత్రపోషిస్తున్నాయి. భారత భాషల్లోని కంటెంట్‌ను 98శాతం మంది ఇంటర్నెట్ వినియోగదారులు వాడుతున్నారు. తమిళం, తెలుగు, మలయాళం ఇందులో ముందున్నాయి ఈభాషల్లో కంటెంట్ అధికంగా లభించడమే ఇందుకు కారణమని తేలింది.పట్టణ ఇంటర్నెట్ వినియోగదారుల్లో 57శాతంమంది ప్రాంతీయ భాషల కంటెంట్ వినియోగానికి ఆసక్తిచూపిస్తున్నారు.

# డిఎస్సీ నోటిఫికేషన్!

>> సీట్లను ఉపకులాల వారీగా కేటాయించాల్సి ఉంటుంది. ఇందుకోసం రాష్ట్రంలో ఎస్సీ జనాభా లెక్కలను చేపడుతున్నారు. జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ వర్గీకరణను అమలు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎస్సీలో మాల, మాదిగతోపాటు మాల, మాదిగ ఉపకులాలు కూడా కొనసాగుతున్నాయి. అయితే ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం కాకుండా వారందరినీ ఎస్సీగానే భావిస్తూ రిజర్వేషన్లను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ నెలకొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇకపై రాష్ట్రంలో విద్యా, ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లను ఉపకులాల వారీగా అమలు చేయనున్నారు. ఎలా అంటే ప్రస్తుతం విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 29 శాతం, ఇతరులకు 50 శాతం అమలు చేస్తున్నారు. అయితే బీసీల్లో ఉన్న ఉప కులాల వారీగా వారికి కేటాయించిన 29 శాతంలో బీసీ–ఏలకు 7 శాతం, బీసీ–బీ లకు 10 శాతం, బీసీ–సీలకు ఒక శాతం, బీసీ–డీలకు 7 శాతం, బీసీ–ఈ లకు 4 శాతం కలిపి అమలు చేస్తున్నారు. ఇకపై ఎస్సీలకు కూడా వారి జనాభాలోని ఉపకులాల వారీగా అమలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎస్సీ జనాభా సేకరణ చేపట్టి, వారిలో ఉన్న ఉప కులాల వారీగా రిజర్వేషన్ల అమలుపై తేల్చడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏక సభ్య కమిషన్‌ను గత ఏడాది అక్టోబర్‌లో ఏర్పాటు చేసింది. కమిషన్ నవంబర్ మొదటి వారంలో బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు తీసుకుని ఈ నెల 6 తేది నాటికి 60 రోజులు పూర్తయిన నేపథ్యంలో తమ కమిషన్ నివేదికను సమర్పించడానికి మరో నెల రోజుల సమయం కావాలని కోరినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏక సభ్య కమిషన్ ఫిబ్రవరి మొదటి వారంలో తమ నివేదికను హైకోర్టుకి సమర్పించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ లోపుగా ప్రభుత్వానికి సమర్పించనుంది. అయితే ఏకసభ్య కమిషన్ నివేదికతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సబ్‌కమిటీని సైతం ఏర్పాటు చేసింది. కేబినెట్ సబ్ కమిటీ కూడా రాష్ట్రంలోని ఎస్సీ వర్గీకరణపై తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ నేపథ్యంలో రెండు కమిటీలు సమర్పించే నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు భవిష్యత్‌లో జరిగే ఉద్యోగ నియామకాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లను అమలు చేస్తారు. అయితే రాష్ట్రంలో ఎస్సీ జనాభా లెక్కలను అధికారికంగా 2011లో చేపట్టారు. 2021లో జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ కేంద్రం చేపట్టలేదు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. అయితే ఆ సర్వే వివరాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సమగ్ర సర్వేను నిర్వహించింది. వాటి వివరాలను కూడా ఇప్పటి వరకు ప్రకటించ లేదు. ఈ నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు అధికారికంగా 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని లెక్క కడతారా? లేకపోతే 2021లో ఉన్న జనాభా ఆధారంగా చేపడతారా? లేకపోతే 2015లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలోని జనాభా ఆధారం చేసుకుంటారా? లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే ఆధారంగా చేపడతారా? అనేది కమిటీ సమర్పించే నివేదికను బట్టి తెలిసే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం తేల్చిన తరువాతనే డీఎస్సీ–2025కి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# ఖోఖో ఛాంపియన్‌షిప్ భారత్ కైవసం

### 18 పాయింట్లతో పురుషుల జట్టు, 38 పాయింట్లతో మహిళా జట్లే ఛాంపియన్లు



న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల్లో మహిళల జట్టు విజేతలు

**న్యూఢిల్లీ, జనవరి 19:** దేశరాజధానిలో జరిగిన ప్రపంచ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరఫున ఆడిన పురుషులు, మహిళా జట్లు రెండూ కూడా ఛాంపియన్‌షిప్‌ను కైవసంచేసుకన్నాయి. పురుషుల జట్లలో ఢిల్లీ వేదికగా నేపాల్‌తో జరిగిన ఫైనల్‌పోరులో పురుషుల జట్టు విజయం సాధించింది. 54-36 తేడాతో ఆజట్టుపై గెలిచింది. తొలిరౌండ్‌లో 26-18 ఆధిక్యంలోనిలిచిన భారత్ అదేజోరు చివరివరకూ కొనసాగించింది. మూడో రౌండ్‌ముగిసేనాటికి 56-18 లీడ్‌లోకి వెళ్లింది. నాలుగోరౌండ్‌లో ఎదురుదాడికి దిగిన నేపాల్ 37 పాయింట్లు సాధించాల్సి ఉండగా కేవలం మరో 18 పాయింట్లుమాత్రమే సాధించి 36 పాయింట్లవద్ద చేతులెత్తేసింది. దీనితో భారత పురుషులజట్టుప్రపంచ ఖోఖో ఛాంపియన్‌షిప్‌ట్రోఫీని సాధించింది. అయితే ఇపుడు భారత్ విజయం సాధించింది అటు పురుషులతోను ఇటు మహిళా జట్లు రెండూ కూడా నేపాల్ జట్లపైనే సాధించడం గమనార్హం. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలోజరిగిన ఫైనల్‌లో భారత్ 78-40తో నేపాల్‌ను చిత్తుచేసింది.

**భారీ స్కోరుతో నేపాల్ జట్టును చిత్తుచేసిన భారత్ మహిళలు.**

ఇందిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో భారత్ 78-40 స్కోరుతో నేపాల్‌ను చిత్తుచేసింది. ఖోఖో ప్రపంచకప్‌ను నిర్వహించడం ఇదే తొలిసారి. తుదిపోరు టర్న్‌వన్‌లో భారత్‌దూకుడుగా ఆడి 34-0తో తిరుగులేని ఆధిక్యంలోనిలిచింది. తర్వాతనేపాల్ పుంజుకోవడంతో 35-24తో రెండో టర్న్ ముగించింది. మూడో టర్న్‌లో భారత్ మళ్లీ దూకుడుపెంచి వరుసగా పాయింట్లుసాధించి తన ఆధిక్యతను 49కి పెంచుకోగలిగింది. చివరిటర్న్‌లో నేపాల్ 16 పాయింట్లుసాధించడంతో 38 పాయింట్లతో భారత్ మహిళాజట్టు ఘనవిజయం సాధించింది.

# నేడు, రేపు పాట్నాలో స్పీకర్లు, చైర్మన్ల సదస్సు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఏఐపిఓసి) జనవరి 20, 21 తేదీలలో జరుగనుంది. ఈ సదస్సులో పాల్గొనడానికి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి.నరసిం హాచార్యులు, అధికారులు పాట్నాకు వెళ్లారు. ఇదే ఏఐపిఓసీ కాన్ఫరెన్స్‌కు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు కూడా వెళ్తున్నారు. వీరంతా ఆదివారం ఉదయం వారు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరి పాట్నాకు వెళ్లారు.




ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరించాక మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

# ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇళ్లు

### హౌసింగ్ శాఖను పునరుద్ధరించాం

### రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** కూడు గూడు గుడ్డ … గరీబీ హటావో నినాదంతో ఇందిరమ్మ పేదల గుండెల్లో కొలువైందని, అట్లాంటి ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ క్యాలండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశల వారీగా రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసిందని. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఈ శాఖను పునరుద్ధరించి లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుందని అన్నారు. 326 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గారెంటీలు పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది మంది నీడలేని పేదలకు ఐదు లక్షల రూపాయల స్కీమ్‌తో పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది అని దానికి గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పూర్తిగా సహకరించాలని, మరింత కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ రవీందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట రామిరెడ్డి, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి జెఎల్స్‌కు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

### 31 వరకు కొనసాగనున్న ప్రక్రియ

### మార్చి చివరి వారంలో కౌన్సెలింగ్

### ఏప్రిల్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్స్‌కు అవకాశం!

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన అభ్యర్థులకి రేపటి(మంగళవారం) నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 31 వరకు వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను హైదరాబాద్‌లో కొనసాగించనున్నారు. నాంపల్లిలోని ఇంటర్‌బోర్డు వెనుక ఉన్న ఎంఏఎం మోడల్ జూనియర్ బాలికల కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌నను కొనసాగించనున్నారు. మల్టీజోన్-1, 2 అభ్యర్థులందరికీ ఇక్కడే సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 1392 జేఎల్స్ పోస్టుల భర్తీ కోసం 2022లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నోటిఫికేషన్‌ను జారీ చేసి.. పరీక్షలను నిర్వహించి.. అనంతరం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఇంటర్ కమిషనరేట్‌కి పంపించింది. 1,392 పోస్టులకుగానూ 1,288 మందిని సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తున్నారు. జేఎల్స్‌గా ఎంపికైన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగిన తరువాత వారికి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కౌన్సెలింగ్ ద్వారా నియామక పత్రాలను అందజేయనున్నారు. అయితే ఈ నెలాఖరు వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసినప్పటికీ వారికి నియామక పత్రాలు ఏప్రిల్‌లో ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఉండటం.. ఆ తరువాత మార్చి 5 నుంచి 25 వరకు వార్షిక పరీక్షలు కొనసాగనున్నాయి. ఈ సమయంలో కొత్తగా నియామకాలు చేపడితే వారికి పోస్టింగ్స్ ఇవ్వడానికి గెస్టు లెక్చరర్ల సమస్య అడ్డంకిగా మారే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం 1650 మంది గెస్టు లెక్చరర్లు మార్చి 31 వరకు కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తరువాత మార్చి చివరి వారంలో వారికి పోస్టింగ్‌ల కోసం కౌన్సెలింగ్‌ను నిర్వహించి.. ఏప్రిల్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్స్‌ను ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# సిఎం రేవంత్‌కు పాలనపై పట్టుందా.. లేదా?

### రూ.50 వేల నుండి రూ.2 లక్షల వరకు లంచాల కోసం డిమాండ్

### పేదల జోలికొస్తే చూస్తూ ఊరుకోం: బిజెపి ఎంపి ఈటల రాజేందర్



**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలన మీద పట్టు ఉందా? లేదా? అని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నించారు. అధికారుల మీద మంత్రులకు పట్టు లేదని, అధికారులు బ్రోకర్ల లాగా మారిపోయి వేధిస్తున్నారని అన్నారు. రూ.50 వేల నుండి రూ.2 లక్షల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నాడు బిజెపి సీనియర్ నేతలు బద్దం బాల్‌రెడ్డి, దత్తాత్రేయ, నరేంద్రలు అండగా నిలపడి పేదలకు ఇల్లు ఇప్పించారన్నారు. ఆ గూడు చెదరగొట్టాలని ప్రయత్నిస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. మా పార్టీ ఎదుగుదుల ఇష్టం లేనివారు అబద్దాల పుట్టిస్తారు. అలాంటి వాటిని మేము పట్టించుకోమని, మల్కాజిగిరిలో ఓడిచడం నీ జేజమ్మ తరం కాదు అని అప్పుడు చెప్పిన. ఇప్పుడు చెప్తున్నా అన్నారు. రాబోయే రోజుల్లో బిజెపిని ఓడించడం ఎవరి తరం కాదు. రేపటి శకం బిజెపిది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి 3 నెలలు పాటు హైడ్రా పేరిట పెదల ఇల్లు కూలగొట్టారు. కొన్ని నెలలు మూసీ పక్కన ఉన్న పేదల ఇళ్ళు కూలగొట్టారు. ఇప్పుడు బస్తీల్లో ఉన్న ఇళ్ళ మీద పడ్డారు. దేశంలో అతిపెద్ద, పురాతన స్లమ్ బాలాజీనగర్, జవహర్‌నగర్. ఇక్కడ దేశవ్యాప్తంగా వచ్చిన వారు 1985 నుండి ఇక్కడ పిల్లలతో నివాసం ఉంటున్నారు.

1941లో సైనికులకోసం 5977.3 ఎకరాల భూమిని 4 లక్షల యాభై వేలకు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం సేకరించి ఇచ్చింది. ఈ భూమి 1948 వరకు సికింద్రాబాద్ ఎస్టేట్ ఆఫీసర్ అధీనంలో ఉండేవి. నిజాంపాలన అంతం అయ్యి స్వాతంత్రం వచ్చాన తరువాత సైనికులకు సొసైటీకీ 1951 ఎంఈఓకు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని కేర్‌టేకర్‌గా మాత్రమే నియమించింది. ఈ భూమికి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. రక్షణ శాఖకు సంబంధించిన భూమి అన్నారు. సైనికులు అమ్ముకుంటే పేదలు కొనుక్కున్నారు. 1994 గుడిసెలు కూల్చివేయాలని అప్పటి రెవెన్యూ మంత్రి కమతం రామచందర్ అదేశలిస్తే టైగర్ నరేంద్ర నాయకత్వంలో ఎదురుతిరిగి ఆపేసారు. మళ్ళీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆ ఇల్లు కూలగొట్టలని చూస్తున్నారని అన్నారు.

1998 అరుంధతి నగర్లో 1705 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకున్నవారికి భూములు ఇచ్చారు. ఆ ఇళ్లను ఇప్పుడు కూలుస్తారట అన్నారు. మాజీ సైనికులు కోర్టుకు పోతే రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. అయినా బుద్ధి రాలేదన్నారు. ఇక్కడ ఎంపిగా గెలిచిన మీకు బాలాజీనగర్ బాధలు తెలుసు కదా, ఎందుకు ఈ ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. పేదల జోలికి వస్తె చూస్తూ ఊరుకోం. కోటిన్నర జనాభాకి ఒకే డంప్ యార్డ్ జవహర్ నగర్ డంప్ యార్డ్ కానీ 2 లక్షల మంది జీవితాలు విష తుల్యం చేస్తున్నారు. దీనిమీద బిజెపి గ్రీన్ ట్రిబ్యు నల్‌కి వెళ్లింది. ప్రభుత్వాన్ని ఆదేశించిన పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరం నోటీసుల గురించి మిడిమిడి జ్ఞానం ఉన్నవారు, ప్రోటోకాల్ తెలియని వారు మాట్లాడుతుంటారు. అన్ని డిపార్ట్మెంట్ బిల్లులు విడుదల చేయాల్సిన బాధ్యత ఫైనాన్స్ డిపార్టుమెంట్ మీద ఉంటుంది. మా పార్టీ ఎదుగుదుల ఇష్టం లేనివారు అబద్దాల పుట్టిస్తారు. అలాంటి వాటిని మేము పట్టించుకోమని అన్నారు. ఆనాడు పనిచేసిన అధికారులకు రిటైరు మెంట్ అయినవారు బిల్లుల కోసం పోతే 7-10 శాతం లంచం ఇస్తే తప్ప బిల్లు బయటకు రాని పరిస్థితి. ఇళ్ళల్లో ఉండే వాళ్లు కూడా దుఖానాలు తెరిచారు. మళ్ళీ అధికారంలోకి వస్తామో లేదో అని అందినకాడికి దండు కుంటున్నారు. ఈ సమావేశంలో మాజి ఎంఎల్‌సి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ సైదిరెడ్డి, మురళీధర్ గౌడ్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, సత్యం, భూములకు సంబంధించిన ఇమాన్యుల్, జావేద్ పాల్గొన్నారు.

# బీదర్, అఫ్జల్‌గంజ్ ఘటనల నిందితుల కోసం ఇంకా గాలింపు

### ఇద్దరు నిందితులు హైదరాబాద్‌లోనే.. పోలీసుల అనుమానం

### పలుచోట్ల తనిఖీలు, అనుమానితుల విచారణ

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** కర్ణాటకలోని బీదర్‌లో ఎటిఎంలో నగదు నింపే ఉద్యోగిని కాల్చిచంపి 93 లక్షల నగదు దోపిడితో పాటు నగరంలోని అఫ్జల్ గంజ్‌లో ట్రావెల్స్ ఉద్యోగిపై కాల్పులకు పాల్పడి రెప్పపాటులో పారిపోయిన ఇద్దరు నేరగాళ్ల కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. మోటార్ సైకిల్‌పై బీదర్‌లో దోపిడికి పాల్పడి అక్కడి నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు బైక్‌పై వచ్చిన వీరు అనంతరం బస్సులో హైదరాబాద్‌కు రావడం తెలిసిందే. దీని తరువాత అఫ్జల్‌గంజ్‌లో రోషన్ ట్రావెల్స్ బస్సులో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వెళ్లే క్రమంలో బస్సులో ప్రయాణిస్తూ లగేజి తనిఖీ చేసిన ఉద్యోగి జహంగీర్‌పై కాల్పులు జరిపి రెప్ప పాటులో పారిపోవడం విదితమే. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికిందరాబాద్‌లోని అల్ఫా హోటల్ వరకు ప్రయాణించిన నిందితులు అక్కడి నుంచి రైలులో బిహార్ లేదా ఛత్తీస్‌ఘ డ్‌కు పారిపోయి వుంటారని మొదట పోలీసులు భావించారు. దీనిపై ఇద్దరు నిందితుల కోసం రైల్వే స్టేషన్లలోని సిసి కెమెరాలను పరిశీలించగా అందులో వీరి ఫుటేజిలు లేకపోవడంతో వీరు హైదరాబాద్‌లోనే మకాం వేసి వుంటారని భావిస్తూ నగరంలోనే గాలింపు చేబట్టారు.

బీదర్‌లో దోపిడీ, అఫ్జల్‌గంజ్‌లో కాల్పులకు పాల్పడింది ఒకే ముఠాగా నిర్ధారణ అవడం, నిందితుల ఫోటోలు ట్రావెల్స్ కార్యాలయంలోని సిసి కెమెరాలలో వుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు దీని ద్వారా నగరంలోని అనుమానిత ప్రాంతాలలో ముమ్మరంగా సోదాలు చేయసాగారు. బీదర్, అఫ్జల్‌గంజ్ ఘటనల్లో ఒకడిని కరుడుగట్టిన నేరగాడు మనీష్‌గా గుర్తించడం తెలిసి ందే. ఇతను బిహార్‌లోని కరుడుగట్టిన దొంగల ముఠా అమిత్ కుమార్ బ్యాచ్‌లో సభ్యుడుగా భావిస్తున్నారు. మనీష్‌పై బిహార్‌తో పాటు ఛత్తీస్‌ఘడ్‌లో అనేక కేసులున్నట్లు తేలింది.

దోపిడిలు, దొంగతనాలు, కిడ్నాపులతో పాటు నేరాలకు పాల్పడే సమయంలో అడ్డువచ్చిన వారిని కాల్చి చంపిన కేసులు ఇతని ముఠాపై వున్నాయి. ఈ క్రమంలో ఇద్దరు నేరగాళ్ల ప్రయాణించిన ఆటో డ్రైవర్‌ను గుర్తించిన పోలీసులు అతడిని విచారించి కొంత సమాచారం రాబట్టి దాని ఆధారంగా విచారణ వేగవంతం చేసి వీరికి నగరంలో ఎవరైనా ఆశ్రయం ఇచ్చి వుంటారా…? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు శాంతి భద్రతల పోలీ సులు ముమ్మరంగా గాలింపు చేయడంతో పాటు అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు చేయసాగారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బీదర్, అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపి ఒక చోట దోపిడికి పాల్పడ్డ ఇద్దరు నిందితుల కోసం తెలంగాణతో పాటు కర్ణాటక, బిహార్, ఛత్తీస్‌గఢ్‌లలో పోలీసులు ప్రత్యేక బృందాల తో గాలిస్తున్నారు.

# ఉచిత గృహ విద్యుత్‌కు రూ.125.84 కోట్లు విడుదల

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణలో గృహజ్యోతి పథకం కింద అమలు చేస్తున్న ఉచిత కరెంట్ నిమిత్తం విద్యుత్ పంపిణీ సంస్థలకు సబ్సిడీ సొమ్మును రాష్ట్ర సర్కార్ విడుదల చేసింది. ఈ నెలకు గాను రూ.125.84 కోట్లను విద్యుత్ సంస్థలకు విడుదల చేస్తూ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 200 యూనిట్ల దాకా వినియోగించే పేద వర్గాలకు ఈ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్న విషయం విదితమే. గత మార్చి ఒకటి నుంచి అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 148.5 కోట్ల రూపాయలను చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో గృహ జ్యోతి పథకం అమలు చేస్తున్నప్పటి నుండి ఇప్పటి వరకు విద్యుత్ పంపిణీ సంస్థలకు 1,485 కోట్ల రూపాయలను చెల్లించింది. కాగా నెలకు 200 యూనిట్ల లోపు కరెంటు వినియోగిస్తున్న 50 లక్షల కుటుంబాలకు గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లులను విద్యుత్ పంపిణీ సంస్థలు జారీ చేస్తున్నాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 10.52 లక్షల కుటుంబాలు గృహ జ్యోతి పథకం కింద ప్రయోజనం పొందుతున్నాయి.



ఆదిలాబాద్ జిల్లా మాలేపూర్ ఘాట్ వద్ద యాత్రికుల బస్ బోల్తా పడిన దృశ్యం.

# ఆదిలాబాద్ జిల్లాలో యాత్రికుల బస్సు బోల్తా.. 47 మందికి గాయాలు

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాలేపూర్ ఘాట్ వద్ద ఆదివారం మధ్యాహ్నం యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులో వున్న 60 మందిలో 47 మంది యాత్రికులకు గాయాలయ్యాయి. కాగా దీనిపై సమాచారం అందిన వెంటనే పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని బస్సులో గాయపడ ప్రయాణికులను వెంటనే రిమ్స్, నార్నూర్, ఉట్నూర్ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలందించారు. కాగా ఈ బస్సులో ప్రయాణిస్తున్న వారు ఆదిలాబాద్‌లోని గుడిహత్నూరు మండలం సూర్యగూడ గ్రామానికి చెందిన ఆదివాసీలుగా గుర్తించా రు. వీరంతా కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయానికి వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో వున్న 60 మంది లో 13 మందికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంలో గాయపడిన వారి పరిస్థితి బాగానే వుందని పోలీసులు తెలిపారు.

# మహిళలకు భరోసా కేంద్రం ఎంతో ఉపయోగకరం

### నిజామాబాద్‌లో కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలో భరోసా కేంద్రాన్ని రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ప్రారంభించారు. పోలీసు శాఖలో ఇది 28వ భరోసా కేంద్రం కావడంతో ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, డిజిపి జితేందర్, మహిళా భద్రతా విభాగం డిజి శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి మాట్లా డుతూ నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటైన భరోసా కేంద్రం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అనేక కేసుల్లో బాధితులుగా వున్న మహిళలకు భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. భరోసా కే ంద్రం ద్వారా బాధితులకు ఉపాధి ఇవ్వడంతో పాటు ఆర్థికంగా అండగా వుంటుందని మంత్రి తెలిపారు. 2016 నుంచ 2024 వరకు భరోసా కేంద్రం ద్వారా 6910 ఫోక్సో కేసులు, 11,663 గృహ హింస కేసులు, 1770 అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడంతో పాటు ఈ కేసుల్లో బాధితులకు అండగా నిలిచిం దని ఆయన తెలిపారు. భరోసా కేంద్రానికి వచ్చే బాధితులకు ఇక్కడి అధికారులు అన్ని రకాలుగా అండగా వుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రా జీవ్ గాంధీ హనుమంతు, మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్ సింధూ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# సిటీ పోలీసువిభాగంలో శాంతిభద్రతల కోసం 573 ఎఆర్ కానిస్టేబుళ్ల అటాచ్

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** నగర పోలీసు విభాగంలో శాంతి భద్రతల పరిరక్షణకు సాయుధ బలగంలో వున్న 573 మంది కానిస్టేబుళ్లను శాంతి భద్రతల విభాగానికి అటాచ్ చేశారు. ఇందులో 223 మంది మహిళలు కాగా 350 మంది పురుషులు వున్నారు. వీరిని నగరంలోని 71 శాంతి భద్రతల పోలీసు స్టేషన్లకు 284 మంది, ట్రాఫిక్ విభాగానికి 225 మంది, ఎస్‌బికి 25, టాస్క్‌ఫోర్స్‌కు 25 మంది, నార్కోటిక్ వింగ్‌కు ఎనిమిది మంది, సైబర్ క్రైం విభాగానికి ఆరుగురిని కేటాయించారు. ఈ మేరకు సిటీ కొత్వాల్ ఆనంద్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతల విభాగానికి అటాచ్ అయిన సాయుధ బలగం కానిస్టేబుళ్లతో కమిషనర్ ఆనంద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త సిబ్బంది ఎలా విధులు నిర్వహించాలనే దానిపై ఆయన సూచనలు చేశారు.

# తెలంగాణవైపు మావోయిస్టుల చూపు

### ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎదురుదెబ్బలతో కుదేలవుతున్న నక్సల్స్

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** నాలుగు దశాబ్దాలకుపైగా తమకు పెట్టనికోటగా వున్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌ను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు వరుస దాడులు నిర్వహిస్తుండటంతో మావోయిస్టులు ఆ రాష్ట్రాన్ని వదిలి తెలంగాణవైపు చూస్తున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. అబూజ్‌మడ్‌లో నక్సల్స్ స్థావరాలను 2026 మార్చి నాటికి ఎట్టి పరిస్థితుల్లో అయినా ధ్వంసం చేయాల్సిందేనని కేంద్రం నిర్ణయించి ఇందుకు అనుగుణంగా సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్, ఐటిబిపి బలగాలతో పాటు ఛత్తీస్‌గఢ్ సాయుధ బలగాలను వేల సంఖ్యలో మోహరించడం తెలిసిందే. పారామిలటరీ బలగాలతోపాటు రాష్ట్ర పోలీసులు నక్సల్స్ స్థావరాలపై వరుసగా దాడులు చేస్తుండడం మావోయిస్టులను ఉక్కిరి బిక్కిరి చేయసాగింది. ఓవైపు ఎన్‌కౌంటర్లు పెరుగుతుండగా మరోవైపు లొంగుబాట్లు కూడా పెరిగి పోతుండడం, ఇంకోవైపు కొత్త భర్తీలు ఆశించినంతగా లేకపోవడం మావోయిస్టులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందనే వార్తలు వస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే మావోయిస్టులు తమ స్థావరాలను ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు మార్చాలని భావిస్తున్నారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. అయితే రాష్ట్రంలోకి నక్సలైట్లు రాకుండా కట్టడి చేసేందుకు సరిహద్దు జిల్లాల పోలీసు విభాగాలు ముందస్తు చర్యలు చేబట్టాయి. సరిహద్దుల్లో గ్రే హౌండ్స్ బలగాలచే నిరంతరంగా పహారా కొనసాగిస్తున్నాయి.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నిన్నమొన్నటి వరకు నక్సలైట్లకు పూర్తి సురక్షిత ప్రాంతం. 3600 కిలోమీటర్ల విస్తీర్ణం గల దట్టమైన అటవీ ప్రాంతం, కొండలు, నదులు వున్న అబూజ్‌మడ్‌లో దశాబ్దాలుగా నక్సలైట్లదే పైచేయి. అక్కడ జనతా సర్కారు పేరిట నక్సల్స్ సమాంతర ప్రభుత్వం నిర్వహించారు. అనేకసార్లు పదుల సంఖ్యలో పోలీసులు, సిఆర్‌పిఎఫ్ కమెండోలు బలయ్యారు. మందు పాతరలతో పోలీసుల వాహనాలను, కాంట్రాక్టర్ల వాహనాలను, రోడ్లను నిర్మించేందుకు వచ్చే వాహనాలను, బస్సులను ఎన్నోసార్లు నక్సల్స్ పేల్చివేశారు. పొరుగునే వున్న మహారాష్ట్రలోని గచ్చిరోలి సహా ఇంకొన్నిచోట్ల నక్సల్స్ కార్యకలాపాలు ఎక్కువగా సాగాయి. ఈ క్రమంలో కేంద్రం ఛత్తీస్‌గఢ్‌లో భారీగా కేంద్ర బలగాలను మోహరించడంతో యేడాదిగా దాని ఫలితాలు వస్తున్నాయి. దీంతో 2026 మార్చి కల్లా దేశంలో ఎక్కడా నక్సలైట్లు వుండకూడదనే నినాదంతో ముందుకు సాగుతోంది. నక్సల్స్ ఏరివేతకు స్థానికుల సహకారం తీసుకోవడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ఇందులో ముఖ్యమైనది. ఇదే సమయంలో నక్సలైట్ల లొంగుబాట్లను పెంచడం, లొంగిపోయిన వారికి పునరావాసం సహా ఇతర ప్యాకేజి ఇవ్వడం, కొత్త భర్తీలు లేకుండా చేయడం మరో ముఖ్యమైన అంశం. తమను కట్టడి చేసేందుకు పోలీసు బలగాలు చేబట్టిన చర్యలపై మావోయిస్టులు ఇరకాటంలో పడ్డారని నిఘా వర్గాలు గుర్తించాయి. గతంలో తెలంగాణలోని అటవీ ప్రాంతంలో నక్సలైట్లకు బలమైన స్థావరాలు వుండేవి. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలలోని పలు ప్రాంతాలు గతంలో నక్సలైట్లకు పట్టుగా వుండేవి. అయితే మారిన పరిస్థితుల్లో ఈ ప్రాంతాలన్నీ పోలీసుల ఆధీనంలో మారాయి. ఇక్కడ నక్సలైట్లను మళ్లీ రాకుండా చూసేందుకు పోలీసులు నిరంతరంగా కూంబింగ్ చేయసాగారు. ఎపిలోనూ నక్సలైట్లు రాకుండా ఆ రాష్ట్ర పోలీ సులు పహారా పెంచారు. మరి రానున్న రోజుల్లో నక్సలైట్ల పంథా ఎలా వుంటుందనేది చూడాల్సి వుంది.

# విద్యుత్ పంపిణీ సంస్థల్లో భారీ నియామకాలు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)లో భారీగా ఉద్యోగుల నియామకాలను చేపట్టాలని కీలక నిర్ణయం తీసుకున్నాయి. రానున్న ఏప్రియల్ నెలతో ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ బిజినెస్, వీలింగ్ టారిఫ్ వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) పిటిషన్లలో విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఉద్యోగుల కొత్త నియామకాలను గూర్చి పేర్కొన్నాయి. ఈ మేరకు విద్యుత్ పంపిణీ సంస్థలు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు సమర్పించిన నివేదికలో నియామకాలను చేపట్టనున్నట్లు తెలిపాయి. ఇందులో భాగంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 600 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం), 100 అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ), 300 సబ్ ఇంజనీర్ల పోస్టులను భర్తీ చేయనున్నాయి. అలాగే ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 2,212 జేఎల్ఎం (జూనియర్ లైన్‌మెన్), 18 ఎలక్ట్రికల్, సివిల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, 30 సబ్ ఇంజనీర్, ఈ మేరకు ఆయా పోస్టుల భర్తీ కోసం విద్యుత్ పంపిణీ సంస్థలు త్వరలో నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు వెల్లడవుతోంది.

# బడే చొక్కారావు మృతిపై వీడని అనుమానాలు

### సమాచారం లేదంటున్న రాష్ట్ర నిఘా వర్గాలు

### మరణించాడని చెబుతున్న మావోయిస్టు పార్టీ

### సరిహద్దు జిల్లాల్లో పోలీసు శాఖ హైఅలర్ట్

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పుజరికాంకెర్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావో యిస్టుల్లో ఆ పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్లు నక్సలైట్ల తరపున విడుదలైన లేఖపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో దామోదర్ మరణించినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని రాష్ట్ర నిఘా వర్గాలు చెబుతుండగా, ఆయన మరణించిన మాట నిజమేనని మావోయిస్టు పార్టీ తరపున గంగ పేరిట విడుదలైన లేఖలో ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మం ణించినట్లు తమకు సమాచారం ఉందని, ఇందులో 10 మందిని గుర్తించగా ఇంకా ఇద్దరిని గుర్తించాల్సి ఉందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. 12 మందిలో దామోదర్ లేడని ఆ వర్గాలు చెబుతున్నాయి. అయితే నక్సలైట్ల తరఫున విడుదలైన లేఖలో ఈ ఎన్‌కౌంటర్‌లో 19 మంది చనిపోయినట్లు ఉంది. వీరిలో దామోదర్ కూడా ఉన్నాడని ఆ పార్టీ విడుదల చేసిన లేఖలో ఉంది. గుర్తించని మృతదేహాలు స్థానిక ఆసుపత్రిలో ఉన్నట్లు ఆ లేఖలో వుంది. అయితే ఈ విషయమై తమకు సమాచారం లేదని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఇంకోవైపు పుజరికాంకెర్ ఎన్‌కౌంటర్‌లో ఎన్‌కౌంటర్‌లో 17 మంది నక్స లైట్లు చనిసోయారని వస్తున్న వార్తల్లో కూడా తమకు సమాచారం లేదని నిఘా వర్గాలు అంటున్నాయి. తమకు అందిన సమా చారం ప్రకారం.. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది చనిపోగా ఇందులో పది మందిని గుర్తిం చగా. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉందని నిఘావర్గాలు అంటున్నాయి. అయితే దీనిపై ఛత్తీస్ గఢ్ పోలీసుల తరపున అధికారిక ప్రకటన విడుదల కాలేదు. ఇదే అంశమై హైదరాబాద్‌కు చెందిన మీడియా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ఐజి సుందర్‌రాజ్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందు బాటు లోకి రాలేదు. మరోవైపు పుజరికాంకెర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ దరిమిలా సరిహద్దు జిల్లాలలో తెలంగాణ పోలీసు శాఖ హైఅలర్ట్ ప్రకటిం చింది. ఛత్తీస్‌గఢ్‌కు సరిహద్దులు పంచుకుంటున్న ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పోలీసులను డిజిపి కార్యా లయం అప్రమత్తం చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రంలోకి నక్సలైట్లు ఎవరు రాకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసు కోవాలని ఆదేశాలు అందాయి. సరిహద్దులో చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేయడంతోపాటు అనుమానిత వ్యక్తులు రాకుం డా చూడాలని ఆదేశాలు అందాయి. గతంలో మావో యిస్టు పార్టీ ముఖ్యనాయకులు చనిపోయిన ప్పుడు నక్స లైట్లు భారీ విధ్వంసాలకు దిగిన దాఖలాలు ఉండ డంతో పోలీసు శాఖ సరిహద్దు జిల్లాలలో అప్రమత్తం చేసి హైఅలర్ట్ ప్రకటించింది.


**టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా**
వరల్డ్ ట్రేడ్ సెంటర్, టవర్-F, (6వ అంతస్తు),
న్యూ ఢిల్లీ-110029
TRAI

**ఉద్యోగ ఖాళీ సర్క్యులర్ నం. 1-01/2025-A&P**

విషయం: TRAI ప్రాంతీయ కార్యాలయం, హైదరాబాద్‌లో, అసిస్టెంట్ ఉద్యోగాన్ని విదేశీ సర్వీస్ నిబంధనలపై డిప్యుటేషన్‌పై భర్తీ చేయుట-గురించి

టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ క్రింది ఉద్యోగం దాని బెంగళూరులోని ప్రాంతీయ కార్యాలయంలో విదేశీ సర్వీస్ నిబంధనలపై డిప్యుటేషన్‌పై భర్తీకి ప్రతిపాదిస్తోంది:-

| ఉద్యోగం పేరు | పే బ్యాండ్ మరియు గ్రేడ్ పే |
|---|---|
| అసిస్టెంట్ | 7వ CPC ప్రకారం పే మ్యాట్రిక్స్ రూ.35400-112400లో పే లెవెల్-6 (ప్రీ-రివైజ్‌డు PB-2, రూ.9300-34800 + GP రూ.4200) |

2. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: **24వ ఫిబ్రవరి 2025**

3. తదుపరి వివరాలు TRAI వెబ్‌సైట్: www.trai.gov.in నుండి పొందవచ్చును.

CBC 06202/12/0082/2425

ఆకలి రుచి ఎరుగనట్టే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.

న-ఆస్కార్‌వైల్డ్

# మారణకాండకు ముగింపు

మరుభూమిగా మారుతున్న దేశానికి ఊరట లభించింది. ఏడాది కాలంగా జరుగుతున్న మారణకాండకు తెరపడింది. ఎట్టకేలకు కాల్పుల విరమణకు ముందుకురావడం, ఆపై ఇరుదేశాల్లోని జైళ్లలో ఉన్న ఖైదీలను విడుదల చేసుకోవడం అన్నరెండే రెండు అంశాలపై ఈకాల్పుల విరమణ ఒప్పందం ముగిసింది. ఒక చిన్న గల్ఫ్‌దేశం ఖతార్ ఇందుకు నెరపిన మధ్యవర్తిత్వం మంచిఫలితాలే ఇచ్చిందని చెప్పాలి. సుమారు 40వేలమందికిపైగా మరణించడం లక్షలాదిమంది నిరాశ్రయులు కావడం లేదా ఇతరదేశాలకు శరణార్థులుగా వెళ్లపోవడం వంటి సంఘటనలతో పాలస్తీనా దేశంమొత్తం ప్రపంచ చిత్రపటంలో కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ఈతరుణంలో కాల్పుల విరమణ ఒప్పందం తెరపైకి రావడం పాలస్తీనా ప్రజలకు కొండంత ఊపిరిపోసినట్లయిందని చెప్పాలి. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఉక్రెయిన్‌పై యుద్ధం, పాలస్తీనాపై దాడులు వంటివి నిలిపివేస్తానని ఒక్కరోజు ఆలస్యం జరిగినా ఉపేక్షించనని ప్రకటించిన ట్రంప్ అనుకున్నట్లుగానే ఈ విరమణ ఒప్పందానికి మిత్రదేశం ఇజ్రాయెల్ ముందుకు వచ్చింది. ఆ దేశ కేబినెట్ కూడా ఇందుకు ఆమోదం తెలపడమేకాదు వెనువెంటనే అమలుకు తెచ్చింది. ఈజిప్ట్, అమెరికా, ఖతార్‌దేశాల మధ్యవర్తిత్వంతో ఎట్టకేలకు పాలస్తీనాలో మారణహోమం ముగిసిందనే విశ్వసించాలి. ప్రపంచ దేశాలు ఎంత అరిచి గీ పెట్టినా పట్టించుకోని ఇజ్రాయెల్ హఠాత్తుగా కాల్పుల విరమణ ఒప్పందానికి దిగివచ్చిందంటే అగ్రరాజ్యం వత్తిళ్లేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. మూడు దశల ఒప్పందంలో కాల్పుల విరమణతోపాటు బందీల విడుదల కూడా జరగాలి. కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని తెలియడంతోనే దేశదేశాల్లో తలదాచుకుంటున్న పాలస్తీనా వాసులు తిరిగి స్వదేశానికి చేరుకుంటున్నారు. ఇజ్రాయెల్‌పై దాడిచేసి గత ఏడాది అక్టోబరు నెలలో హమాస్ వందలాది మందిని చంపి వేయడంతోపాటు కొన్ని వందల మందిని కిడ్నాప్ చేసి పట్టుకుని పోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ప్రారంభమైన ఈ మారణహోమం చివరకు హమాస్ అగ్రనేతల అంతం కూడాచవిచూసింది. మొత్తం హమాస్ ను తుడిచిపెట్టే లక్ష్యంతో పనిచేసిన ఇజ్రాయెల్ గాజా నగరంలో రక్తపుటేరులు పారించింది. ఓవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వస్తున్నదని చెపుతున్నా మరోపక్క గాజాలో 50కిపైగా లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఏడాది కాలంగా ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య జరిగిన యుద్ధంలో ఎక్కువ నష్టపోయింది కూడా పాలస్తీనాయే. నగరాలకు నగరాలే ధ్వంసం అయ్యాయి. ఇజ్రాయెల్ ప్రయోగించిన క్షిపణుల తీవ్రతకు బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టం అయ్యాయి. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 46 వేలమందికిపైగా చనిపోయారని చెపుతున్నా లెక్కకు రాని మరణాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఓ పక్క డీల్ కుదిరిందని ప్రకటించినా కూడా ఇజ్రాయెల్ తన దాడుల పరంపరను కొనసాగించింది. స్పష్టమైన లక్ష్యాలపై జరిపిన దాడుల వల్ల సుమారు 100మందికిపైగా చనిపోగా కొన్ని వందల మంది తీవ్రగాయాలపాలయ్యారు. అటు ఐక్యరాజ్యసమితి చెప్పినా, ఇటు అంతర్జాతీయ నేర న్యాయస్థానం అరెస్టు వారంట్లు జారీచేసినా కూడా ఇజ్రాయెల్ వెనక్కి తగ్గలేదు. హమాస్ అంతమే లక్ష్యంగా ముందుకు సాగింది. కానీ ఈలోపు అమెరికాలో అధికార మార్పిడి జరుగుతుండటం, రిపబ్లికన్లు మళ్లీ అధికారంలోకి వస్తుండటంతో పరిణామాలు కూడా శరవేగంగా మారిపోయాయి. కాల్పులవిరమణ విజయం తమదంటే తమదని అటు డెమొక్రాట్లు, ఇటు రిపబ్లికన్లు ఎవరికివారు చెప్పుకుంటున్నా బాధిత దేశంలో మాత్రం ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. మరుభూమిగా మారిన దేశంలో ఇక నుంచి అయినా ప్రశాంత జీవనం సాగించేందుకు వీలుకల్పించిన మధ్యవర్తులను వారు వేనోళ్ల కొనియాడుతున్నారు. అందుకు దారితీసిన పరిస్థితులే అప్పట్లో అలా అలుముకున్నాయి. తొలిదశలో 42 రోజులపాటు కాల్పుల విరమణ అమలుకు వస్తుంది. 33మంది బందీలను కూడా విడుదలచేయాలన్న షరతులున్నాయి. మొదటిదశ అమలు బాధ్యత మాపై ఉందని మధ్యవర్తిత్వం వహించిన ఖతార్ కూడా ప్రకటించింది. జనసాంద్రత ఎక్కువఉన్న ప్రాంతాల నుంచి ముందు ఇజ్రాయెల్ తన బలగాలను ఉపసంహరించుకోవాలి. అంతేకాకుండా నిరాశ్రయులైన పాలస్తీనియన్లను వారివారి నివాసాలకు వెళ్లేందుకు స్వేచ్ఛనివ్వాలని ఖతార్ ఈ ఒప్పందం మౌలిక సూత్రాలను వివరించింది. మూడు దశల ఒప్పందం అమలైతే గాజాలో యుద్ధకాండ శాశ్వతంగా ముగిసినట్లవుతుందని అమెరికా కూడా ప్రకటించింది. గాజా అధికారుల లెక్కల ప్రకారం చూస్తుంటే సుమారు 24లక్షలమంది నిరాశ్రయులయ్యారు. యుద్ధ తంత్రంలోభాగంగా వారికి ఆహారం మంచినీరు, విద్యుత్ వంటి సరఫరాలను కూడా ఇజ్రాయల్ కట్టడి చేయడంతో ఆకలి దప్పులతో గాజావాసులు అలమటించిపోయారు. ప్రపంచదేశాలు, ఐక్యరాజ్యసమితి వంటివి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేస్తేతప్ప ఇజ్రాయెల్ శాశ్వత శతృత్వం కొని తెచ్చుకోకుండా కొన్ని సడలింపులు ఇచ్చింది. ఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న దండయాత్రలా కాకుండా ఏడాది కాలంలోనే పాలస్తీనా ఇజ్రాయెల్ సమస్యను కొలిక్కితీసుకురావడం మంచిపరిణామం. యుద్ధాల శకం ముగిసిందని, చర్చలు సంప్రదింపులతోనే శాంతియుత పరిష్కారాలు అనివార్యమన్నది రుజువైంది.

సంపదకి అహంకారం తోడైతే, అన్ని దుర్గుణాలూ వరుసగా ఉత్పన్నమవుతాయి. వాటి ఫలితం మనిషి నాశనమే.



గోల్డ్‌స్మిత్

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

# మానవ అక్రమ రవాణా దోపిడీకి పరాకాష్ట

**మానవ అక్రమరవాణాను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ చట్టాలు, జాతీయ విధానాలు ప్రభుత్వేతర సంస్థలతోపాటు అనేక మార్గాలున్నాయి. సామాజిక వర్గాల్లో అవగాహన కల్పించడం, స్నేహితులు, కుటుంబసభ్యులకు అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించడం, ఆధునిక బానిసలను కను గొని, విడిపించడానికి, ప్రాణాలతో బయటపడిన వారికి సంరక్షణను అందించడానికి స్థానికపోలీసులతో కలిసిపని చేయడం మొదలైనవి. ఈసమాచార సాంకేతికయుగంలో కూడా మానవ అక్రమరవాణా ఉనికి మానవాళికి అవమానకరం. ప్రపంచదేశాలు సమగ్ర అవగాహనతో దీనినితొలగించాలి.**

డాక్టర్. పిఎస్. చారి

మానవ అక్రమ రవాణా అనేది దోపిడీ ప్రయోజనం కోసం బలవంతం, మోసం ద్వారా వ్యక్తులను ఎంపిక చేయడం, రవాణా చేయడం, బదిలీచేయడం, ఆశ్రయం కల్పించడం లేదా స్వీకరించడం. ఈదోపిడీలో బలవంతపు శ్రమ, లైంగిక బానిసత్వం లేదా ఇతర రకాల వాణిజ్య లైంగిక దోపిడీలు ఉండవచ్చు. ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన ఆధునిక బానిసత్వ రూపం. ప్రతి సంవత్సరం, యునైటెడ్‌స్టేట్స్‌తో సహా మిలియన్ల కొద్దీ పురుషులు, మహిళలు, పిల్లలు ప్రపంచవ్యాప్తంగా అక్రమ రవాణా చేయబడుతున్నారు. ఇది ఏ సంఘంలోనైనా జరగవచ్చు. బాధితులు ఏ వయస్సు, జాతి, లింగం లేదా జాతీయత అయినా కావచ్చు. హింస, తారుమారు చేయడం, మంచి జీతంతో కూడిన ఉద్యోగాల గురించి తప్పుడు వాగ్దానాలు, శృంగార సంబంధాలు మొదలైన వాటికి బాధితులను ఆకర్షించడానికి అక్రమ రవాణాదారులు (ట్రాఫికర్లు) ఈ వివిధ పద్ధతులను ఉపయోగించవచ్చు. మానసిక లేదా భావోద్వేగ దుర్బలత్వం, పేదరికం, నిరుద్యోగం, జ్ఞానంలేకపోవడం, విచ్ఛిన్నమైన కుటుంబాలు, సాంస్కృతికపద్ధతులు, సామాజిక భద్రతావలయం లేకపోవడం, సహజ విపత్తులు, రాజకీయ అస్థిరతతోసహా వివిధకారణాల వల్ల సులభంగా లక్ష్యంగా చేసుకునే వ్యక్తుల కోసం ట్రాఫికర్లు వెతుకుతారు. భాషాఅవరోధాలు, వారిట్రాఫికర్ల భయం, చట్టాన్ని అమలు చేసేవారి భయం తరచుగా బాధితులను సహాయం కోరకుండా చేస్తుంది. దీనితో మానవ అక్రమరవాణా బాధితులు వారి అక్రమ రవాణా అనుభవం సమయంలో, తర్వాత వినాశకరమైన మానసిక ప్రభావాలను అనుభవించవచ్చు. చాలామంది ప్రాణాలతో బయటపడిన వారు నిరాశ, జ్ఞాపకశక్తి కోల్పోవడం, సంబంధాలలో ఇబ్బందులు, ఆందోళన, భయం, అపరాధం, అవమానం, ఇతర తీవ్రమైన మానసిక గాయాలను అనుభవించవచ్చు. మానవ అక్రమరవాణా తరచుగా 'ఆధునిక బానిసత్వం'తో పోల్చబడిన మానవ హక్కుల నేరం ఏసమయంలోనైనా ప్రపంచవ్యాప్తంగా 27 మిలియన్ల మంది బాధితులను ప్రభావితం చేస్తుందని అంచనా వేయబడింది. ఒక నివేదిక ప్రకారం, మానవ అక్రమరవాణాలో (79శాతం) లైంగికదోపిడీ. లైంగికదోపిడీకి గురవుతున్న వారిలో ప్రధానంగా మహిళలు, బాలికలు ఉన్నారు. ఆశ్చర్యకరంగా 30శాతం దేశాల్లో, అక్రమ రవాణా దారులలో మహిళలే అత్యధికంగా ఉన్నారు. లైంగిక దోపిడీకి సంబంధించిన అక్రమ రవాణాకంటే బలవంతపు శ్రమతక్కువ తరచుగా కనుగొనబడింది. ప్రపంచవ్యాప్తంగా, అక్రమ రవాణా బాధితుల్లో దాదాపు 20శాతంమంది పిల్లలున్నారు. ఒక నివేదిక ప్రకారం, గుర్తించబడిన ఆఫ్రికన్ బాధితులు అత్యధిక సంఖ్యలో గమ్యస్థానాలకు చేరుకున్నారు. మొత్తంగా, 2022లో కనీసం 162 వేర్వేరు జాతీయులు 128 వేర్వేరు దేశాలకు రవాణా చేయబడ్డారు. డ్రగ్స్ అండ్క్రైమ్‌పై ఐక్యరాజ్యసమితి కార్యాలయం ప్రచురించిన వ్యక్తుల అక్రమ రవాణాపై నివేదిక 2024 గ్లోబల్ రిపోర్ట్ 156 దేశాలను కవర్చేస్తుంది. 2019,2023 మధ్య కనుగొనబడిన ట్రాఫికింగ్ కేసులను విశ్లేషించడం ద్వారా వ్యక్తుల అక్రమ రవాణాకు ప్రతిస్పందన అందిస్తుంది. 2019తో పోలిస్తే 2022లోప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన ట్రాఫికింగ్ బాధితుల సంఖ్యలో 25 శాతం పెరుగుదలను నివేదిక నమోదు చేసింది. 2019, 2022 మధ్య, బలవంతపు కార్మికుల కోసం అక్రమ రవాణాకోసం గుర్తించబడిన ప్రపంచవ్యాప్తంగా బాధితుల సంఖ్య 47 శాతంపెరిగింది. 2024 ట్రాఫికింగ్ ఇన్పర్సన్స్ (టిఐపి) నివేదిక బాధితుల గుర్తింపు, నేర ఆరోపణలు మార్పులలో ప్రాంతీయ వ్యత్యాసాలను హైలైట్ చేస్తూ వ్యక్తుల అక్రమరవాణాపై వివరణాత్మక గణాంకాలను అందిస్తుంది. ప్రపంచస్థాయిలో 133,943 మంది బాధితు



లను గుర్తించారు. 7,115 మంది దోషులుగా నిర్ధారించబడ్డారు. ఆఫ్రికాలో 21,877 మంది బాధితులను గుర్తించారు. 758 దోషులు తూర్పుఆసియా, పసిఫిక్‌లో 6,543 మంది బాధితులు గుర్తించబడ్డారు. 1,802మంది దోషులు, ఐరోపాలో 32,996 మంది బాధితులు గుర్తించబడ్డారు. 1,667 దోషులు, దక్షిణమధ్య ఆసియాలో 50,815 మంది బాధితులు, 1,245మందిదోషులు, పశ్చిమ అర్ధగోళంలో18,292 మంది బాధితులు గుర్తించారు. 873 మందిదోషులుగా గుర్తించబడ్డారు. 2024 శ్రేణి ర్యాంకింగ్‌లు ట్రాఫికింగ్ బాధితుల రక్షణచట్టం కనీస ప్రమాణాలకు అనుగుణంగా దేశాలు చేసే ప్రయత్నాల ఆధారంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్‌ఎస్టేట్ దేశాలను నాలుగు అంచెలుగా వర్గీకరిస్తుంది. ఒకటవ అంచెలో దేశాలు పూర్తిగాచట్టం ప్రమాణాలకు అనుగుణంగాఉన్నాయి. ఉదా. అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, రిపబ్లిక్ ఆఫ్కొరియా. రెండవ అంచెలో దేశాలు పూర్తిగా చట్టం ప్రమాణాలకు అనుగుణంగా లేవు. కానీ గణనీయమైన ప్రయత్నాలు చేస్తున్నాయి. ఉదా. భారతదేశం, ఇజ్రాయెల్, దక్షిణాఫ్రికా. మూడవ అంచెలో చట్టం ప్రమాణాలను అందుకోని దేశాలు. ఉదా. ఆఫ్ఘనిస్తాన్, చైనా, రష్యా. నాల్గవ అంచెలో చట్టం ప్రమాణాలకు ప్రయత్నాలు చేయనివి. భారతదేశంలో మానవ అక్రమరవాణా, భారతచట్టం ప్రకారం చట్టవిరుద్ధమైనప్పటికీ, ఒక ముఖ్యమైన సమస్యగా మిగిలిపోయింది. వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ బలవంతపు, బంధిత కార్మికుల ప్రయోజనాల కోసం ప్రజలుతరచుగా భారతదేశం ద్వారా అక్రమంగా రవాణా చేయబడుతున్నారు. బలవంతపు, బంధిత కార్మికులపై విశ్వసనీయమైన అధ్యయనం పూర్తికానప్పటికీ, ప్రభుత్వేతర సంస్థలు20 నుండి 65 మిలియన్ల మంది భారతీయులను ఈసమస్య ప్రభావితం చేసినట్లు అంచనావేసింది. భారతదేశంలో వివిధకారణాల వల్ల పురుషులు, మహిళలు పిల్లలు అక్రమ రవాణాకు గురయ్యారు. వాణిజ్యపరమైన లైంగికదోపిడీ బలవంతపు వివాహాల ప్రయోజనాల కోసం దేశంలో మహిళలు బాలికలు అక్రమ రవాణా చేయబడుతున్నారు. ముఖ్యంగా పురుషులకు అనుకూలంగా లింగనిష్పత్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పిల్లలలో గణనీయమైన భాగం ఫ్యాక్టరీ కార్మికులుగా, గృహ సేవకులుగా, యాచకులుగా, వ్యవసాయ కార్మికులుగా బలవంతపు పనికిలోనవుతున్నారు. కొన్ని తీవ్రవాద తిరుగుబాటు గ్రూపులచే సాయుధ పోరాటయోధులుగా ఉపయోగించబడ్డారు. వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకోసం నేపాల్ బంగ్లాదేశ్ నుండి అక్రమరవాణా చేయబడిన మహిళలు బాలికలకు భారతదేశం కూడాగమ్యస్థానంగా ఉంది. సర్కస్లలో బలవంతపుపనికోసం నేపాలీపిల్లలను కూడా భారతదేశానికి రవాణా చేశారు. వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకోసం భారతీయమహిళలను మధ్యప్రాచ్య దేశాలకు రవాణా చేశారు. భారతదేశం 2011లో 2000 యునైటెడ్ నేషన్ ట్రాఫికింగ్ ఇన్పర్సన్స్ ప్రోటోకాల్‌ను ఆమోదించింది. భారత ప్రభుత్వం ఫిబ్రవరి2014లో మానవ అక్రమరవాణాకు వ్యతిరేక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ప్రభుత్వం వాణిజ్యపరమైన లైంగికదోపిడీకి అక్రమ రవాణాకు జరిమానా విధించింది. అనైతికట్రాఫికింగ్ నిరోధక చట్టంద్వారా ఏడేళ్ల నుంచి యావజ్జీవకారాగార శిక్ష విధించబడుతుంది. భారత ప్రభుత్వం ట్రాఫికింగ్ నిర్మూలనకు కనీసప్రమాణాలను పూర్తిగాఅందుకోలేదు కానీ అలాచేయడానికి గణనీయమైన ప్రయత్నాలు చేస్తోంది. భారతదేశంలోని రాష్ట్రాలు కేంద్ర పాలితప్రాంతాలు అక్రమరవాణా నిరోధక ప్రయత్నాలకు ప్రాథమిక బాధ్యతను కలిగిఉంటాయి. కేంద్రప్రభుత్వం నుండి విధాన పర్యవేక్షణ ఉంటుంది. అన్నిరకాల అక్రమ రవాణాను నేరంగా పరిగణించేందుకు ప్రభుత్వం శిక్షాస్మృతిని సవరించలేదు. మానవ అక్రమరవాణాను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ చట్టాలు, జాతీయ విధానాలు ప్రభుత్వేతర సంస్థలతోపాటు అనేకమార్గాలున్నాయి. సామాజిక వర్గాల్లో అవగాహన కల్పించడం, స్నేహితులు, కుటుంబసభ్యులకు అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించడం, ఆధునిక బానిసలను కనుగొని, విడిపించడానికి, ప్రాణాలతో బయటపడిన వారికి సంరక్షణను అందించడానికి స్థానికపోలీసులతో కలిసిపని చేయడం మొదలైనవి. ఈసమాచార సాంకేతికయుగంలో కూడా మానవ అక్రమరవాణా ఉనికి మానవాళికి అవమానకరం. ప్రపంచదేశాలు సమగ్ర అవగాహనతో దీనినితొలగించాలి. ●

# ఆర్థిక వ్యవస్థలో మందగమనాన్ని అధిగమించలేమా?

శ్రీనివాస్ గౌడ్ ముద్దం

భారత ఆర్థిక వ్యవస్థ 202425 ఆర్థిక సంవత్సరంలో 6.4శాతం వృద్ధి రేటును సాధించనుందని అంచనాగా ఉన్నట్టు ఇటీవల కేంద్ర సంస్థలు వెల్లడించాయి. అయితే ఇది గత నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం ఆర్థిక విధాన నిర్వాహకుల, పెట్టుబడిదారుల మధ్య ఆందోళన రేకెత్తిస్తోంది. ఏదేమైనా ఈ మందగమనం కారణాలు, దుష్ప్రభావాలు, అలాగే దీన్ని అధిగమించేందుకు అవసరమైన అవకాశాలను పరిశీలించడం అత్యంత కీలకం. ప్రైవేటు రంగ పెట్టుబడులు ఆర్థికవృద్ధికి కీలకమైన పాత్ర పోషిస్తాయి. కానీ అనేక రంగాల్లో పెట్టుబడులు మందగించడం, పన్ను విధానాల్లో స్పష్టత లోపం, వడ్డీ రేట్లపెంపు వంటి అంశాలు ప్రైవేట్ పెట్టుబడులపై ప్రభావం చూపించాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం, వాణిజ్య యుద్ధాలు, రష్యా ఉక్రెయిన్ సంక్షోభం వంటి అంశాలు భారత ఎగుమతులను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా చైనావంటి ప్రధాన మార్కెట్లలో వృద్ధి మందగమనం మన దేశ ఎగుమతులపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. గ్రామీణ వినియోగం కొంత మెరుగుపడినా, పట్టణ వినియోగం, సాధారణవినియోగంలో ఆశించిన స్థాయివృద్ధి కనిపించడం లేదు. దీన్ని ద్రవ్యోల్బణ ఉపాధి లోపం వంటి అంశాలు మరింతకుంచించాయి. ప్రభుత్వ వ్యయం 4.1శాతం పెరగడం పాజిటివ్ అనిపించినప్పటికీ, ఇది అంచనాలకు తక్కువ. మౌలిక వసతుల ప్రాజెక్టుల మీద మరింత వ్యయం అవసరమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వృద్ధి మందగమనం ఉద్యోగ కల్పనను నెమ్మదింప జేస్తుంది. ముఖ్యంగా నిర్మాణ, పరిశ్రమల రంగాల్లో కొత్త ఉద్యోగ అవకాశాలు తగ్గే అవకాశంఉంది. ఆర్బీఐ వృద్ధి అంచనాలను 7.2శాతం నుండి 6.6శాతానికి తగ్గించడం ఆర్థిక స్థిరత్వంపై ప్రశ్నలను తెరమీదకు తెచ్చింది. వడ్డీ రేట్ల పెంపు, ద్రవ్యోల్బణ నియంత్రణమధ్య సరైన సమతుల్యత అవసరం. ఆరోగ్యకరమైన ఖరీఫ్, రబీ పంటలతో గ్రామీణ ఆదా యం మెరుగుపడే అవకాశం ఉంది. ఇది వినియోగాన్ని పెంచడంలో సహాయపడగలదు. దీనికోసం వ్యవసాయ రంగానికి మరింత సబ్సిడీలు, పంటల సరసమైన ధరలు అందించడం అవసరం. సేవల ఎగుమతులు భారత ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన భాగంగా ఉన్నాయి. ఐటీ, టెలికాం, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో నిరంతరం బలపడే అవకాశాలు ఉన్నాయి. టెక్నాలజీ పై మరిన్ని పెట్టుబడులు పెడితే ఫలితాలు ఉంటాయి. మౌలిక సదుపాయాలు, రవాణా, నిర్మాణరంగాలకు పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేయవచ్చు. భారతదేశం ఇప్పటికే స్టార్టప్‌హబ్‌గా ఎదుగుతోంది. యువతకి ఉపాధి కల్పించడంలో ఇది కీలకం. అలాగే పన్నురాయితీలు వాణిజ్య పెట్టుబడులకు ప్రోత్సాహం అం దించాలి. ప్రైవేటు పెట్టుబడులను పెంచాలి. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ వాతావరణం కల్పించాలి. మౌలిక వసతుల నిర్మాణం చేపట్టాలి. రోడ్లు, రైళ్లు, నదుల అనుసంధానం వంటి ప్రాజెక్టు లను వేగవంతం చేయడం ద్వారా ఆదాయంసృష్టించవచ్చు. ఉద్యోగ కల్పన కూడా ముఖ్యమైనది. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేదిశగా పరిశ్రమల ఏర్పాటుకుప్రోత్సాహం అందించాలి. ఇకపోతే భారత ఆర్థికవ్యవస్థ 6.4 శాతంవృద్ధి రేటుతో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో నిలుస్తున్నా, ఈవృద్ధి స్థిరంగా ఉండేందుకు ప్రైవేటు పెట్టుబడులను పెంచడం, వినియోగాన్ని మెరుగుపరచడం, వ్యవసాయ రంగంలో మరింత బలమైన మద్దతు కల్పించడం ద్వారా దీర్ఘకాలిక వృద్ధిని సాధించవచ్చు. ●

# విద్యాసంస్థల్లో ఎన్నికలు ఒక చారిత్రక అవసరం

నాదెండ్ల శ్రీనివాస్

విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరమని జనవరి12న సిఎం రేవంత్ రెడ్డి ఓ సభలో మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజాలం ఉన్నవారు లేకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని, విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంత పరంగా రాణించిన వారుంటే ప్రజాప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా నమ్మిన సిద్ధాంతంకోసం దశాబ్దాల పాటు జీవితాలను త్యాగం చేస్తారని, ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుందని, దాని ద్వారానే ఆయా సమస్యలు, పరిష్కారమవుతాయంటూ మాట్లాడారు. ఇదొక ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే ఇవి కేవలం మాటలకు మాత్రమే పరిమితం కాకుండా ఆచరణలో అమలయ్యే విధంగా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మనం ఆశిద్దాం. సుప్రీంకోర్టు 2005 డిసెంబర్ 2న ఇచ్చిన ఆదేశాల ప్రకారం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ కేంద్ర మాజీ ముఖ్య ఎన్నికల అధికారి జేఎం లింగ్డో అధ్యక్షతన ఒక కమిటీ వేసింది. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో, విద్యార్థుల యూనియన్ ఎలక్షన్లను సమీక్షి ంచి తగిన సూచనలు చేయాలని కమిటీని నియమించింది. కమిటీ 2006 మే 26న రిపోర్ట్ ను సమర్పించింది. అదే ఏడాది సెప్టెంబర్ 22నసుప్రీంకోర్టు కమిటీ ప్రతిపాదించిన రిపోర్టును అమలు చేయాలని యూని వర్సిటీలకు, కాలేజీలకు సూచించింది. విద్యార్థి ఎన్నికల నిర్వహణకు సంబంధించి కమిటీ చాలా సూచనలు చేసింది. విద్యాసంవత్సరం మొదలైన 6నుంచి 8వారాల మధ్యలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. ఈ ప్రక్రియ మొత్తం 10రోజుల వ్యవధి మించకుండా పూర్తిచేయాలి. దేశంలో ఉన్న యూనివర్సిటీల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించడానికి శాంతి, స్వేచ్ఛాయుతమైన వాతావరణం ఏర్పాటు చేయాలి. పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే ఆయా వర్సిటీల్లో నామినేషన్ పద్ధతిలో విద్యార్థి ప్రతినిధులను ఎన్నుకోవాలి. ఐదు సంవత్సరాల తర్వాత నామినేషన్ పద్ధతి నుంచి నిర్మాణాత్మకమైన ఎన్నికల విధానానికి రావాలి. అంటే పార్లమెంటరీ తరహాలో పరోక్షంగా లేదా అధ్యక్ష తరహాలో ప్రత్యక్షంగా లేదా రెండు కలిపిన ఎన్నికల విధానం అనుసరించాలి. విద్యార్థి సంఘాల్లో ప్రతినిధులుగా రెగ్యులర్ విద్యార్థులు మాత్రమే ఉండాలి. విద్యార్థి సంఘాల ప్రతినిధులు రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండాపని చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2006లో జేఎంలింగ్డో కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం ఐదేండ్లు నామినేషన్ పద్ధతిలో విద్యార్థి నాయకులను ఎన్నుకుని, ఆ తర్వాత విద్యార్థి యూనియన్ ఎలక్షన్స్ నిర్వ హించాలి. కానీ కోర్టు ఆదేశించి 17ఏండ్లు గడచినా మన తెలంగాణతో సహాచాలా రాష్ట్రాల్లో అది ఆచరణలోకి రాలేదు. కేంద్ర విశ్వవిద్యాలయాలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ, రాష్ట్రస్థాయిలో కేరళ, పశ్చిమ బెంగాల్,



అస్సాం, రాజస్థాన్, పంజాబ్ తదితర వర్సిటీల్లో కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఇప్పటివరకు విద్యార్థి సంఘాల ఎన్నికలకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనివల్ల విద్యార్థుల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం లేకుండాపోతుంది. విద్యలో కాషాయికరణ, ప్రైవేటీకరణ, ఫీజుల దోపిడీ, ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, నిరుద్యోగం, కులం, మతం, ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం ఇలా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నా విద్యార్థులు కనీసం వారి హక్కుల కోసం గళంఎత్తలేని అచేతన స్థితిలో ఉంటున్నారు. దీనివల్ల ప్రశ్నించే తత్వం తగ్గిపోతోంది. ఒకవైపు చదువుకుంటూనే మరో వైపు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొని సంఘ విద్రోహశక్తులపై చదువుతూ పోరాటం, చదువుకై పోరాటం చేసేవాడే విద్యార్థి. అలాంటి విద్యా ర్థుల నిస్వార్థపు ఆలోచనలు, చర్యలు దేశ నిర్మాణానికి, ప్రగతికి దోహదంచేస్తాయి. ఇలా యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల నేతలుగా ఎదిగిన అనేకమంది నేడు దేశంకోసం, ప్రజలకోసం నిర్విరామంగా అలుపెరుగని పోరాటాలు నిర్వ హిస్తున్నారు. ఇలా నిస్వార్థంగా పనిచేసేందుకు ఒక్క వామ పక్షాలు తప్ప మిగతా రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు జరిగిన కాలంలో విద్యావ్యవస్థను పరిశీలిస్తే నాయకులు, విద్యార్థులంద రూ సామాజిక స్పృహతో చైతన్యంగా ఉండేవారు. అందు వల్లనే ప్రాథమిక పాఠశాల నుండి యూనివర్సిటీల దాకా విద్యార్థి, టీచర్ నిష్పత్తి ప్రకారం నిరంతరం అధ్యాపకుల నియామకాలు జరిగాయి. నాణ్యమైన విద్యాబోధనడిమాండ్ చేయడంతోపాటు కాలేజీ, హాస్టల్ ఫీజులు సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వంతో పోరాటాలు చేసేవారు. అంతేకాకుండా ప్రశ్నించేతత్వం ప్రతి విద్యార్థిలో ఉండడంతో విద్యాసంస్థలు కూడా బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేసేవి. ఒక్క విద్యాసంస్థలకే పరిమితం కాకుండా సామాజిక ఉద్యమాల్లో కూడా విద్యార్థులు కీలకపాత్ర పోషించారు. ఉదాహరణకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకోసం రాజకీయ పార్టీల పోరాటం కంటే విద్యార్థులు ముందుండి వీరోచితంగా ఉద్యమించడంవల్లనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది. ఈ పోరాటాలు సమాజం పట్ల విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తాయి. దేశంలో ప్రస్తుతం విద్య, ఉపాధి రంగాల్లో రాజకీయ ప్రభావం లేని వ్యవస్థ అంటూలేదు. ప్రస్తుతం చాలామంది రాజకీయ నాయకులు వారు పదవుల్లో ఉండగానే మరో పక్క వారి వారసులను రాజకీయ రంగప్రవేశం చేయించి, భవిష్యత్ తరాలపై రాజకీయ నాయకులుగా బలవంతంగా రుద్దుతున్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇదే తరహా రాజకీయం నేడు నడుస్తున్నది. ఈ పోకడలను మనం ప్రోత్సాహించినా, కొనసాగించినా ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారి, ఫాసిజం వైపు దారితీసే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ప్రజాస్వామ వాదులు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల్లో ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. ●

# ప్రజావాక్కు



### కేసుల పురోగతి ఎక్కడ?

**తిరుమల** స్వామి వారి దర్శనంటికెట్లలో పలు అక్రమాలపై నిత్యం పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినా తదుపరి చర్యలు శూన్యం! అలాగే పింక్ డైమండ్ అదృశ్యం కేసు నుంచి కల్తీ నెయ్యి దర్యాప్తు వరకు ఎటువంటి పురోగతి కానరావడం లేదు. ఇందుకుబాధ్యులు ఎవరు? స్వామివారి దర్శనానికి ప్రక్కరాష్ట్రాల నుంచి వచ్చిన వారు రాజకీయ విమర్శలు చేస్తున్నా పట్టించుకోరు. ఇంకా దర్యాప్తులు, కేసులు నమోదులు ఎవరిని మభ్యపెట్టడానికి? దేవస్థానం పాలకమండలి, అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలి! పదవులుఅలంకారప్రాయానికి, శాలువాలుకట్టడానికికాదు. ప్రతి ఒక్కరిలో జవాబుదారీ తనం ఉండాలి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఆరోగ్య కార్డులను విడుదల చేయాలి

గత కొన్నేళ్లుగా సీనియర్‌సిటిజన్లు తమన్యాయమైన కోర్కెలు తీర్చమని ప్రధానమంత్రి గారికి ఎన్ని విన్నపాలు చేసినా ఇవేమీ ఆయన చెవికెక్కకపోవడంతో సామాన్య జీవి తాలు అనేక ఆర్థికసమస్యలతో సతమతమవుతున్న వారు పండుగలు, పబ్బాలు కుటుంబ సభ్యులతో సంతోషాలు, ఆనందాలతో గడపలేకపోతున్నారు. వీరికి కావలసిన ముఖ్యమైన కోర్కెలు ఏమంటే రైళ్లలో రాయితీలు, ఎంప్లాయిస్ పెన్షను స్కీము 1995 వారి పెన్షన్లు, వెయ్యి రూపాయల నుండి రూ.9000 రేపు సమర్పించబోయే వార్షిక బడ్జెట్లో పెంచడం, ఆయుష్మాన్ భారత్ ఐదు లక్షల ఆరోగ్య కార్డులను విడుదల చేయడం.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### కల్లోల పరిస్థితి

ప్రపంచంలో కల్లోల పరిస్థితిని ఎదుర్కొంటుంది. అది వాతావరణ మార్పులపరంగా కావొచ్చు. వరదలాగా ప్రవహించే సాంకేతిక ప్రవాహం వల్ల కావొచ్చు. అయితే ఈ పరిస్థితిలో మనిషికి కావాల్సింది ఉపాధి మాత్రమే అయితే గ్రామ స్వరాజ్యాన్ని రూపకల్పన చేయడంలో ఉపాధి హామీ పని మరింత విస్తారం అయింది. దానిని ఇంకా పూర్తిస్థాయిలో పండ్ల పెంపకానికి, కూరగాయల సాగుకు, నీటి నిల్వకు మరింత ఎక్కువ స్థాయి ప్రాధాన్యత ఇవ్వాలి ఉపాధి హామీ మరింత విస్తరించాలి.

- భారత అవినాష్, జనగామ

### తీరని అన్యాయం

ధాన్యం సేకరణలో రైతుకు తరతరాలుగా తీరని అన్యాయం జరుగుతోంది. రైతుకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం కల్లాల్లో ధాన్యం పెట్టుకొని విక్రయించడానికి ఎదురుచూస్తున్న రైతు బలహీనతను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వ పరంగా చర్యలు బలహీనంగా వున్నాయని రైతాంగం ఆవేదన వ్యక్తంచేస్తోంది. మన వ్యవస్థలో దళారులవలన ధాన్యం రైతులకుదక్కాల్సినసొమ్ములో నేరుగా30దక్కకుండా పోతోంది. మిల్లర్లు-దళారుల దోపిడీని నిలువరించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత వుంది. ఇప్పటివరకు సేకరించిన ధాన్యంలో 90 శాతానికి పైగా రైతుల పేరిట దళారులే సేకరించారని మీడియా వార్తలు తెలియజేస్తున్నాయి. ఇప్పటివరకు తాము సేకరించామని చెబుతున్న ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకారం రైతులకు రూ.5,397 కోట్లు చెల్లించినట్టుగా తెలుస్తోంది.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సమాచార కమిషనర్లను నియమించాలి

సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఆయుధం లాంటిది. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే సమాచార హక్కు అమలుతీరుకు సంబంధించిన రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, కమీషనర్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల రాష్ట్ర సమాచార కమిషన్‌లో లక్షలాది రెండవ అప్పీలు పెండింగ్‌లో వుండటం వల్ల ప్రజలకు కాలవసిన సమాచారం సకాలంలో రాకపోవడంవల్ల సమాచార హక్కు చట్టం అమలు సక్రమంగా లేదు. అనేకప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం బోర్డులు కూడాలేవు. మూలకు పడవేసి వుంచారు. అధికారులకు అవగాహన లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమాచార హక్కుచట్టం అమలుతీరు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

### పెన్షన్ చెల్లింపు చేయాలి

ఏపి సచివాలయంలో సిబ్బందిలో ప్రస్తుతం వాలంటీర్లు లేరు. గతంలో పెన్షన్ చెల్లింపుల్లో ఉన్న సహాయం లేదు. అయినా పింఛను అతివేగంగా ఇవ్వాలని, నిబంధనలతో పనిభారం సహజంగా పెరుగుతుంది. కొన్నిచోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జాబ్‌కార్డు ఇవ్వడం సరైనదే దానితోపాటు వాస్తవ పనిభారం, సిబ్బంది సంఖ్య ప్రాతిపదికన ఇస్తేప్రజలకు, సిబ్బందికి టార్గెట్ టైంలో అన్ని విధులు చక్కగా నిర్వహించగలరు.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక మహాకుంభమేళా

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ, జనవరి 19:** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల వర్గాలప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రపంచ దేశాలప్రజలు ప్రయాగరాజ్‌కు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు. కుంభమేళాకు పెద్దసంఖ్యలో వస్తున్న యువతను అభినందించారు. దేశంలోని యువత తమ ఆచార సాంప్రదా యాలను తెలుసుకున్నపుడే మన మూలాలు బలపడతాయన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచదేశాలనుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు. మహాకుంభ్‌మేళా అన్ని ప్రాంతాలు, అన్నివర్గాలప్రజలను ఒకేవేదికపైకి తీసుకువచ్చిందని తెలిపారు. మనసులో మాట పేరుతో ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడారు. అయితే ఈనెలలో చివరి ఆదివారం అయిన జనవరి 26న గణతంత్రదినోత్సవం కావడంతో మూడో ఆదివారం మన్‌కీబాత్ 118వ ఎపిసోడ్‌ను ప్రసారం చేసారు. ఈ గణతంత్ర దినోత్సవం చాలా ప్రత్యేకమైనదని, ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలుపూర్తవుతుందని మన పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగపరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి పటిష్టంచేస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రజాశక్తిని బలోపేతంచేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ నిష్పక్షపాతంగా పోలింగ్‌ప్రక్రియ నిర్వహిస్తుందన్నారు. యువత స్టార్టప్ సంస్థల వైపు ఎక్కువ ఆకర్షితులవుతున్నారని ప్రధాని మోడీ అన్నారు. దీనితో స్టార్టప్ ఇండియా రూపు దిద్దుకుంటున్నదని సమాజంలో పరిస్థితులు మారిపోతున్నాయని అన్నారు. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని దేశాభి వృద్ధిలో మహిళలు కీలకపాత్రపోషిస్తున్నారని వెల్లడించారు. నేటి ఆధునిక భారత్‌యువత తమ అభివృద్ధిగురించి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కృషిచేస్తుందని వెల్లడించారు. దీపక్ నబం అనే వ్యక్తి తాను స్థాపించిన స్టార్టప్ సంస్థ ద్వారా నిరాశ్రయులకు సాయంచేస్తున్నాడని ప్రశంసించారు. ఈనెల 25వ తేదీ జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రస్తావించారు. ఎన్నికల సంఘం ఎన్నికలప్రక్రి యను ఎప్పటికప్పుడు ఆధునీకరించి పటిష్టం చేస్తున్నదన్నారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ నిష్పక్షపాతంగా పోలింగ్‌ప్రక్రియ నిర్వహిస్తుందని కొనియాడారు. అయోధ్య రామ మందిరం వార్షికోత్సవంపై మాట్లాడిన మోడీ ఇది ఎంతో పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు.



# అమలులోకి 'గాజా' శాంతి ఒప్పందం..

## చివరి వరకు ఇజ్రాయెల్ దాడులు!

**జెరూసలేం, జనవరి 19:** గాజాలో ఎట్టకేలకు కాల్పులు విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం 8.30 గంటలకే ఇది అమలులోకి రావాల్సి ఉండగా దాదాపు మూడు గంటలు ఆలస్యమైంది. హమాస్ నుంచి ఇజ్రాయెలీ బందీల జాబితా విడుదలలో జాప్యం కావడంతో తొలుత శాంతి ఒప్పందం అమలుపై సందిగ్ధత నెలకొంది. చివరకు ముగ్గురు బందీల వివరాలను హమాస్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం అమలుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ ముగ్గురు బందీలు నేడు విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 15 నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతూ ఇజ్రాయెల్-హమాస్‌లు ఇటీవల ఓ అంగీకారానికి వచ్చిన విషయం తెలిసిందే. అయితే.. హమాస్ చెర నుంచి విడుదల కావాల్సిన బందీల జాబితా అందేవరకు ఒప్పందం అమలుకు ముందుకొచ్చే ప్రసక్తే లేదని నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ సేనలు గాజాపై దాడులు చేసినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ దాడుల్లో ఎనిమిది మంది మృతి చెందగా 25 మంది గాయపడినట్లు వెల్లడించింది. సాంకేతిక కారణాలతో బందీల వివరాలు అందజేయడంలో ఆలస్యమైందని హమాస్ చెప్పింది. ఎట్టకేలకు వివరాలు వెల్లడించడంతో కాల్పుల విరమణ అమలుకు మార్గం సుగమమైంది.



## సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్

**గువాహతి, జనవరి 19:** అస్సాం పోలీస్ చీఫ్ జ్ఞానేంద్రప్రతాప్‌సింగ్‌ను కేంద్ర రిజర్వుపోలీస్ దళం సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్రం నియమించింది. కేంద్ర వ్యక్తిత్వ మానవవనరులశాఖ ఈమేరకు నోటిఫికేషన్ జారీచేసింది. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన సింగ్ అస్సాం మేఘాలయ కేడర్‌కు చెందినవారు. కేబినెట్ నియామకాల కమిటీ సింగ్ సిఆర్‌పిఎఫ్‌డిజి నియామకాన్ని ఆమోదించింది. ఆయన 2027 నవంబరు 30వరకూ ఈ పోస్టులో కొనసాగుతారు. సీనియర్ ఐపిఎస్ అధికారి విటుల్ కుమార్ ఇప్పటివరకూ ఇన్ ఛార్జిగా కొనసాగుతున్నారు. అప్పటిసిఆర్‌పిఎఫ్ డిజి అనిశ్ దయాల్‌సింగ్ డిసెంబరు 31వ తేదీ పదవీ విరమణ చేయడంతో అప్పటినుంచి వితుల్‌కుమార్ ఇన్‌ఛార్జిగానే కొనసాగుతున్నారు.

# రైతునేతలతో చర్చలకు ప్రభుత్వప్రతినిధుల ఆహ్వానం

### ఫిబ్రవరి 14న చండీఘర్‌లో చర్చలు

### వైద్యచికిత్సలకు అంగీకరించిన రైతునేత దల్లేవాల్

### నిరవధిక దీక్షలు ఉపసంహరించుకున్న 121 మంది రైతులు



**న్యూఢిల్లీ, జనవరి 19:** పంజాబ్ హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరివద్ద రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ దల్లేవాల్ వైద్యచికిత్సకు అంగీకరించిన నేపథ్యంలో వైద్యులు ఆయనకు ముందుగా నిస్సత్తువను తొలగించేందుకు సెలైన్ ఎక్కిస్తున్నారు. అయితే దల్లేవాల్‌కు మద్దతుగా ఆదివారంనుంచి 121 మంది రైతులు ఖనౌరి నిరసన కేంద్రం వద్దనే దల్లేవాల్‌కు సంఘీభావంగా ఆమరణదీక్షను చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే దల్లేవాల్ వైద్య చికిత్స తీసుకునేందుకు అంగీకరించడంతో వారు తమ నిరవధిక దీక్షను ఆదివారంనుంచే ఉపసంహరించుకున్నారు. 70 ఏళ్ల దల్లేవాల్ గడచిన రెండు నెలలుగా ఆమరణదీక్షలో ఉన్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి నేటివరకూ ఆయన చికిత్సలకు అంగీకరించలేదు. ముందుగా ప్రభుత్వం ఇచ్చిన డిమాండ్లను నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఆతర్వాతనే తాను వైద్యసాయం పొందుతానని తెగేసి చెప్పడంతో అటు కేంద్రం, ఇటు పంజాబ్ రాష్ట్రాలమధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. వచ్చేనెల 14వ తేదీ రైతుల డిమాండ్లపై చర్చించేందుకు కేంద్రం ఆహ్వానించడంతో దల్లేవాల్ తన దీక్షను కొంతమేర సడలించుకున్నారు. రోజురోజుకూ దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుండటం, ప్రభుత్వం కూడా రైతుల డిమాండ్లను పట్టించుకోకపోవడంతో 121 మంది రైతులు ఆమరణ దీక్షకు పూనుకున్నారు. ఇపుడు దల్లేవాల్ చికిత్సకు అంగీకరించడంతో 121 మంది రైతులు పండ్లరసం సేవించి తమ దీక్షను విరమించారు. డిఐజి మన్‌దీప్‌సింగ్ సిద్ధు, పాటియాలా సీనియర్ సూపరింటెండెంట్ నానక్‌సింగ్‌ల సమక్షంలో వారు దీక్షలు విరమించారు. కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి ప్రతినిధిబృందం వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రియారంజన్ ఆధ్వర్యంలోరైతు నాయకుడు దల్లేవాల్ ఇతర రైతు ప్రతినిదులను కలిసి చర్చలుజరిపారు. సంయుక్త కిసాన్‌మోర్చా కిసాన్‌మజ్దూర్‌మోర్చానేతలతో ముందురోజు వారిని సంప్రదించి ప్రభుత్వంతో చర్చలకు ఆహ్వానించారు. చండీఘర్‌లో వచ్చేనెల 14వ తేదీ చర్చలు పునఃప్రారంభం అవుతాయని రైతు నేతలు ఈసందర్భంగా ప్రకటించారు. ప్రభుత్వం నుంచి ఈ ప్రకటన రావడంతో దల్లేవాల్ వైద్య చికిత్సలకు అంగీకరించారు. ఇంట్రావీనస్‌డ్రిప్‌తో ఆయనకు వైద్యులు చికిత్సలు ప్రారంభించారు. అయితే రైతు పంటలకు కనీసమద్దతుధర చట్టబద్ధం చేసేంతవరకూ దల్లేవాల్ తన దీక్షను విరమించరని రైతునేతలు స్పష్టం చేసారు.

# తప్పుచేస్తే కొడుకునైనా శిక్షించాల్సిందే..!

### నా కుమారుడు సంజయ్ శిక్షార్హుడే

### ఆర్జీకర్ ఆసుపత్రి కేసులో నిందితుడి తల్లి మీడియాకు వెల్లడి



**కోల్‌కత్తా, జనవరి 19:** ఆర్జీకర్ ఆసుపత్రి పిజి వైద్యవిద్యార్థినిపై హత్యాచారంకేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌ను కోల్‌కత్తా కోర్టు దోషిగా నిర్ధారించిన క్రమంలో ఆమె తల్లి స్పందించింది. తన కొడుకు తప్పుచేస్తే కచ్చితంగా తగిన శిక్ష విధించాలని పేర్కొన్నారు. తన కుమారుడు చేసిన తప్పును ఓ మహిళగా ఎప్పటికీ క్షమించనని ఆగ్రహం వ్యక్తం చేసారు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని వైద్యురాలు పడిన బాధను నరకాన్ని అర్థం చేసుకోగలనని ఆవేదన వ్యక్తం చేసారు. నాకొడుకు చనిపోతే నేను ఏడుస్తానేమో కానీ ఓ యువతి పట్ల ప్రవర్తించిన తీరుకు సంజయ్‌కు జీవించే హక్కులేదని, ఆతడికి మరణశిక్ష విధించినా మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వైద్యురాలు నాకు కూతురితో సమానం. కుమార్తెకు ఇటువంటి పరిస్థితి వస్తే ఏతల్లీ ఊరుకోదని ఆమె అన్నారు. ఈకేసుపై సుప్రీంకోర్టుకు వెళతారా అన్న ప్రశ్నపై సంజయ్‌సోదరి మాట్లాడుతూ ఆ ఉద్దేశ్యం తమకు లేదని తెలిపారు. అతడు ఇలాంటి దారుణానికి ఒడిగడతాడని తమెప్పుడూ అనుకోలేదన్నారు. అయితే నేరం జరిగిన ప్రాంతంలో సంజయ్‌తోపాటు మరికొంతమంది ఉన్నట్లు వివరాలు వస్తున్నాయని ఈ విషయమై సిబిఐ పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి తగిన శిక్ష విధించాలని కోరారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈకేసులో ముద్దాయికి ఎంతకాలం శిక్ష విదించబోయేది సోమవారం ప్రకటిస్తామని కోల్‌కత్తాలోని సీల్డా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ ప్రకటించారు. 31 యేళ్ల వైద్యురాలి మృతదేహాన్ని గత ఏడాది ఆగస్టు 10న ఆసుపత్రి సమావేశ గదిలో గుర్తించిన సంగతి తెలిసిందే. ఘటన జరిగిన 162 రోజుల తర్వాత ఈకేసులో తీర్పువచ్చింది.

# ప్రభుత్వ ఉద్యోగులకు స్థలాలిస్తే ఇళ్లు కట్టిస్తాం

## ప్రధాని మోడీకి కేజ్రీవాల్ మరోలేఖ



**న్యూఢిల్లీ, జనవరి 19:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు మరింత సమీపిస్తున్న కొద్దీ ఆప్ జాతీయ కన్వీనర్ మాజీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్ ప్రధాని మోడీకి లేఖాస్త్రాలను మరిన్ని సంధిస్తున్నారు. ఇప్పటికే రెండుమూడు లేఖలు సంధించిన కేజ్రీవాల్ తాజాగా మరో లేఖను రాసారు. ఢిల్లీలోప్రభుత్వ ఉద్యోగులందరికీ నివాసాలు ఏర్పాటుచేయాలన్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఇందుకోసం ఒక స్కీమ్ తీసుకొచ్చి ఆ స్కీంద్వారా వారికి ఇఎంఐల రూపంలో నగదు చెల్లించే అవకాశం ఇవ్వాలన్నారు. ఆదివారం ఆయన మీడియాతోమాట్లాడుతూ ఢిల్లీప్రభుత్వానికి భూములు ఇవ్వండి. ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్లునిర్మించుకోడానికి ఈభూమిని పంపిణీ చేద్దాం. రాజ్యాంగంప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో భూపంపిణీ చేసే అధికారం అక్కడి రాష్ట్రప్రభుత్వానికి లేదు. ఈ అంశం కేంద్రపరిధిలో ఉంది. అందుకే ప్రధానిమోడీకి లేఖ రాసానని అన్నారు. ఢిల్లీలోని పారిశుధ్య కార్మికులు గురించి కూడా లేఖలో మోడీకి వివరించామని కేజ్రీవాల్ తెలిపారు. ఎన్డీఎంసి, ఎంసిడిల్లోపనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నివాసం ఏర్పాటు ఎంతో అవసరమని వారికి రాయితీలు కల్పించి తక్కువ రేట్లకు భూమిని ఇస్తే వారు గృహాలు ఏర్పాటుచేసుకుంటారని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వీరిది కీలకపాత్రఅని వారు నగరానికి బ్యాక్‌బోన్ వంటి వారన్నారు. భూమికోసం వీరుతీసుకున్న రుణాన్ని నెలవారీ పద్ధతుల్లో తిరిగి చెల్లించే విధంగా స్కీం తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. వారు ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన వాటిల్లో నివసిస్తున్నారని అవి తాత్కాలికమేనని రిటైర్మెంట్ అయిన తర్వాత వారు ఆ గృహాలను వదిలేయాల్సిన పరిస్థితి ఉందని, శానిటేషన్ కార్మికులు వేరే ఇళ్లు కొనుక్కోవాలన్నా ఢిల్లీ వంటి మహానగరంలో అద్దెకు ఉండాలన్నా అదిభరించలేనంతగా ఉంది. అలా కాకుండా వారికి భూమిని ప్రభుత్వమే ఇచ్చి ప్రోత్సాహం ఇస్తే వారికి ఎ ంతోమేలుచేసిన వారిగా మిగిలిపోతామని లేఖలో అన్నారు. ఇటీవలే ఢిల్లీలో నివసిస్తున్న జాట్స్ కులస్తులను ఓబిసిలో చేర్చాలనే డిమాండ్‌తోప్రధానిమోడీకి లేఖరాసారు. ఓబిసిలో చేర్చడంవల్ల రాజస్థాన్ నుంచి వచ్చే జాట్స్ ఢిల్లీయూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందడంతోపాటు ఎయిమ్స్‌లోకూడా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అన్ని కేంద్ర ప్రభుత్వసంస్థల్లో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఢిల్లీలో వచ్చేనెల ఐదో తేదీ జరిగే ఎన్నికలకు సంబంధించి బిజెపి, కాంగ్రెస్, ఆప్ పార్టీలు పోటాపోటీప్రచారాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలోనే ముందురోజు తమ అధినేత కాన్వాయ్‌పై రాళ్లదాడిజరిగిందంటూ ఆప్ కేడర్ పెద్దఎత్తున నిరసనలకు దిగింది. రెండు పర్యాయాలు గెలిచిన ఆప్ ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్‌సాధించేదిశగా వెళుతోంది. ఇదిలా ఉంటే బిజెపి, కాంగ్రెస్‌లు ఢిల్లీలో తమ పూర్వ వైభవాన్ని మళ్లీ తిరిగి తీసుకురావాలన్న పట్టుదలతో ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నాయి.



## నైజీరియాలో పేలిన పెట్రోల్ ట్యాంకర్

# 77 మంది ప్రాణాలు బుగ్గిపాలు

**అబుజా, జనవరి 19:** పశ్చిమ ఆఫ్రికా దేశం నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలడంతో 77 మంది మరణించారు. సెంట్రల్ నైజీరియాలోని నైజర్‌లో ఉన్న సులేజా ప్రాంతంలో కొంతమంది ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి జనరేటర్ ఉపయోగించి పెట్రోల్ పంపు చేస్తుండగా పేలుడు సంభవించింది. దీంతో పెట్రోల్‌ను పంప్ చేస్తున్న వారితోపాటు చుట్టుపక్కల పదుల మీటర్ల దూరంలో ఉన్న వారు కూడా మరణించినట్లు నైజీరియా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రమాదంలో మరో 25 మంది గాయపడ్డారని పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. మృతుల్లో చాలామంది గుర్తించలేనంతగా కాలిపోయారని తెలిపింది. సరకు రవాణాకు సరైన రైల్వే వ్యవస్థ లేకపోవడంతో నైజీరియాలో ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. రెండువారాల క్రితం డెల్టా స్టేట్‌లో ఫ్యూయల్ ట్యాంకర్ కోసం జరిగిన అల్లర్లలో ఐదుగురు మరణించారు. అదేవిధంగా గత యేడాది అక్టోబరులో పైప్‌లైన్ల నుంచి లీకవుతున్న పెట్రోల్‌ను పట్టుకోవడానికి జనాలు ఎగబడటంతో జరిగిన పేలుళ్లలో సుమారు 153మంది మృతిచెందారు. నైజీరియాలో ఆర్థిక పరిస్థితులు అంతకంతకూ దిగజారడంతో గత 18 నెలల్లో చమురు ధరలు 400 శాతం పెరిగాయి.



## రాహుల్‌పై గువాహతిలో కేసు నమోదు

**పాట్నా, జనవరి 19:** రాజ్యాంగపరిరక్షణకు కాంగ్రెస్‌పార్టీ దేశంతోనూ పోరాడుతోందని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీచేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయనపై అస్సాంలోని గువాహతి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌నమోదుచేసారు. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేసారు. రాహుల్ వాక్‌స్వాతంత్ర్య పరిమితులను దాటారని అవిజాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పుకలిగిస్తాయని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితోపాటు వేర్పాటువాద భావాలుకలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్‌కు ఉందని కానీ ఆయన అందుకు బలుదుగా అబద్దాలు వ్యాప్తిచేసి దేశ ఐక్యతను సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారని చాటియా ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయాన్ని ఇటీవలేప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనే రాహుల్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి భారత్ దేశంపైనా కూడా రాజ్యాంగపరిరక్షణకు పోరాడుతున్నామని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను పలువురు కేంద్ర మంత్రులు తప్పుపట్టారు. కాంగ్రెస్ అసలు రూపం ఈవ్యాఖ్యలతో బయటకు వచ్చిందని బిజెపి జాతీయ అధ్యక్షుడు మంత్రి జగ్‌ప్రకాష్ నడ్డా అన్నారు.

# జార్ఖండ్‌లోని నాలుగు జిల్లాలకు అందుబాటులోకి రైలుసేవలు



**రాంచీ, జనవరి 19:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేళ్లు దాటాక తొలిసారిగా జార్ఖండ్‌లోని నాలుగు జిల్లాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి రానున్నది. ఖుంటి, సిమ్డేగా, గుమ్లా, చత్రా జిల్లాలను రైలుమార్గంతో అనుసంధానించనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రాంచీ డివిజన్ పరిధిలోకి వచ్చే ఈ రైల్వే ప్రాజెక్టు కోసం ప్రాథమిక సర్వే నివేదికను పూర్తి చేసినట్లు తెలిపింది. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను రైల్వే బోర్డుకు పంపినట్లు పేర్కొంది. కాగా, ప్రస్తుతం ఉన్న రాంచీ-లోహర్దగా రైలు మార్గంతో గుమ్లా, ఖుంటి ,సిమ్డేగా జిల్లాలను అనుసంధానిస్తారు. అలాగే రాంచీ-హజారీబాగ్ రైలు మార్గంలో చత్రా జిల్లాను కలుపుతారు. జార్ఖండ్ రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టు సర్వేను పూర్తి చేసింది. లోహర్దగా నుంచి గుమ్లా వరకు 55 కి.మీ., గుమ్లా నుంచి సిమ్డేగా వరకు 43 కిలోమీటర్లు, హతియా నుంచి ఖుంటి వరకు 20 కిలోమీటర్లు, హజారీబాగ్ నుంచి చత్రా వరకు 42 కిలోమీటర్ల మేర రైలు మార్గాన్ని నిర్మిస్తారు. మరోవైపు ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌లోని ఏడు జిల్లాల్లో కొత్త రైల్వే లైన్లు, ఇతర ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌ను గత యేడాది ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రూ. 6,500 కోట్ల వ్యయంతో చేపట్టే మూడు రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

# సైఫ్ ఆలీఖాన్‌పై దాడి నిందితుడు అరెస్టు



### మహ్మద్ షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్‌గా పోలీసులు గుర్తింపు

**ముంబయి,జనవరి 19:** బాలివుడ్ నటుడు సైఫ్ ఆలీఖాన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడిని శనివారం అర్ధరాత్రి దాటాక పోలీసులు థాణెలో అరెస్టు చేసారు. ఆదివారం ఉదయం డిసిపి దీక్షిత్ మీడియా సమావేశంలో పూర్తి వివరాలను వెల్లడించారు. ఈనెల 16వ తేదీ తెల్లవారు జామున 2 గంటలకు సైఫ్ ఆలీఖాన్‌పై దాడి జరిగింది. ఎఫ్ఐఆర్ నమోదుచేసాం. 30 ఏళ్ల మహ్మద్ షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించాం. ఆతడిని అరెస్టుచేసాం. దొంగతనంచేయాలనే ఉద్దేశ్యంతోనే ఆతడు సైఫ్ నివాసంలోకి వెళ్లాడని డిసిపి తెలిపారు. ఆతడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిస్తే ఐదురోజుల పోలీస్ కస్టడీకి ఇచ్చారు. ఆతడు బంగ్లాదేశీ యుడని గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడు. భారత్ వచ్చాక విజయ్‌దాస్‌గా పేరు మార్చుకుని ఆరునెలల క్రితం ముంబయి వచ్చాడని, భారతీయుడని చెప్పడానికి ఆతడివద్ద సరైన ఆధారాలు లేవన్నారు. బాంద్రాలోని సైఫ్‌నివాసంలో 16వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ సంఘటన జరిగింది. సైఫ్ ఆతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా దుండగుడు సైఫ్ చిన్న కుమారుడు జేహ్ గదిలోకి వెళ్లాడని, దుం డగుడిని చూసిన జేహ్ కేర్‌టేకర్ కేకలువేయగా సైఫ్ అక్కడికి చేరుకున్న సమయంలోనే పెను గులాట జరిగిందని, ఈక్రమంలో సైఫ్ గాయ పడ్డాడని పోలీసులు తెలిపారు. ఆరుచోట్ల కత్తి పోట్లుఉన్నాయని, హుటాహుటిన లీలావతి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన క్షేమంగా ఉన్నారని వైద్యులు ప్రకటించారు. ఐసియునుంచి ప్రత్యేక గదికి మార్చారని, ప్రస్తుతం సైఫ్ ఆలీఖాన్ లీలావతి ఆసుపత్రిలోనే ఉన్నట్లు తెలిపారు. దాడిఘటనపై కేసునమోదుచేసుకున్న ముంబయి పోలీసులు సుమారు 30బృందాలుగా ఏర్పడి 70 గంటలపాటు అనేక వ్యయప్రయాసలకోర్చి ఎట్టకేలకు నిందితుడిని థాణెలో అరెస్టు చేసారు. ఈకేసులో పోలీసులు అనేక గంటల సీసీటివిఫుటేజిని కూడా పరిశీలించారు. అంధేరిలోని డిఎన్‌నగర్‌లో నిందితుడు తచ్చాడుతున్నట్లు పోలీసులు సిసిటివిలో గుర్తించారు. నిందితుడు బైక్‌నుంచి దిగుతుండటం కనిపించింది. టూవీలర్‌నెంబరు ఆధారంగా ముందు గాలించారు. స్థానిక ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్స్ ప్రకారం వొర్లిలోని కోలివాడలో ఒక అద్దె ఇంటిని కూడా తనిఖీ చేసారు. నిందితుడు మరో ముగ్గురుతో కలిసి నివసిస్తున్నట్లు తేలింది. పోలీస్ టీమ్ ఆతడు నివసించేగదికి వెళ్లి అకనకడి ప్రజలను ప్రశ్నించారు. దీనితో ఆతడిపేరు, సమాచారం కొంత రాబట్టారు. అలాగే పోలీ సులు ఆతడి ఫోన్‌నంబరు కూడా తీసుకుని ఆతని ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేసారు. ఇదిలా ఉండగా ముంబయి కోర్టు నగర పోలీసులకు నిం దితుడిని ఐదురోజుల పోలీస్ కస్టడీకి అనుమ తించింది. అరెస్టుచేసిన వెంటనే ఆతడిని కోర్టులో హాజరుపరిచారు. 14రోజులు కస్టడీకావాలని కోరిన పోలీసులకు న్యాయమూర్తి ఐదురోజులకు అనుమతించారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మాట్లా డుతూ బాంద్రా ప్రాంతంలో అనేకమంది సెలబ్రిటీలు ఉన్నారని, నిందితుడు సైఫ్ ఇంట్లోకి వచ్చా డని ప్లాన్‌ప్రకారమే కొనసాగినట్లు తెలిపారు. నిందితుడి తరపున దినేష్‌ప్రజాపతి న్యాయవాది వచ్చారు. తమ క్లయింటు నుంచి రికవరీ చేసిందేమీలేదని, ఎలాంటి డాక్యుమెంట్లు కూడా నివేదించలేదని, ఆతడు బంగ్లాదేశీ అని చెప్పడానికి సరైనా ఆధారాలు చూపించలేకపోయారని ప్రజాపతి కోర్టుకు తెలిపారు.



# డిఎంకెలో చేరిన నటుడు సత్యరాజ్ కుమార్తె

**చెన్నై, జనవరి 19:** బహుభాషా నటుడు సత్యరాజ్‌కుమారెనత దివ్యసత్యరాజ్ డిఎంకెలో చేరారు. తమిళనాడు ముఖ్యమంత్రి డిఎంకె చీఫ్ ఎంకె స్టాలిన్ సమక్షంలో ఆదివారం ఆమె డిఎంకెపార్టీలోచేరారు. పోషకాహార నిపుణురాలయిన దివ్యసత్యరాజ్ డిఎంకేలో చేరిన అంశాన్ని ఆపార్టీ ఎక్స్‌వేదికగా ప్రకటించింది. డిఎంకె ఎంపి టిఆర్‌బాలు పార్టీ నేతలు కెఎన్‌నెహ్రూ, పికె శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. 2019లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె స్టాలిన్‌ను కలిసిన సమయంలో డిఎంకెలో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ఊహాగానాలు వచ్చాయి అయితే కేవలం మర్యాద పూర్వకంగా మాత్రమే కలిసానని ఇరుకుటుంబాల మధ్య సన్నిహిత సంబం ధాలున్నట్లు అప్పట్లో ఆమె వివరణ ఇచ్చారు. తాజాగా డిఎంకెలో చేరిన సందర్భంగా దివ్య మాట్లాడుతూ ప్రజలకు సేవచేయాలనేది తన కల అన్నారు. చిన్ననాటినుంచే డిఎంకె విధానాలను ఇష్టపడినట్లు చెప్పారు. ఆపార్టీలో చేరడానికి అనేక కారణాలున్నాయన్న ఆమె తానొక పోషకాహార నిపుణురాలినని, డిఎంకే ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న పార్టీ అని అన్నారు. అందుకే రాష్ట్రంలో అల్పాహార కార్యక్రమాన్ని సైతం ప్రారంభించిందని తెలిపారు. మహిళలను అన్ని మతాలను గౌరవించే పార్టీ డిఎంకె అని అన్నారు.

# జోరందుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు**

**బిజెపి అభ్యర్థులను ప్రకటించగా.. ఇంకా ప్రకటించని కాంగ్రెస్, బిఆర్ఎస్**

**మార్చిలో రెండు ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు**

**మరో 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలకు కూడా..**

**నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటి వారం షెడ్యూల్ జారీ**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏప్రిల్‌లో 8 ఎమ్మెల్సీ స్థానాలకు గడువు ముగియనుండటంతో.. ఆయా స్థానాలకు మార్చిలోనే ఎన్నికలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ఈ నెల చివరి వారంలో గానీ లేదా ఫిబ్రవరి మొదటి వారంలోగానీ ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలు, ఒక గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఉండగా.. మరో 5 ఎమ్మెల్సీలను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారం జోరందుకుంది. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలుగా కొనసాగుతున్న యూటీఎఫ్, పీఆర్‌టీయూ రెండు స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఇప్పటికే ఆయా సంఘాలు ప్రకటించిన అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించారు. టీఎస్ యూటీఎఫ్ తరపున నల్గొండ - వరంగల్ -ఖమ్మం నియోజకవర్గానికి ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని తిరిగి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పీఆర్‌టీయూ టీఎస్ తరపున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్న పింగిలి శ్రీపాల్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా ఆదిలాబాద్-నిజామాబాద్- కరీంనగర్- మెదక్ అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డిని ఎంపిక చేయగా.. ఇద్దరు అభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజక వర్గానికి సంబంధించి ఎస్టీయూ టీఎస్‌తోపాటు జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్(జాక్టో) తరపున మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పోటీలో కొనసాగుతున్నారు. ఇదే స్థానం నుంచి బీజేపీ తన అభ్యర్థిగా మాజీ పీఆర్‌టీయూ నేత పి సరోత్తమ్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా.. ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్-కరీంనగర్ నుంచి ప్రైవేటు విద్యా సంస్థల యజమాని కొమురయ్యను అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఇప్పటికే అభ్యర్థులుగా ఎంపికైన వారు తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ తరపున ఇప్పటి వరకు రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు.

కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాల నుంచి పోటీ చేయకుండా వామపక్ష పార్టీలకు తమ మద్దతును ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ స్థానానికి త్వరలోనే అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ స్థానం ప్రస్తుతం కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం.. టీ జీవన్ రెడ్డి గత ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. అయితే ఈ మధ్య కాలంలో ఆయనకు పార్టీకి మధ్య సమస్యలు కొనసాగుతున్నాయి..

ఈ నేపథ్యంలో తిరిగి ఆయనకే టికెట్‌ను ఇస్తారా? లేకపోతే వేరేవారికి ఇస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి తమ అభ్యర్థిని ప్రకటించింది. ఇక మొన్నటి వరకు రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో కొనసాగిన భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత తనయ ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశంతోనే ఈ మధ్య కాలంలో కవిత ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనడమే కాకుండా.. పార్టీ తరపున ఆందోళన కార్యక్రమాలను, ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ధర్నాలను సైతం నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఉపాధ్యాయ సంఘాలతో కాకుండా తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు, ఇతర చిన్న చిన్న సంఘాల తరపున కూడా అభ్యర్థులు పోటీ చేస్తామని ప్రకటించారు. కొందరైతే ఇప్పటికే అభ్యర్థులను కూడా ప్రకటించారు. ఈ మూడు స్థానాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల చివరివారంలోగానీ లేదా ఫిబ్రవరి మొదటి వారంలోగానీ వెలువడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



## తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి

**అవినీతిరహిత పాలన కావాలంటే బిజెపి అధికారంలోకి రావాల్సిందే: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**పార్టీలో చేరిన వివిధ పార్టీ నాయకులు**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణలో అవినీతి రహిత పాలన అందాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న, అవినీతి, నష్టాలకు, అక్రమాలకు, దోపిడికి బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని చెప్పారు. దేశంలో గత పదేళ్లు అధికారంలో ఉన్న బిజెపి కేంద్ర మంత్రులపై, ప్రభుత్వంపై ఒక్క రూపాయి అవినీతి చేసినట్లు కనీసం ఆరో పణలు కూడా రాలేదని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు, కార్యకర్తలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. అందుకే రాష్ట్ర ప్రజానీకం బిజెపిని ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఎనిమిది పార్లమెంట్ స్థానాలు ఇచ్చారని గుర్తు చేశారు.

## నేటితో ముగియనున్న టెట్ పరీక్షలు

**ఫిబ్రవరిలో ఫలితాలు విడుదల**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత కోసం నిర్వ హించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)2024-25కి సంబంధించిన పరీక్షలు నేటి(సోమవారం)తో ముగియనున్నాయి. పేపర్-1 పరీక్షలు శని వారంతో ముగియగా.. నేటి(సోమవారం)తో పేపర్-2 పరీక్షలు కూడా ముగియనున్నాయి. ఈ నెల 2 నుంచి ఆన్‌లైన్ విధానంలో టెట్- 2024-25 పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షల ఫలితాలను ఫిబ్రవరిలో విడుదల చేయడానికి పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. టెట్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 2,75,753 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కి 94,327 దరఖాస్తులు రాగా.. పేపర్-2కి 1,81,426 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు.. రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలకు కొనసాగిస్తున్నారు. టెట్-2 పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో 92 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ఈ నెల 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. మొత్తం 10 రోజులపాటు 20 సెషన్‌లలో పరీక్షలను పూర్తిచేశారు. టెట్-2 ఫలితాలు వెలువడిన అనంతరం ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ(డీఎస్‌సీ)-2025 నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉంది. సుమారు 6 వేల పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని ఇప్పటికే పలువురు మంత్రులు ప్రకటించిన విషయం తెలిసిందే.

## నెహ్రూ హయాంలో మృత్యుహేల..

## మోడీ సారథ్యంలో మహాద్భుతంగా మహాకుంభమేళా

**ఎక్స్(ట్విట్టర్)లో రాష్ట్ర బిజెపి**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** నెహ్రూ హయాంలో మృత్యుహేల.. మోడీ సారథ్యంలో మహాద్భుతంగా మహా కుంభమేళ అని బిజెపి తెలంగాణ ఆరోపించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ఘనంగా జరుగుతున్నదన్నారు. మహాకుంభమేళాకు అన్ని రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం అన్నీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా మహా కుంభమేళా ఏర్పాట్ల విషయమై కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ.. బిజెపి తెలంగాణ ఆసక్తికర ట్వీట్ చేసింది. ఇందులో 144 యేళ్ల కొకసారి జరిగే మహా కుంభ మేళాకు పెద్దఎత్తున భక్తులు పోటెత్తుతారు అనేది సత్యమని, అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో కాంగ్రెస్ నిత్యం విఫలమవుతూ వస్తోందన్నారు. 1954లో జరిగిన మహాకుంభమేళాలో ఫిబ్రవరి 3న మౌని అమావాస్య రోజున అసంఖ్యాకంగా భక్తులు, సాధువులు, అఘోరాలు తరలివచ్చారు. అదే రోజు ప్రధాని నెహ్రూ వస్తున్నారని బారికేడ్లు ఏర్పాటు చేయడంతో జరిగిన తొక్కిసలాటలో అధికారికంగా 800 వందల మంది చనిపోయినా అనధికారిక లెక్కల ప్రకారం 2 వేల మంది చనిపోయి ఉండవచ్చన్న సమాచారం ఉందని తెలిపింది. 2013 మహాకుంభమేళాలో కూడా అలహాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో 36 మంది చనిపోయారని తెలిపింది. ఇప్పుడు జరుగుతున్న కుంభమేళాలో మోడీ ప్రభుత్వం సకల సౌకర్యాలు ఏర్పాటు చేసిందని వివరించింది. ఇక దీనిపై మహా కుంభమేళాను నెహ్రూ మృత్యుకేలిగా మార్చారని, 2 వేల మంది సాధువులు, భక్తులను పొట్టన బెట్టుకున్నారని ఆరోపించారు. అలాగే అదే నిర్లక్ష్యంతో 2013లోనూ భక్తుల చావుకు హస్తం పార్టీ కారణమైనదని, కానీ మోదీ సారథ్యంలో మహాద్భుతంగా మహాకుంభమేళా జరుగుతుందని రాష్ట్ర బిజెపి ట్విట్టర్‌లో పేర్కొంది.

## ఆదిలాబాద్‌లో అప్పుల బాధకు మరో రైతు ఆత్మహత్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** పంట సాగుబడి కోసం చేసిన పెట్టుబడులు చేతి కందక అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతలు ఆత్మహత్యల బాటపడుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంకులో పురుగులమందు తాగి జాదవ్ దేవరావు (60) శనివారం తనువు చాలించిన ఉదంతం మరవక ముందే, ఆదివారం మరో గిరిజన రైతు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం కలకలం రేపింది. వీరిద్దరూ గిరిజన రైతులే కావడం, బ్యాంకుల అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి మృత్యువాత పడిన ఘటనలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం లింగోజి తాండకు చెందిన రాథోడ్ గోకుల్ (40) కౌలు రైతు గత 20 ఏళ్లుగా పది ఎకరాల భూమిని సాగుచేస్తూ పంట పెట్టుబడి కోసం గతంలో రూ.6 లక్షలు యాక్సిస్ బ్యాంకు నుండి రుణం తీసుకున్నాడు. పంట దిగుబడి రాక సంక్షోభంలో ఉన్న రైతు గోకుల్ కు రుణం చెల్లించాలని బ్యాంకు సిబ్బంది వేధించడం వల్లే ఈనెల 12న క్రిమిసంహారణ మందు (గడ్డి నివారణ మందు) తాగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విషమ పరిస్థితిలో ఉన్న రైతు గోకుల్‌ను ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గిరిజన రైతు ఆత్మహత్యఘటన వారి కుటుంబంలో తీరని విషాదం నింపింది.

**దేవరావుకు కన్నీటి వీడ్కోలు..**

శనివారం ఐసిఐసిఐ బ్యాంకు లోనే పురుగుల మందు తాగి చనిపోయిన రైతు జాదవ్ దేవరావు (60) అంత్యక్రియలు ఆయన సొంత గ్రామం రేణిగుడలో జరిగాయి. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, రైతు సంఘాల నేతలు, లంబాడ హక్కుల పోరాట సమితి నేతలు హాజరై నివాళులర్పించారు. ప్రభుత్వ సహాయం అందకపోవడం, బ్యాంకుల అప్పులు తీర్చలేక, సిబ్బంది వేధింపులకు గురై రైతులు ఆత్మహత్య బాటపడుతున్నారని రైతు సంఘాల నేతలు ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

**రైతన్నలూ.. ఆత్మహత్యలొద్దు: మాజీమంత్రి హరీశ్‌రావు**

ఆదిలాబాద్ జిల్లాలో 24 గంటలు గడవకముందే రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని, రైతులెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వమే బాధ్యత వహించాలి.. రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని.. అలాంటి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటి వరకు 402 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.




సమావేశంలో మాట్లాడుతన్న సిపిఐ నాయకుల చాడ వెంకటరెడ్డి

## పేదల హక్కుల కోసం మళ్లీ పోరాటాలకు సిద్ధం

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, చాడ వెంకట్‌రెడ్డి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీ అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలోని శివానుభవ మండపంలో ఆది వారం నిర్వహించిన సిపిఐ శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కూడు, గూడు, భూమి కోసం అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిన పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన బిజెపి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందన్నారు. కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కాలరాస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల్లో ఉంటూ పేదల హక్కుల కోసం మరోసారి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సభలో పార్టీ కోసం యేళ్ల తరబడి పనిచేసిన సీనియర్ నాయకులను శాలువాలతో ఘనంగా సత్కా రించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహిం చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు రామిరెడ్డి, మల్లేష్, దయానందరెడ్డి, అశోక్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి విదేశ పర్యటనలతో ప్రయోజనం శూన్యం

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి రూపాయి లాభం లేదని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద ఆరోపించారు. రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటనలతో పెట్టుబడులు రాబోతున్నా యని అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడారు. గతంలో ఆమెరికా, దావోస్ పర్యటనలతో పెట్టుబడులు తెచ్చామని ప్రజలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు.

పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న విధంగా రేవంత్ రెడ్డి వ్యవహారం ఉందని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైజమని ఆరోపించారు. అదానీ కంపెనీ నుంచి రూ. 12వేల కోట్ల పెట్టుబడులు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.862 కోట్లు మాత్రమే తీసుకొచ్చిందని వివరించారు. ఫార్మా సిటీ, ఎయిర్ పోర్ట్ మెట్రో, ఫార్ములా ఈ రేస్ రద్దు చేసిన సీఎం నిర్ణయం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం వస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేకపోవడంతో రాష్ట్రం నుంచి కంపెనీలు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నాయని వెల్లడించారు.

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అని మోసం చేశారని, దేవుళ్లపై ప్రమాణం చేసి రుణమాఫీ అని రైతులను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు వల్ల వచ్చాయని చెప్పుకుంటున్న రూ. 40,232 కోట్ల పెట్టుబడుల్లో అసలు నిజాలు ఏమిటి ? అదాని సంస్థలకు చెందిన రూ. 12,400 కోట్ల పెట్టుబడి అనుమానాస్పదంగానే ఉందని స్పష్టం చేశారు. గోడి కంపెనీ రూ. 160 కోట్ల విలువ చేసే ఒక చిన్న షెల్ కంపెనీ తెలంగాణలో రూ. 8,000 కోట్లు పెట్టుబడి ఎలా పెడుతుందనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు.

జేఎస్‌డబ్ల్యూ సంస్థ ప్రకటించిన రూ. 9,000 కోట్ల పెట్టుబడి, వెబ్ వర్క్స్ సంస్థ ప్రకటించిన రూ. 5,200 కోట్ల పెట్టుబడి, గోద్రెజ్ సంస్థ ప్రకటించిన రూ. 1,270 కోట్ల పెట్టుబడిలో రూ. 300 కోట్లు గత బీఆర్ఎస్ హయాంలో జరిగినవేనని తెలిపారు. అప్పటి పరిశ్రమల శాఖా మంత్రి కేటీఆర్ చొరవతో టాటా గ్రూప్, గోద్రెజ్ సంస్థ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని గుర్తు చేశారు.




## శ్రీశైలం బ్యాక్‌వాటర్ దోపిడీకి గురవుతున్నా పట్టింపులేని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు

**సామాజికశాస్త్రవేత్త అశోక్‌కుమార్**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ దోపిడికి పాల్పడుతున్న ప్రైవేటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి సంస్థపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉదాసీనత వదిలి చర్యలు తీసుకోవాలని సామాజికశాస్త్రవేత్త అశోక్ కుమార్, కె.ప్రభాకర్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి సైదారావు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం కుడికాలువ నుంచి పోతిరెడ్డిపాడు మీదుగా పిన్నాపురం రిజర్వాయర్‌కు చేరిన నీటిని దాని సమీపంలోని సౌరవిద్యుత్ ఉత్పత్తి సంస్థ జలచౌర్యానికి పాల్పడుతోందని తెలిపారు. ఉదయం వేళ సౌరవిద్యుత్‌ను తయారించి రాత్రి వేళలో అక్రమంగా నీటిని ఉపయోగించు కొంటుందని ఆరోపించారు. పిన్నాపురం రిజర్వాయర్ 2015లో ఎపి ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు నుంచి నీరు తరలించడం వల్ల హైదరాబాద్‌తోపాటు ఇతర తెలుగు రాష్ట్రాలకు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని వారు తెలిపారు.

## ఎల్లలు దాటిన తెలుగు సంస్కృతీ సంప్రదాయం

**మెల్‌బోర్న్‌లోని తెలుగు సంఘం సంబరాల్లో పిసిసి చీఫ్**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** సంక్రాంతి సంబరాలతో తెలుగు సంస్కృతి సంప్రదాయం ఎల్లలు దాటిందని మనం ఎక్కడ ఉన్నా మూలాలను మరిచిపోవద్దని వాటిని కాపాడుకుంటూ ముందుకు పోవాలని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మెల్‌బోర్న్ తెలుగు అసోసియేషన్ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆస్ట్రేలియాకు వచ్చినా మనవారి లోగిళ్ళ ముందు రంగురంగుల రంగవళ్ళులతో అలంకరించడంతో తెలుగుపల్లెలలో విహరిస్తున్నట్లు ఉందని ఆయన అన్నారు. ఇక్కడ కూడా పండగను ఆనందంగా జరుపుకుంటున్నారు అని అన్నారు. తెలంగాణలో మన ప్రభుత్వం ఉందిద ఇక్కడ ఉన్న తెలుగు పారిశ్రామిక వేత్తలు మీ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టాలని అక్కడ అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షవ్యక్తంచేశారు. టిపిసిసి చీఫ్‌తో శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల వెనుకబాటుకు మాలలు కారణం కాదు

**ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు**




రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రొ.హరగోపాల్, ఐలయ్య, వినోద్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్ (బేగంపేట), జనవరి 19, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై భిన్న మైన అవగాహనతో ఏర్పడిన వివాదం సమాజానికి శ్రేయ స్కరం కాదని పేర్కొంటూ రిజర్వేషన్ల వర్గీకరణపై కోర్టు తీర్పులో సూచించిన అంశాల్లో అపోహలు, వాస్తవాలపై 'సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్' ఆధ్వ ర్యంలో అదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కులాలు సజాతీయులు కారని, క్రిమిలేయర్, ఎంపరికల్ డేటా, ప్రాతినిధ్య భాగస్వామ్యం, న్యాయపరమైన సమీక్ష పరిధి తదితర అంశాలపై జరిగిన చర్చలో పాల్గొన్నవారు తమతమ అభిప్రాయాలు తెలిపారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ మాదిగల వెనుకబాటుకు మాలలు కారణం కాదన్నారు. బిజెపికి 400 పార్లమెంటు సీట్లు వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉండేవి కాదన్నారు. కంచె ఐలయ్య మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్రపతి ఉత్వర్వులకు విరుద్ధం అన్నారు. రాష్ట్రపతి నోటిపై చేసిన కులాలను సజాతీయులు కావు అనడాన్ని అంగీకరిస్తే రాష్ట్రపతి ఉత్తర్వులను తిరస్కరించినట్లే అని పేర్కొన్నారు. గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ అంటరానితనం ఇంకా అమలులో ఉన్నప్పుడు వర్గీకరణ ద్వారా అంటరానితనం పోతుందా అని ప్రశ్నించారు. 371డి ప్రకారం రాష్ట్రాలు, జిల్లా, జోనల్ పోస్టుల వర్గీకరణ చేయాలన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం వర్గీకరణ చేస్తే క్రిమిలేయర్ వర్తిస్తుందని హెచ్చరించారు. హైకోర్టు సీనియర్ కౌన్సిల్ ఉపేందర్‌రావు మాట్లాడుతూ ఏకసభ్య కమీషన్‌కు చట్టబద్దత లేదని, న్యాయసమీక్షలో నిలువదని తెలిపారు. ప్రొ.కోదండరామ్, పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు రాష్ట్ర ప్రభుత్వ చర్యలను సమర్థించారు. న్యాయవాది శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా రమేష్ బాబు తీర్పులోని లొసుగులను తెలి పారు. సమావేశం అనంతరం మరో సారి చర్చ జరపనున్నట్లు పేర్కొన్నారు. సమా వేశంలో విద్యా, సామాజికవేత్తలు సర్వయ్య, మందాల భాస్కర్, బైరి వెంకటేశ్, మామిడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేయాలి

**తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ డిమాండ్**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నుండి క్లైయిమ్‌లు రాకపోవడంతో అన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఈ నెల 10 నుంచి ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్సను నిలిపివేశామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ నాయకులు డాక్టర్ విజయచందర్ రెడ్డి, డాక్టర్ నాగార్జున రెడ్డి తెలిపారు. ఆదివారం అసోసియేషన్ నేతలు మీడియాతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులు రాకపోవడంతో ఈ నెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని ప్రభుత్వానికి చెప్పిన నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సీఈవో అసోసియేషన్ నేతలతో ఈ నెల 9న చర్చలు జరిపారు. అయితే చర్చల్లో ఏ ఒక్క హామీ లభించకపోవడంతో ఈ నెల 10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసినట్టు తెలిపారు. కేవలం అత్యవసర సేవలను మాత్రమే కొనసాగి స్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నిలిపి వేయడానికి కారణాలు తెలుపుతూ.. ఆసుపత్రులు కన్సల్టేషన్ మొత్తాలను, జీతాలను చెల్లించలేనందున కన్సల్టెంట్‌లు పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. గత ఆరు నెలలుగా ఆసుపత్రులు డబ్బులు చెల్లించలేక పోయినందున సరఫరాదారులు తమ సరఫరాలను నిలిపివేశారని తెలిపారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ నేతలు తమ ప్రధానమైన నాలుగు డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేశామని.. కానీ ప్రభుత్వం వాటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను రిలీజ్ చేయాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. రూ. 1200కోట్లకు పైగా పెండింగ్ నిధులున్నాయని అసోసియేషన్ నేతలు చెబుతున్నారు.

## హన్మకొండలో లలిత జ్యుయెలరీ మార్ట్ ప్రారంభం

**హనుమకొండ బ్యూరో. ప్రభాతవార్త, జనవరి 19:** ప్రముఖ నగల రుద్రవరం సంస్థ లలిత జ్యువెలరీ హన్మకొండ నగరంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభం అయింది .షో రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ కడియం కావ్య మేయర్ గుండ సుధారాణి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయన రాజేందర్ రెడ్డి, లలిత జ్యువెలరీ చైర్మన్ కిరణ్ కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మేయర్ గుండ సుధారాణి ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడారు. ప్రముఖ నగల షోరూం హనుమకొండ నగరంలో ప్రారంభం రావడం సంతోషదాయకం శుభసూచకం అన్నారు ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు. మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో నగల ధరలు ఉండడం మంచి పరిణామం అన్నారు. సందర్భంగా షోరూంలోని నగలను వస్త్రాభరణాలను పరిశీలించి చైర్మన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. లలిత జ్యువెలరీ చైర్మన్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ 40 సంవత్సరాల పైగా సేవలందిస్తూ దక్షిణ భారతదేశంలో అగ్రగామియా గుర్తింపు తెచ్చుకున్న లలిత జ్యువెలరీ ఇప్పుడు హనుమకొండలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో విశేష ఆదరణను పొంది వంది ఇప్పుడు హనుమకొండ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు సర్వం సిద్ధమైందన్నారు. అన్ని ప్రాంతాల వారికి తక్కువ తరుగు తక్కువ ధరలో నగలు ఇవ్వాలని ఉద్దేశంతో వినియోగదారుల ఆశీస్సులతో ఈ షోరూం ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని నగల దుకాణాలలో ధరలు చెక్ చేసుకుని మా షోరూంలో ధరలను సరిచూసుకోండి డబ్బులు ఊరికే రావని ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచించారు. మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని మా షో రూమ్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు ఈ ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు నగపై తరుగులో రెండు శాతం తగ్గింపు అదేవిధంగా క్యారెట్ కు 6000 తగ్గింపు ఉన్నట్లు తెలిపారు లలిత జ్యువెలరీ షోరూంలో మార్కెట్ కంటే తక్కువ తరుగులో బంగారు నగలను అందజేస్తామన్నారు ఇలాంటి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని డబ్బును ఆదా చేయాలని చైర్మన్ కిరణ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, జ్యువెలరు ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దావోస్ సమావేశంలో ప్రాధాన్య దేశంగా భారత్

### వెళ్లిన ముగ్గురు సిఎంలు, ఐదుగురు కేంద్రమంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి19:** దావోస్‌లో సోమవారం నుంచి ప్రారంభం కానున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్(డబ్ల్యుఈఎఫ్) 55వ వార్షిక సమావేశంలో భారత్ అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశంగా ఉండనుంది. ఈ సదస్సుకు ఐదుగురు కేంద్ర మంత్రులు, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దాదాపు 100 మంది సీఈవోలు,ప్రభుత్వ,పౌర సమాజం ప్రతినిధులతో కూడిన అతిపెద్ద బృందాన్ని కేంద్ర ప్రభుత్వం దావోస్ సమావేశానికి పంపుతోంది. ఆర్థిక శక్తిగా, ప్రపంచాన్ని ప్రభావితం చేసే స్థాయిలో ఎదుగుతున్న మన దేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని భారత ప్రతినిధులు ప్రతిబింబించనున్నారు. భారత ప్రతినిధుల బృందానికి కేంద్ర మంత్రి ఆశ్విని వైష్ణవ్ నాయకత్వం వహిస్తున్నారు. దావోస్‌లో జరిగే డబ్ల్యుఈఎఫ్‌లో మనదేశ ఆలోచనా విధానం,ప్రధాని నరేంద్ర మోడీ ఆర్థిక విధానం, డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద భారత్ కొత్త డిజిటల్ ఆర్కిటెక్చర్‌ను రూపొందించిన విధానాన్ని అర్థం చేసుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారని అశ్విని వైష్ణవ్ చెప్పారు. ఈ సదస్సుకు అశ్విని వైష్ణవ్‌తో పాటు ఇతర మంత్రులు సిఆర్ పాటిల్, చిరాగ్ పాశ్వాన్, కె.రామ్మోహన్‌నాయుడు సహా మహారాష్ట్ర(ఫడ్నవీస్),ఆంధ్రప్రదేశ్(నారా చంద్రబాబునాయుడు), తెలంగాణ(రేవంత్‌రెడ్డి) ముఖ్యమంత్రులు బయలుదేరి వెళ్లారు. యూరప్‌లోని ఎత్తైన పట్టణమైన దావోస్‌లో జరిగే ఈ సదస్సుకు రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్, జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్, ఉక్రెయిన్ ప్రెసిడెంట్ వోలోదిమిర్ జెలెన్‌స్కీ ఈ సమావేశంలో ప్రసంగించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 60 మంది అగ్ర రాజకీయ నాయులు పాల్గొనే ఈ సమావేశం కోసం 5000 మంది స్విస్ ఆర్మీ సిబ్బందిని మోహరించారు. మొత్తంగా 130 దేశాల నుంచి 3000 ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. 220 సెషన్స్ ఉండనున్నాయి.

# ట్రంప్ ప్రమాణ వేడుకకు భారీ ఏర్పాట్లు

### దాదాపు 100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై కొత్త అధ్యక్షుడి సంతకాలు
### వేదిక మార్చి కేపిటల్ రొటుండా హాలులో ప్రమాణస్వీకారం
### 25వేల మంది భద్రతాసిబ్బంది అనునిత్యం పహారా

**వాషింగ్టన్ డీసీ, జనవరి 19:** అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా ఎన్నికైన రిపబ్లికన్‌నేత డొనాల్డ్‌ట్రంప్ 47వ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త అధ్యక్షుడి పదవీకాలం సోమవారం నుంచే ప్రారంభం అవుతున్నందున కొత్త అధ్యక్షుడు విధిగా అదేరోజు చేస్తారు. ఒకవేళ ఆదివారం వస్తే మరుసటిరోజుసోమవారం ప్రమాణం చేస్తారు. ఈసారి కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జాన్ రాబర్ట్ డొనాల్డ్‌ట్రంప్ చేత ప్రమాణం చేయిస్తారు. అనంతరం తన ప్రారంభోపన్యాసంచేస్తారు. తదుపరి నాలుగు సంవత్సరాలకు తాను చేపటే ప్రణాళికలు తన పాలనా విధానంలో తెచ్చే సంస్కరణలు వంటివాటిపై కీలకంగా మాట్లాడతారు. ఇదే కార్యక్రమంలో ఉపాధ్యక్షుడుగా జెడివాన్స్ కూడా ప్రమాణం చేస్తారు. ఆ తర్వాత అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సతీసమేతంగా సెనెట్ నాయకులు, ప్రముఖ అతిథులు అమెరికా కానయపిటల్ హిల్‌లోని స్టాట్యూటరీ హాలుకు భారీ భద్రతమధ్య తోడ్కొని వెళతారు. ఇక్కడే జాయింట్ కాంగ్రెషనల్‌కమిటీ ప్రారంభ వేడుకలు జరుగుతాయి. ఆతర్వాత శ్వేతసౌధంలోకి వెళ్లే ట్రంప్ సాంప్రదాయంగా కొన్ని కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలుచేస్తారు. ఆయన ఎన్నికల్లో హామీలు ఇచ్చినవిధంగా దిగుమతులపై సుంకాలు, సామూహిక అక్రమ వీసాదారుల అప్పగింత లేదా వెనక్కిపంపించడం వంటి ఉత్తర్వులపై సంతకాలుచేస్తారు. తన మొదటిసారి పదవీకాలంలో ఉన్న కొన్ని ఉత్తర్వులను మళ్లీ అమలుకు తెచ్చే ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపైనా సంతకాలుచేస్తారు. జోబైడెన్ తన హయాంలో వాటిని రద్దుచేయడంతోట్రంప్ ఇపుడు మళ్లీ వాటిని పునరుద్ధరిస్తున్నారు. సోమవారం సాయంత్రం ట్రంప్ ఓవల్ ఆఫీసులో ప్రారంభ కార్యక్రమాల్లో అంటే సైనిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కమాండర్ ఇన్‌ఛీఫ్ బాల్, లిబర్టీ వాల్, స్ట్రెయిట్‌బాల్ వంట మూడింటిలోనూ పాల్గొంటారు. ఇక్కడే డజనుకుపైగా అధికారిక కార్యక్రమాలను ఏర్పాటుచేసారు. ఉదయం 11 గంటలకు వాషింగ్టన్ కేషనల్ కేథడ్రల్‌చర్చిలో ట్రంప్ ప్రార్థనలు చేస్తారు. వాస్తవానికిక్యాపిటల్‌హిల్‌భవనం ఆవరణలోనే ప్రమాణం చేయాల్సి ఉండగా అత్యంత చలివాతావరణం కావడంవల్ల క్యాపిటల్ భవనలోని రోటుండా హాలులో చేస్తారు. ఇప్పటివరకూ 2.20 లక్షల టికెట్లను విక్రయించారు. అయితే రోటుండా హాలుమాత్రం కేవలం 600 మందికే సామర్థ్యం ఉంటుంది. వాషింగ్టన్‌నుంచి క్యాపిటల్‌వన్ స్పోర్ట్స్ ఎరెనానుంచి ప్రత్యక్షప్రసారం ద్వారా ట్రంప్ మద్దతుదారులు 20వేలమంది అక్కడే వీక్షిస్తారు.

ఇక దేశ అధ్యడిగా ప్రారంభ పేరేడ్ లోపల జరుగుతోంది. 1985 తర్వాత ఇలా జరగడం ఇదే మొదటిసారి. 1805నుంచి కూడా ఈపెరేడ్ అద్యక్ష స్వాగత ర్యాలీగా పెన్సిల్వేనియా అవెన్యూనుంచి నిర్వహించేవారు. ఈసారి మాత్రం క్యాపిటల్ వన్ ఎరెనాలో జరుగుతోంది.

కాగా ట్రంప్‌ప్రమాణస్వీకారానికి ఆయన సన్నిహిత మిత్రులు పారిశ్రామిక టెక్ దిగ్గజాలు ఫేస్‌బుక్ సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్,గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్, టిక్‌టాక్ సిఇఒ షౌజి చ్యూ, అమెజాన్ సిఇఒ జెఫ్ బెజోస్, యాపిల్‌స ఇఇఒ టిమ్‌కుక్, ఓపెన్ ఎఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మాన్‌లతోపాటు భారత పారిశ్రామిక దిగ్గజం ముకేష్ అంబాని దంపతులు కూడా హాజరయ్యారు. కాగా ట్రంప్‌ప్రమాణస్వీకారం సందర్భంగా వాషింగ్టన్‌లో కనీవినీ ఎరుగని స్థాయిలోభద్రతా ఏర్పాట్లుచేసారు. 30 మైళ్ల పరిధిలో తాత్కాలిక కంచె ఏర్పాటుచేసారు. 25వేల మంది భద్రతా సిబ్బందిని మొహరించారు. అమెరికా సీక్రెట్‌సర్వీస్ ఏజెంట్లుకూడా విధుల్లో నిమగ్నం అయ్యారు.



**100 ఆర్డర్లపై సంతకాలా?**

అయితేప్రమాణ స్వీకారంచేసిన రోజునే సంతకాలు చేస్తానని ట్రంప్ కొన్నింటిపై ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్రమ వలసలు కట్టడి, బర్త్‌రైట్‌పౌరసత్వం రద్దుచేస్తామని ప్రకటించారు. మెక్సికో కెనడాల దిగుమతులపై సుంకాలు వేస్తానన్నారు. ఇవన్నీ తొలిరోజునుంచే ప్రారంభం అవుతాయన్నారు. అయితే ఎన్ని ఆర్డర్లపై సంతకాలుచేస్తారన్న మీడియా ప్రశ్నలపై స్పందిస్తూ 100 ఆర్డర్లను దాటుతాయా అన్న ప్రశ్నపై ఆ ఉండవచ్చని ట్రంప్ బదులిచ్చారు. జోబైడెన్ హయాంలో తెచ్చిన విధానాలు రద్దుచేస్తూ ట్రంప్ ఉత్తర్వులపై సంతకంచేస్తారని, అలాగే సహేతుకమైన పత్రాలులేని వలసదారుల బహిష్కరణ ప్రారంభం అవుతుందని కూడా ట్రంప్ వెల్లడించారు.



## మహాకుంభ్‌లో అగ్నిప్రమాదం

**ప్రయాగరాజ్, జనవరి 19:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లోజరుగుతున్న మహాకుంభమేళాలో భారీ అగ్నిప్రమాదంజరిగింది అక్కడ ఏర్పాటుచేసిన గుడారాల వసతుల్లో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల ప్రమాదం జరిగింది. రెండు టెంట్లలో లేచిన మంటలు ఇతర గుడారాలకు వ్యాపించడంతో అక్కడే భద్రతకోసం ఏర్పాటుచేసిన అగ్నిమాపక వాహనాలు వెంటనే రంగంలోకి దిగి మంటలను అదుపుచేసారు. మహాకుంభ్‌స్థలిలోని సెక్టార్19 ప్రాంతంలో నివాసితులకోసం టెంట్లతో వసతులు ఏర్పాటుచేసారు. అక్కడ ఉన్న రెండు టెంట్లలో సిలిండర్లకారణంగా భారీ మంటలు ఎగిసిపడినట్లు అఖారాపోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి భాస్కర్‌మిశ్రా అన్నారు. అయితే ఎవ్వరికీ గాయాలు కావడం కానీ, ప్రాణహాని కాని జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈఘటనపై మహాకుంభ్‌మేళా నిర్వాహకులు విచారం వ్యక్తంచేసారు. అగ్నిప్రమాద ఘటన ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎక్స్‌వేదికగా పోస్టుపెట్టారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టి పూర్తిచేసారని, అందరూ సురక్షితంగా ఉండాలని గంగామాతను ప్రార్థిస్తున్నట్లు పోస్టులో వివరించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇద్దరుసీనియర్ అధికారులను ఆప్రాంతానికి పంపించి పరిస్థితిని సమీక్షించి ఏర్పాట్లు సత్వరమే చేయాలని కోరారు. అంతేకాకుండా సంఘటన జరిగిన ప్రాంతానికి హుటాహుటిన వెళ్లిపరిస్థితిని సమీక్షించి ఈప్రాంతం యధావిధిగా పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసారు.

## మైనార్టీ గురుకులాల ప్రవేశానికి నోటిఫికేషన్

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఐదో తరగతి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇతర కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలతోపాటు 6,7,8 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ మేరకు మైనార్టీ గురుకుల సొసైటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 28వ తేదీలోగా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మైనార్టీ అభ్యర్థులకు ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసిస్‌పై, ఇతర వర్గాలకు లక్కీ డ్రా పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. సీవోఈల్లో ప్రవేశాలకు మాత్రం స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తామని సొసైటీ పేర్కొన్నది.

## గంగానదిలో పడవ బోల్తా

### ముగ్గురు మృతి, నలుగురు గల్లంతు

**కతిహార్(బీహార్), జనవరి 19:** రాష్ట్రంలోని కతిహార్‌జిల్లాలోని గంగానదిలో ఒక పడవ మునిగిపోవడంతో ముగ్గురుచనిపోగా మరో నలుగురు గల్లంతయ్యారు. మొత్తం 17 మందితో ఈ పడవ గంగనాదిలో వెళుతోంది. ఆందాబాద్‌ప్రాంతంలోని గోలాఘాట్‌వద్ద ఈ పడవ హటాత్తుగా మునిగిపోయింది. ఈప్రమాదంనుంచి పదిమందిని ఇప్పటివరకూ రక్షించామని కొందరు ఈతకొట్టుకుంటూ ఒడ్డుకు చేరారన్నారు. ఇప్పటికీ సహాయక చర్యలు కొనసాగుతునాన్నాయి. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు విచారణకు ఆదేశించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ మనేష్‌కుమార్‌మీనా చెప్పారు. మృతుల్లో ఇద్దరు 60 ఏళ్లపవన్‌కుమార్, 70 ఏళ్లసుధీర్ మండల్ అని తేలింది. మిగిలినవారిని కూడా గుర్తించాల్సి ఉందని జిల్లామేజిస్ట్రేట్ చెప్పారు.

## రాష్ట్రంలో పెరుగుతున్న బాల్య వివాహాలు

### జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ వెల్లడి

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నా సామాజిక దురాచారానికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. ఫలితంగా వివాహ వయసు 18 ఏళ్లు రాకముందే పెళ్లి చేసుకుంటున్న అమ్మాయిల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. తెలంగాణ వ్యాప్తంగా గత ఏడాది దాదాపు వెయ్యికి పైగా బాల్య వివాహాల్ని అధికారులు అడ్డుకున్నారు. రోజుకు మూడు చొప్పున కేసులు నమోదయ్యాయి. అది కూడా బాల్యవివాహాల నిరోధక చట్టం, చైల్డ్ లైఫ్ అవగాహనతో ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే ఈ కేసులు వెలుగులోకి రావడం గమనార్హం. హైదరాబాద్ చుట్టూ పక్కన ఉన్న జిల్లాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుండటం విశేషం. అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న రాజధానికి సమీపంలోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో బాల్య వివాహాలు జరగడంతో అవి సామాజిక వెనకబాటులో ఉన్నాయి. రాష్టంలో వెనుకబడిన వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా బాల్యవివాహాల కేసులు నమోదవుతున్నాయి. ఉమ్మడి మహబూబ్ నగర్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలో ఈ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. కొత్త జిల్లాల వారిగా చూస్తే అత్యంత తక్కువ కేసులు ములుగు, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలో నమోదయ్యాయి. చిన్న వయసులోనే గర్భం దాల్చడంతో నెలలు నిండకముందే శిశువులు జన్మించడం, అనారోగ్య సమస్యల బారిన పడుతున్నట్లు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్ సీపీసీఆర్) తన నివేదికలో పేర్కొంది. ఇటీవల రాష్ట్రంలో 7717 పాఠశాలల్లో బాలికల హాజరు పరిశీలన చేయగా ఆయా పాఠశాలల్లో చదువుతున్న 9 వేల మందికి పైగా బాలికలు ప్రమాదంలో ఉన్నారని హెచ్చరించింది. తెలంగాణ చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్ స్టేటస్ 2024 జనవరి నుంచి నవంబర్ వరకు సేకరించిన వివరాల ప్రకారం 33 జిల్లాల నుంచి 990 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. అందులో అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 4, వికారాబాద్ లో 94 ఉన్నాయి. పాఠశాలల్లో విద్యార్థినిలు ముందస్తు అనుమతి లేకుండా 30 రోజులకు పైగా హాజరు శాతం లేకపోతే అప్రమత్తం కావాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది.

## వరంగల్, ఆదిలాబాద్‌లో పత్తి పరిశోధన కేంద్రాలు

### భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆమోదం

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణలో పత్తి పంటకు సంబంధించి రెండు అఖిల భారత సమన్వయ పత్తి పరిశోధన కేంద్రాల (ఎఐసిఆర్పి)కు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపింది. ఈ కేంద్రాలను మంజూరు చేస్తు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతికి అధికారికంగా లేఖ రాసింది. రాష్ట్ర విభజన అనంతరం భారత వ్యవసాయ పరిశోధన మండలి పరిధిలో పత్తి పరిశోధన చేసే సమన్వయ కేంద్రాలు తెలంగాణ రాష్ట్రం పూర్తిగా కోల్పోయింది. ఫలితంగా గత పది ఏళ్లలో జాతీయస్థాయిలో పత్తి పరిశోధన వ్యవస్థలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం భాగస్వామి కాలేకపోయింది. ఈ నేపథ్యంలో ఉప కులపతి ఇటీవల ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి. పి శర్మలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పత్తి పంట సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, దాని ప్రాధాన్యతను గూర్చి వివరించారు.

తదనుగుణంగా వరంగల్లో ఒక ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్ జిల్లాలో మరో ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దాంతోపాటు ఆయా కేంద్రాలకు ఐసిఎఆర్ సిబ్బందిని, నిధులను కేటాయించి వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పత్తి పంటలపై పరిశోధనలను పునః ప్రారంభించి రైతులకు రాగల రోజులలో సాంకేతిక మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విజ్ఞప్తికి భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సానుకూలంగా స్పందించారు. ఫలితంగా తెలంగాణలో పత్తి పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు అధికారికంగా సమాచారం పంపించారు.

## శుభలేఖలు ఇచ్చేందుకు వెళ్లి కారులో మంటలకు ఆహుతి!

**న్యూఢిల్లీ, జనవరి 19:** కొద్దిరోజుల్లోనే పెళ్లిపీటలు ఎక్కాల్సిన వరుడు విద్యుత్ షార్ట్‌సర్క్యూట కారణంగా కారులో లేచిన మంటల్లోనే సజీవదహనం అయిపోయాడు. దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగిన ఈఘోరంపై అందరూ కన్నీటిపర్యంతం అయ్యారు. వచ్చేనెల 14వ తేదీ జరిగే ఆతడి వివాహంకోసం అందరికి శుభలేఖలు ఇచ్చేందుకు తానేస్వయంగా వరుడు బయలుదేరాడు. గ్రేటర్‌నోయిడాలోని నవాడాకు చెందిన అనిల్ తన బంధుమిత్రులందరికీ తానేస్వయంగా ఇవ్వాలన్న లక్ష్యంతో బయలుదేరాడు. ఈక్రమంలో ఘాజీపూర్‌బాబా బోకేహాల్‌సమీపంలో ఆతడుప్రయాణిస్తున్న కారు అగ్నికి ఆహుతి అయింది. ఈప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆ క్రమంలో దాదాపుగా అగ్నికి ఆహుతి అయిన ఆతడిని మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఆహ్వానపత్రాలు తీసు కెళ్లిన అనిల్‌కు కుటుంబసభ్యులు ఆతడి సెల్‌కు అనేకసార్లు ఫోన్‌చేసారు కానీ స్పందన లేకపోవడంతో కంగారు పడ్డారు. రాత్రి 11.30 గంటల సమయంలో పోలీసులు అనిల్‌కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి జరిగిన సంఘటన వివరించారు. దీనితో వారంతా కన్నీరుమున్నీరవుతూ ఆసుపత్రికి చేరుకున్నారు. అనిల్‌బామరిది యోగేష్ మాట్లాడుతూ తన సోదరితో అనిల్‌కు పెళ్లి నిశ్చయం అయిందని,



ఫిబ్రవరి 14న వారి వివాహాన్ని పెద్దలు నిశ్చయించారని తెలిపారు. కారులో అగ్నిప్రమాదం ఎలా జరిగిందనేది తను ఇప్పటికీ అంతుబట్టని విషయంగా ఉందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగిసానతమని, కేసునమోదుచేసి దర్యాప్తును ప్రారంభించినట్లు తెలిపారు.

## పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం

### రూ.15వేలు మద్దతు ధర ప్రకటించాలి: కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 19:** పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే ఏర్పాటు ప్రకటించిన విధానంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని మండిపడ్డారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆహ్వానించకుండా, ప్రొటోకాల్ పాటించకుండా కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పసుపుబోర్డు ఏర్పాటుపై మీడియాతో మాట్లాడారు. 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు పసుపు బోర్డు గురించి లేఖ రాసినట్లు గుర్తుచేశారు. ప్రధాని మోదీని రెండు సార్లు కలిశానని చెప్పారు. పసుపు బోర్డుకు ప్రయత్నం చేస్తేనే పసుపు ఆధారంగా రావాల్సిన పరిశ్రమల కోసం కృషి చేశానన్నారు. పసుపుకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశానని తెలిపారు. ఐదేండ్లు ఎంపీగా త్రిముఖ వ్యూహంతో అలు పెరగని పోరాటం చేశానని పేర్కొన్నారు. కేవలం బోర్డు రావడం మాత్రమే సరిపోదని, మద్దతు ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల నుంచి నాణ్యతలేని పసుపు దిగుమతి అవుతుందని, దాంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. పసుపు దిగుమతులను నియంత్రించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నానని వెల్లడించారు. 2014లో 8 లక్షల క్వింటాళ్లు దిగుమతవుతే.. ఇప్పుడది రెట్టింపయ్యింది చెప్పారు. ఏటేటా దిగుమతులు పెరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించు కోవడం లేదని విమర్శించారు. కేవలం రాజకీయం కోసం పసుపు బోర్డు కాకపోతే.. వెంటనే దిగుమతులపై నియంత్రణ విధించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే: మాజీ ఎంపి బి.వినోద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ తెలిపారు. కేసీఆర్ లేని తెలంగాణను ప్రజలు ఊహించు కోలేకపోతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని.. కేంద్రం ప్రభుత్వంలోని వివిధ సంస్థలు లెక్కలతో సహా మన అభివృద్ధిని అభినందిస్తూ అవార్డులు అందించాయని గుర్తుచేశారు. కానీ తెలంగాణలో ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని అన్నారు. తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే నూతన కార్యవర్గ మొదటి సమావేశాన్ని ఆదివారం జూమ్ కాల్‌లో నిర్వహించారు. ఎన్ఆర్ఐ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వినోద్‌కుమార్, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసిన సమయంలో అలాగే తెలంగాణ ఉద్యమానికి ఎల్లప్పుడూ ఎన్ఆర్ఐలు వెన్నుదన్నుగా నిలబడ్డారని గుర్తుచేశారు. ముఖ్యంగా ఎన్ఆర్ఐ యూకే తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. అందుకే వాళ్లు అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని పేర్కొన్నారు. మళ్లీ తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. అప్పటి వరకు ప్రజా సమస్యలను తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు.

## కేజ్రీవాల్ మొన్నటి దాకా నీతిమంతుడు.. ఇప్పుడు అవినీతిపరుడా?

### కాంగ్రెస్ పార్టీకి ద్వంద్వ ప్రమాణాలు

### వెన్నతో పెట్టిన విద్య: మాజీమంత్రి కెటిఆర్ ట్వీట్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు ఢిల్లీలో ఆ పార్టీ అనుసరిస్తున్న వైఖరే సజీవ సాక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అవసరం ఉన్నప్పుడు ఒకలా, అవసరం తీరిపోయాక మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆదివారం ట్విట్టర్ వేదికగా విమర్శించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ పట్ల ప్రదర్శిస్తున్న వైఖరికి, పార్లమెంటు ఎన్నికల సమయంలో ఇండియా కూటమిలో ఉన్న అదే కేజ్రీవాల్ పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిని పరిశీలిస్తే అది తెలుస్తుందని తెలిపారు. నిన్నటిదాకా సత్యసంధుడు, వివేకవంతుడు, నీతిమంతుడిగా కనిపించిన కేజ్రీవాల్‌లో ఉన్నపళంగా నేడు అవినీతిపరుడిగా, చెత్తనాయకుడిగా కనిపిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రాజకీయాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటించే విషయంలో కాంగ్రెస్ పార్టీ ఒక పాఠ్యపుస్తకమని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలు అమలు కోసం ఏడాది కాలంగా తెలంగాణలోని విద్యార్థులు, రైతులు, వృద్ధులు, మహిళలు ఏడాదికాలంగా నిరీక్షిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఢిల్లీలో కూడా కాంగ్రెస్ పార్టీ అవే తరహాలో హామీలను ప్రజలకు ఇస్తుందని మండిపడ్డారు. ఢిల్లీ ఓటర్లను మోసం చేయడానికి ముందు తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడి, వారి అనుభవాలను తెలుసుకోవాలని సూచించారు.

## చివరి క్వార్టర్‌లో రూ.45 వేల కోట్లు

### రైతు భరోసా, ఆత్మీయ భరోసాకు రూ.8,800 కోట్లు

### ఇందిరమ్మ ఇళ్లకు రూ.20 వేల కోట్లు

### రేషన్ కార్డులు, సన్న బియ్యానికి సబ్సిడీ

### నిధుల అన్వేషణలో ఆర్థిక శాఖ

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పథకాలకు అవసరమయ్యే నిధులను అన్వేషించే పనిలో ఆర్థిక శాఖ పడింది. ఈ నెల 26వ తేదీన తలపెట్టిన రైతు భరోసా, వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సాయం ఆత్మీయ భరోసాతో పాటు, వివిధ పథకాల అమలు నిమిత్తం ఈ చివరి క్వార్టర్‌లో మొత్తం 45 వేల కోట్ల రూపాయల మేర అవసరం ఉంటుందని అంచనా వేసింది. ఈ నెల 26వ తేదీన రాష్ట్ర ప్రభు ప్ర త్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించబోతోంది. రైతు భరోసా కింద రాష్ట్రం లోని సుమారు 70 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.8,200 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ఇక భూమి లేని పేదలకు ఆత్మీయ భరోసా కింద తొలి విడత సాయంగా రూ.6 వేల చొప్పున ఇచ్చేందుకు మరో రూ.600 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఈ పథకం కింద 10 లక్షల మంది రైతు కూలీలు లబ్ధిపొందుతారని అంచనా. ఈ రెండు పథకాలకు ఈనెల 31లోపు నిధులు వెచ్చించాల్సి ఉంది. వీటితో పాటు, అదే రోజు నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఆ కార్డుల జారీ పూర్తయ్యాక మార్చి నెల నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పథకాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 90 లక్షల వరకు రేషన్ కార్డులు ఉండగా, మరో 10లక్షల వరకు కొత్తవి జారీచేసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మొత్తమ్మీద కోటి కార్డులకు గాను ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున సన్నబియ్యం ఇచ్చేందుకు గణనీయంగా నిధులు కావాల్సి ఉంటుందని అంచనా. మరోవైపు గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న రూ.10 లక్షల లోపు బిల్లులను చెల్లించాలని యోచిస్తోంది. ఇవి సుమారు రూ.800 కోట్ల వరకు ఉంటాయని అంచనా. ఇక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం (తొలి విడతలో స్థలమున్న పేదలకు రూ.5 లక్షల సాయం) కోసం ఒక్క ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కోట్లకుపైగా అవసరమని భావిస్తున్నారు. మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్‌లో రూ.45 వేల కోట్లు కావాలని ఆర్థిక శాఖ అధికారులు లెక్కలు కట్టారు. అయితే ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వేల కోట్ల రూపాయలను సేకరించడమే అసలు సమస్యగా తయారయింది. ఈ నెలలో ప్రారంభించే పథకాల అమలు కోసం తక్షణమే అవసరమైన నిధులకు తోడు, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు, జీతాలు, పింఛన్లకు తోడు కొత్త పథకా లకు కలిపి నిధుల సమీకరణ ఎలా, రిజర్వు బ్యాంకు ద్వారా బహిరంగ మార్కెట్లో రుణాలు ఏ మేరకు సాధ్యమవుతాయనే లెక్కలు వేసుకుంటోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలతో పాటు, దశల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కొత్త రేషన్ కార్డుల జారీతో పెరిగే సబ్సిడీ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి నెలా వస్తున్న రాబడులకు తోడు గణనీయంగానే అప్పులు చేయక తప్పడం లేదు. ప్రస్తుతం నెలకు రూ.11 వేల కోట్ల వరకు రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతోంది. ఈ జనవరి నుండి మార్చి నెలల్లో అదనంగా నెలకు మరో రూ.2 వేల కోట్ల వరకు వస్తాయని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. మరోవైపు రూ.30 వేల కోట్లు బహిరంగ మార్కెట్ రుణాలను రిజర్వు బ్యాంకు ద్వారా సేకరించడం ప్రారంభించింది. ఈ మేరకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి నెలా రూ.10 వేల కోట్ల చొప్పున కావాలని రిజర్వ్ బ్యాంక్‌కు ఇప్పటికే ఆర్థిక శాఖ ఇండెంట్ కూడా పెట్టింది. మొత్తంగా సమకూరే నిధుల నుంచి రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు సాయం, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, సామాజిక పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు, రెవెన్యూ ఖర్చుతో పాటు, రుణ వాయిదాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఖర్చులన్నింటినీ సర్దుబాటు చేసుకుంటూనే కొత్త పథకాలకు నిధులను సమకూర్చడంపై దృష్టి పెట్టింది. మరోపక్క ఇప్పటికే గత రెండు నెలలుగా పెద్ద పెద్ద బిల్లుల చెల్లింపును నిలిపివేసినట్టు తెలిసింది. ఈ మూడు నెలలు కూడా ఇదేపద్ధతిని అవలంబిస్తామని, ప్రస్తుతానికి నిధుల లోటు లేకుండా సర్దుబాటు చేస్తామని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# 'మ్యాడ్ స్క్వేర్' మార్చి 29న విడుదల



**బ్లాక్ బస్టర్** చిత్రం మ్యాడ్ కి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' ప్రకటించినప్పటి నుండి, సినీ ప్రియులంతా చిత్ర విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టీజర్ విడుదల కాకముందే, ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇప్పటికే విడుదలైన లడ్డు గానీ పెళ్లి, స్వాతి రెడ్డి పాటలు చార్ట్‌బస్టర్‌లుగా మారడంతో పాటు అన్ని చోట్ల ప్లేలిస్ట్‌లలో అగ్రస్థానంలో నిలిచాయి. 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాన్ని 2025 మార్చి 29న ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు తాజాగా నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఒక సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.
ఈ పోస్టర్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. అలాగే "మీరు హ్యాండిల్ చేయగలిగిన దానికంటే ఎక్కువ వినోదం, మీరు ఊహించిన దానికంటే ఎక్కువ మ్యాడ్ నెస్. అని నిర్మాతలు పేర్కొన్నారు. మొత్తానికి మ్యాడ్ స్క్వేర్ చిత్రంతో థియేటర్లలో వినోద అనుభవాన్ని మరో స్థాయికి తీసుకువెళ్ళబోతున్నారు నిర్మాతలు.
మ్యాడ్ సినిమాలో తనదైన ప్రత్యేక శైలి హాస్య సన్నివేశాలు, ఆకర్షణీయమైన కథనంతో ఎంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు కళ్యాణ్‌శంకర్, ఈ సీక్వెల్‌తో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ ఛాయగ్రాహకుడు శామ్‌దత్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.
'మ్యాడ్ స్క్వేర్' చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు.
2023లో విడుదలైన మ్యాడ్ మొదటి భాగం సంచలన విజయం సాధించడంతో, కేవలం ప్రకటనతోనే మ్యాడ్ స్క్వేర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సరికొత్త హాస్య చిత్రం ముగ్గురు కాలేజీ స్నేహితుల జీవితాలు, వారి పరిస్థితుల చుట్టూ తిరుగుతుంది. ఈ సీక్వెల్ మొదటి భాగాన్ని మించి రెట్టింపు వినోదాన్ని అందించేందుకు సిద్ధం అవుతోంది.
తారాగణం: సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్
దర్శకత్వం: కళ్యాణ్ శంకర్ , సమర్పణ: సూర్యదేవర నాగ వంశీ,
నిర్మాతలు: హారిక సూర్యదేవర, సాయి సౌజన్య,
సంగీతం: భీమ్స్ సిసిరోలియో,
ఛాయాగ్రహణం: శామ్‌దత్ ఐఎస్ఇ
కూర్పు: నవీన్ నూలి,
ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల,
అదనపు స్క్రీన్ ప్లే: ప్రణయ్ రావు, తక్కళ్లపల్లి
, కళ: పెనుమర్తి ప్రసాద్, ఎమ్.ఎఫ్.ఎ
ఫైట్ మాస్టర్: కరుణాకర్,
పీఆర్ఓ: లక్ష్మీ వేణుగోపాల్.

# 'దిల్ రూబా'నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్



**యంగ్ టాలెంటెడ్ హీరో** కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'దిల్ రూబా' చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. "దిల్ రూబా" సినిమా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు "దిల్ రూబా" సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'అగ్గిపుల్లె..' రిలీజ్ చేశారు మేకర్స్. 'అగ్గిపుల్లె..' లిరికల్ సాంగ్ ఎలా ఉందో చూస్తే ... 'అగ్గిపుల్లె' అలా గీసినట్టు, కోపంగా చూడకే కొట్టినట్టు, గాలి దుమారమే రేగినట్టు, ఆవేశమెందుకే నొక్కిపెట్టు...' అంటూ బ్యూటిఫుల్ మెలోడీతో సాగుతుంది పాట. కిరణ్ అబ్బవరం, సామ్ సీఎస్ కాంబినేషన్‌లో వచ్చిన "క" మూవీ సాంగ్స్ ఛాట్ బస్టర్స్ అయ్యాయి. ఈ నేపథ్యంలో "దిల్ రూబా ఆడియో మీద హై ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి.

# మార్చి 28న 'రాబిన్‌హుడ్' వరల్డ్‌వైడ్ రిలీజ్



**హీరో నితిన్** హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్ టైనర్ 'రాబిన్‌హుడ్'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు, గతంలో తనతో బ్లాక్‌బస్టర్ భీష్మ చిత్రాన్ని తీసిన వెంకీ కుడుముల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల నితిన్ సరసన నటిస్తోంది. మేకర్స్ ఈ చిత్రం విడుదల తేదీని అనౌన్స్ చేశారు. రాబిన్‌హుడ్' మార్చి 28న థియేటర్లలోకి రానుంది, సమ్మర్ రిలీజ్ లో ఇది బిగ్గెస్ట్ ఎట్రాక్షన్. రిలీజ్ డేట్ పోస్టర్‌లో నితిన్ స్లీక్ స్పెషల్ ఏజెంట్ అవతార్‌లో డైన మిక్‌గా కనిపించారు. సినిమా ప్రమో షన్స్ త్వరలో కిక్ స్టార్ట్ కానున్నాయి. కేతికా శర్మ నటించిన సెకండ్ సింగిల్ కొన్ని రోజుల్లో విడుదల కానుంది, ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందించారు. ఫస్ట్ సింగిల్,గ్లింప్స్, మిగతా ప్రమోష నల్ కంటెంట్ కి అద్భుతమైన స్పందన వచ్చింది.



న్యూ లుక్ మలైకా అరోరా

# 'మా కాళి'కి బెస్ట్ పొలిటికల్ మూవీ అవార్డు



**నేషనల్ అవార్డ్ విన్నింగ్** సూపర్‌హిట్ చిత్రం కార్తికేయ 2 నిర్మాత, ప్రఖ్యాత నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ త్రిభాషా చిత్రం 'మా కాళి' ప్రతిష్టాత్మక జైపూర్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో బెస్ట్ పోలిటికల్ మూవీ అవార్డును గెలుచుకుంది. టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రాన్ని విజయ్ యెలకంటి దర్శకత్వం వహిస్తున్నారు. రైమా సేన్, అభిషేక్ సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. జనవరి 17, మా కాళి దర్శకుడు విజయ్ యెలకంటి నటి రైమా సేన్‌తో కలిసి జైపూర్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరయ్యారు. బెస్ట్ పోలిటికల్ మూవీ అవార్డును అందుకున్నారు. రైమా సేన్ మాట్లాడుతూ, "మా కాళికి ప్రేక్షకులను ఆకట్టుకుంటుదని నాకు తెలుసు. ఈ గుర్తింపు మాకు ముఖ్యమైన, సానుకూల మార్పును ప్రేరేపించే కథలని చెప్పే శక్తినిస్తుంది. ఇది మహిళా ప్రధాన చిత్రం కాబట్టి, జెఐఎఫ్ఎఫ్ నుండి ఈ గుర్తింపు పొందడం మరింత సంతృప్తికరంగా ఉంది." అన్నారు. దర్శకుడు విజయ్ యెలకంటి మాట్లాడుతూ"మా కాళికి బెస్ట్ పోలిటికల్ మూవీ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది,జెఐఎఫ్ఎఫ్ ద్వారా ఈ గుర్తింపు గొప్ప ఉత్సాహాన్ని ఇస్తోంది. మార్పును ప్రేరేపించే చిత్రాలను రూపొందించడానికి ప్రోత్సహిస్తుంది. భారతీయ చరిత్రలో చెరిపివేయబడిన అధ్యాయం ఆధారంగా, మా కాళి శక్తివంతమైన కథ, ప్రభావవంతమైన పెర్ఫార్మెన్స్‌లతో బెంగాల్‌లోని అన్‌టోల్డ్ చాప్టర్స్‌ని ప్రజెంట్ చేస్తోంది. కలకత్తా, నోఖాలీలో జరిగిన క్రూరమైన నరమేధ రక్తపాత సత్యాన్ని హైలైట్ చేస్తూ, భారతదేశ విభజనకు దారితీసిన డైరెక్ట్ యాక్షన్ డే వెనుక ఉన్న సత్యాన్ని ముందుకు తీసుకురావాలనేది మా కాళి లక్ష్యం. మా కాళి సోషియోపోలిటికల్ సబ్జెక్ట్ ప్రస్తుత కాలంలోని అత్యంత ముఖ్యమైన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. 1946 నుండి నేటి బంగ్లాదేశ్ వరకు హిందువులను పీడించడం, బెంగాల్ మతపరమైన అల్లకల్లోలాలను చిత్రీకరిస్తూ, మా కాళి (సిఎఎ) ప్రాముఖ్యతను, దాని అమలు యొక్క అవసరాన్ని కూడా హైలైట్ చేస్తుంది.
విజయ్ యెలకంటి రచన, దర్శకత్వం వహించిన మా కాళిని టిజి విశ్వ ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మించారు, కార్తికేయ 2 పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాతలు సమర్పిస్తున్నారు. ఈ పాన్‌ఇండియన్ చిత్రం హిందీలో చిత్రీకరించబడింది, బెంగాలీ, తెలుగులో 2025లో థియేటర్లలో విడుదల కానుంది.

# సీనియర్ నటి పావలా శ్యామలకు హీరో ఆకాష్ జగన్నాథ్ లక్ష రూపాయల సాయం



**ఆర్థిక ఇబ్బందులు,** వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న సీనియర్ నటి పావలా శ్యామలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. యంగ్ హీరో ఆకాష్ జగన్నాథ్. ఘట్‌కేసర్ లోని ఉషా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ డెవలప్ మెంట్ సొసైటీలో ఆశ్రయం పొందుతోంది పావలా శ్యామల. ఆమె పరిస్థితి తెలుసుకున్న ఆకాష్ జగన్నాథ్..అక్కడికి వెళ్లి ఆర్థికసాయం అందించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న తనకు సాయం చేసిన ఆకాష్‌కు పావలా శ్యామల కృతజ్ఞతలు చెబుతూ కన్నీళ్లు పెట్టుకుంది. ఆకాష్ జగన్నాథ్ మంచి మనసుకు ఈ సాయం నిదర్శనంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఆకాష్ తల్వార్ అనే మూవీలో నటిస్తున్నాడు.

# 20న 'భైరవం' టీజర్ లాంచ్



**బెల్లంకొండ** సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ మోస్ట్ ఎవైటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కెకె రాధామోహన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన లీడ్ యాక్టర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్ ఓ వెన్నెల సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈరోజు మేకర్స్ 'భైరవం' టీజర్ అప్డేట్ ఇచ్చారు. జనవరి 20న టీజర్ లాంచ్ కానుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ఇంటెన్స్ అండ్ ఫెరోషియస్ లుక్స్‌లో కనిపించిన టీజర్ అనౌన్స్ మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ చిత్రంలో అదితిశంకర్, దివ్యా పిళ్లై, ఆనంది హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ హరి కె వేదాంతం, ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్, బ్రహ్మకడలి ప్రొడక్షన్ డిజైనర్. సత్యర్షి, తూమ్ వెంకట్ డైలాగ్స్ రాస్తున్నారు.

# 'కోర్ట్ స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ఫస్ట్ లుక్ లాంచ్

**వాల్ పోస్టర్** సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు పొందే చిత్రాలను నిర్మించడంలో విశేషంగా పేరు తెచ్చుకుంది. నాని ప్రెజెంటర్‌గా ఉన్న ఈ బ్యానర్ ప్రతి కొత్త ప్రాజెక్ట్‌తోనూ ఆకట్టుకుంటుంది. కొత్త దర్శకుడు రామ్ జగదీష్ దర్శకత్వం వహించిన వారి లేటెస్ట్ ఎక్సయిటింగ్ మూవీ 'కోర్ట్ స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి లీడ్ రోల్ నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌తో సంచలనం సృష్టించింది. ఈ చిత్రాన్ని శాంతి తిపిర్నేని నిర్మించగా, దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.
ఈరోజు, ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ చేశారు. ఈ పోస్టర్‌లో ప్రియదర్శి న్యాయవాదిగా, కేసు ఫైల్ పట్టుకుని, ఆలోచనలతో కూడిన వ్యక్తిగా కనిపించాడు. హర్ష్ రోషన్, శ్రీదేవి కూడా పోస్టర్‌లో కనిపిస్తున్నారు, ఇది కథ అంతటా జరిగే ఎమోషన్‌ని చూస్తోంది. ఈ మూడు కీలక పాత్రల చుట్టూ తిరిగే ఉత్కంఠభరితమైన డ్రామాని పోస్టర్ ప్రజెంట్ చేసింది.
మోషన్ పోస్టర్ చాలా ఇంట్రస్టింగ్ గా ఉంది, ప్రియదర్శితో సహా ముగ్గురు ప్రధాన పాత్రలను పరిచయం చేస్తుంది. శ్రీదేవి పేరు జాబిల్లిగా రివిల్ కాగా, హర్ష్ రోషన్ కేసు నంబర్ ద్వారా పరిచయం అయ్యారు. ఇది కథనానికి ప్రత్యేకతను జోడిస్తుంది. నేపథ్య సంగీతం ప్లజెంట్‌గా వుంది.
ఈ సినిమా కథాంశం చట్టపరమైన ఆరోపణలో చిక్కుకున్న అబ్బాయి చుట్టూ వుంటుంది, న్యాయం, సత్యం కోసం పోరాటంగా వుంటుంది. బలమైన కథాంశంతో, ఈ చిత్రం ఆలోచింపజేసేదిగా ఉంటుందని, న్యాయ వ్యవస్థలో న్యాయం, న్యాయం కోసం అన్వేషణ గురించి కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతుందని హామీ ఇస్తుంది. ఈ చిత్రంలో శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్, రాజశేఖర్ అనింగి, సురభి ప్రభావతి, విశిక, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.
ఈ చిత్రానికి దినేష్ పురుషోత్తమన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. విఠల్ కోసనమ్ ఆర్ట్ డైరెక్టర్‌గా, కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. దర్శకుడు రామ్ జగదీష్‌తో కలిసి, కార్తికేయ శ్రీనివాస్, వంశీధర్ సిరిగిరి స్క్రీన్‌ప్లే రాశారు. షూటింగ్ దాదాపు పూర్తవుతుండగా, హోలీ పండుగ సందర్భంగా మార్చి 14న ఈ చిత్రం థియేటర్లలోకి వస్తుందని మేకర్స్ అనౌన్స్ చేశారు.
నటీనటులు: ప్రియదర్శి, శివాజీ, సాయి కుమార్, రోహిణి, హర్షవర్ధన్, హర్ష్ రోషన్, శ్రీ దేవి, శుభలేఖ సుధాకర్, రాజశేఖర్ అనింగి, సురభి ప్రభావతి, విషిక, వడ్లమాని శ్రీనివాస్.



# గోద్రెజ్ వారసురాలిగా..



భారతీయ విపణిలో గోద్రెజ్ వందేళ్ల చరిత్ర... లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యం రెండుగా చీలింది. అందులో 'గోద్రెజ్ అండ్ బాయ్స్' గ్రూప్ ఒకటి.. దీనికి భవిష్యత్తు వారసురాలిగా వైరిక హోల్కర్ ఎంపికైన అందరి దృష్టినీ ఆకర్షించారు. తాజాగా ఆసియాన్ పవర్ బిజినెస్ విమెన్ జాబితాలోనూ స్థానం సంపాదించు కున్నారు. వారసత్వం వ్యాపారానికే కాదు... విలువల బాటకూ అంటోన్న ఆమె ప్రత్యేకతలివి....

మహిళలకు అనుకూలంగా ఉండే పనివేళలు, సురక్షితంగా పని ప్రదేశం ఏర్పాటు చేయగలిగితే వారి నుంచి అద్భుతమైన ఉత్పాదకత అందుకోవచ్చు. అమ్మాయిలూ... చుట్టూ ఉన్నవాళ్లు మీ సామర్థ్యాలను సందేహించినా సరే మీపై మీరు నమ్మకాన్ని కోల్పోవద్దు. ఫొటోగ్రఫీ, హైకింగ్, వన్యప్రాణి పరిశీలన అంటే వాకిష్టం. ఇవి నాకు వ్యక్తిగత వృతిగత జీవితాల మధ్య, తను కలిగిస్తాయి. 'నాయకత్వ లక్షణాలకు చిన్నా పెద్ద అనే తేడా ఉండదు. సామర్థ్యమే కొలమానం' అంటారు. వైరిక 'గోద్రెజ్ అండ్ బోయ్స్' సంస్థ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అంషెడ్ గోద్రెజ్ సోదరి స్మితాకృష్ణ కుమార్తె 127 ఏళ్ల చరిత్ర కలిగిన గోద్రెజ్ గ్రూప్ రెండుగా విడిపోయింది. ఇందులోని గోద్రెజ్ ఎంటర్‌ప్రైజేస్ (జీఈజీ)ని నైరికా హోల్కర్ నడిపించను న్నారు. నేర్చుకోవాలంటే తపన, చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్ నైరికకు ఆభరణాలు. అమెరికాలోని కొల రాడో కాలేజీలో ఫిలాసఫీ అండ్ ఎన్విరా న్మెంటల్ ఎకనామిక్స్ పూర్తిచేశారు. ఆపై యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. నైరిక బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో సభ్యురాలు, యూకేలో క్వాలిఫైడ్ సొలిసిటర్ కూడా, లీగల్ ఫర్మ్ 'ఏజెడ్బి' పార్ట్నర్స్‌లో కెరియర్ ఆరంభించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, అండ్ పార్టనర్స్‌లో కెరియర్ ఆరంభించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, సంస్థలో కొనుగోళ్లువిలీనాలపై కంపెనీలకు సలహాలు ఇచ్చేవారు. 2017లో ఆమె జీఈజీ బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్‌లో ఒకరిగా నియమితు లయ్యారు. ఆ అనుభవం బలమైంది...ఎప్పటికైనా కుటుంబ వ్యాపారంలో భాగం అవ్వాలనే విషయం వైరకకు ముందు నుంచీ తెలుసు, కానీ, సంస్థలో చేరడానికి ముందే తనకి ఇతర రంగాల్లో అనుభవం ఎంతో అవసరమని భావించారు. లండన్, భారత్‌లో లాఫర్స్‌లో పనిచేశారు. న్యాయ విభాగంలో ఉన్న అనుభవం వల్లే నేను మా ఎలక్ట్రా నిక్స్ అండ్ ఎలక్ట్రికల్ వ్యాపారాన్ని పర్య వేక్షించేటప్పుడు... కాంట్రాక్ట్ రిస్క్ మేనేజ్ మెంట్‌లో లోపాల్ని గుర్తించగలి గాను, వాటికి పరిష్కారంగా మరింత పారదర్శ కతను కలిగి ఉన్నాను. అందించిన వ్యవస్థ లను నియంత్రించ గలిగాము అంటా రామె. గోద్రెజ్ అండ్ బాయ్స్ సంస్థ కింద కన్స్యూ మర్ గూడ్స్, కన్స్ట్రక్షన్, ఏరోస్పేస్.. ఇలా దాదాపు పది విభిన్న రంగాలకు చెందిన పరిశ్రమలు ఉన్నాయి. నైరిక కంపెనీ వ్యూహాత్మక ప్రణాళికల్లో పాత్ర పోషిస్తూ, బ్రాండింగ్. డిజిటలైజేషన్, లీగల్ వ్యవహా రాలు, విలీనాలు, కొనుగోళ్లలో చురుకైన నిర్ణయాలు తీసుకుంటూ సంస్థను పరుగులు పెట్టిస్తున్నారు.

# ఆమె చిత్రం ప్రపంచస్థాయికి ..



రంగుల ప్రపంచం... సినిమా, ఇందులో మొదటి నుంచీ మగవారిచే ఆధిపత్యం. తెరపై అ మెరవాలంటే కాదు... తెర వెనక అవకాశాలు దక్కించుకోవాలన్నా, తమని తాము నిరూపించుకోవాలన్నా మహిళలకు పెద్ద సవాలే. కానీ, ఈ ఏడాది కొందరు మహిళా దర్శకులు తమ ప్రతిభను చాటుతూ అంతర్జాతీయ వేదికలపై మెరిశారు. వారిలో ఆస్కార్ బరిలో ఉన్న సంధ్యాసూరి, గునీత్మాంగా, స్మృతి మూండాలతో పాటు... పాయల్ కపాడియా గురించి ప్రత్యేకంగా చెప్పాలి. తన 'అల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రం కేన్స్ ఫిల్మ్. ఫెస్టివల్లో గ్రాండ్ ప్రిక్స్ అవార్డులు. తాజాగా గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ రెండు నామినేషన్లు పొందింది. దీంతో '2024 ఐకానిక్ విమెన్'గా పాయల్ ఖ్యాతి తెచ్చుకున్నారు. ముప్పై ఏళ్ల తర్వాత... కేన్స్‌లో నిలవడం, ఆపై గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ రెండు నామినేషన్లు సాధించడంతో... భారతీయ సినిమాల గురించి అంతర్జా తీయ స్థాయిలో చర్చలు సాగాయి. ముఖ్యంగా ఈ ఘనత సాధించిన 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రంతో పాటు దానికి దర్శకత్వం వహించిన పాయల్ కపాడియా పేరు మారు మోగుతోంది. ఇది సాదాసీదా విజయం కాదు.. దాన్ని తను ఒక్కరోజులో అసలే కాదు. ఆమె స్వస్థలం ముంబై కానీ, పాయల్ ప్రస్థానం చాలా రోజులు ఆంధ్రప్రదేశ్‌లోనే సాగింది. ప్లస్టూ వరకూ రిషీ వ్యాలీ స్కూల్లోనే చదివింది. పాఠశాలలో ఫిల్మ్కట్‌లో సభ్యురాలయ్యాకనే పాయల్ మనసు.... రచన, చిత్ర దర్శకత్వంపై మళ్లించట ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేశాక పుణెలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. ఫిల్మ్ ఇన్ డిగ్రీ నాకెన్నో అను భవాలు, పాఠాలను నేర్పింది. ఇక్కడికి నేపథ్యాల నుంచి వచ్చిన వారితో స్నేహం, సినిమాలపై చర్చలు నా ఆలోచనల్లో పదును తెచ్చాయి అంటా రామె. సాయిల్ 2014 నుంచి సినిమాలు, డాక్యుమెంటరీలు చాలానే తీశారు. కానీ, 2021లో పరిచయమైంది. సైట్ ఆఫ్ నోయింగ్ నాథింగ్‌తో ఆమె ప్రతిభ లోకానికి పాయల్ ఫిల్మ్ ఇన్ ఆందోళనలో చదివేటప్పుడు ఆ సంస్థకు ఓ రాజకీయ నాయకుడిని చైర్మన్‌గా నియమించింది ప్రభుత్వం వద్దంటూ విద్యార్థుల్లో తను కూడా కొనసాగుతుంది. దాంతో యాజ మాన్యం క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కొన్నాళ్లు ఆమెను సస్పెండ్ చేసింది. జారీషి ప్లనూ రద్దు చేసింది. అయినా పాయల్ తన చిత్రం తీయడం ఆపలేదు. అలా తను తీసిన 'ఆఫ్టరన్ క్లౌడ్స్' 2017లో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివర్కు ఎంపికైంది. దాంతో ఇన్‌సైడ్ పాయల్‌పై ఉన్న అంక్షల్ని ఎత్తేయడమే కాదు... విమాన టిక్కెట్లు తీసి మరీ కేన్స్‌కి పంపించింది. తర్వాత ఏ నైట్ నోయింగ్ నరింగ్ అనే డాక్యుమెంటరీకి 2021లో గోల్డెన్ ఐ అవార్డు వరించడంతో మరోసారి పాయల్ అందరి దృష్టినీ తన వైపునకు తిప్పు కొన్నారు. తాజాగా ఆమె దర్శకత్వం వహించిన ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ గ్రాండ్ ప్రిక్స్ అవార్డు సాధించడమే కాదు... మూడు దశాబ్దాల తర్వాత సామ్ డి ఓర్ విభాగంలో పోటీపడిన తొలి భారతీయ చిత్రంగానూ గుర్తింపు పొందింది కేరళ నుంచి ముంబయికి ఉపాధి కోసం వలస వచ్చిన ఇద్దరు నర్సులు వారికి తాము పని చేస్తోన్న అసుపత్రిలో వంట చేసే మరాఠీ మహిళతో పరిచయం కథ మొదలవుతుంది. ఏ ముధ్య సాగే భావోద్వేగాలను, తమ జీవితంలో సంతోషమనే కాంతిని నింపు కోవడం వేసిన వీళ్ళు చేసే ప్రయత్నాలను భిన్న కోణాల్లో చూపించారు పాయల్ .

# ఫేస్‌వాష్‌లు డబుల్ క్లెన్సింగ్..



చర్మ సమస్య ఏదైనఆ చాలాసార్లు డబుల్ క్లెన్సింగ్ తప్పనిసరి అన్న సలహా వినిపిస్తుంది. అంటే ఏంటి? రెండుసార్లు చర్మాన్ని శుభ్రం చేసుకోవడం అనేస్తారా? ఒకరకంగా నిజమే కానీ.. దానికీ ఓ పద్ధతి ఉందని తెలుసా? అదేమిటంటే.. నచ్చిన సబ్బు, ఫేస్‌వాష్‌తో ముఖం కడిగేయడం చాలామంది అనుసరించే పద్ధతి ఇదే! కానీ దీనివల్ల సహజ నూనెలు తరిగిపోవడమే కాదు, చర్మమూ నిర్జీవంగా మారుతుంది. కాబట్టి.. ముందు ఏదైనా ఆయిల్ బేస్డ్ క్లెన్సర్ అంటే క్లెన్సింగ్ ఆయిల్, బామ్‌లు అని దొరుకుతున్నాయి కదా! వాటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. అదికూడా నీటితో ముఖాన్ని కడిగాక కాదు. నేరుగా ముఖానికి మర్దనా చేసినట్లుగా రుద్ది, ఆపై గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడిగేయాలి. ఆ తరువాత వాటర్ బేస్డ్ క్లెన్సర్‌తో మరోసారి శుభ్రం చేసుకుంటే డబుల్ **క్లెన్సింగ్ పూర్తయినట్లే!**. ఆయిల్ బేస్డ్ క్లెన్సర్ చర్మరంధ్రాల్లో లోతుగా పేరుకుపోయిన దుమ్ముధూళీ, మేకప్, సన్‌స్క్రీన్‌లను పూర్తిగా తొలగించేస్తుంది. ఇక వాటర్ బేస్డ్ క్లెన్సర్ తరవాత మనం రాయబోయే సీరమ్, క్రీములు చర్మంలోకి చొచ్చుకొనిపోయి ప్రభావవంతంగా పనిచేయడంలోసాయ పడుతుంది.

**. అందరికీ ఒకటేనా? ..** ఆయిల్ బేస్డ్ క్లెన్సర్లను జిడ్డు చర్మం ఉన్నవారూ ఎంచుకోవచ్చు. అయితే వాటర్ బేస్డ్ వాటి విషయంలో మాత్రం చర్మతీరును బట్టి ఎంచుకోవాలి. పొడి, సున్నితమైన, సాధారణ చర్మతత్వం ఉన్నవారు పరిమళాలు మృదువైన రకాలు..క్రీముల రూపంలో ఉన్న ఫేస్‌వాష్‌లు డబుల్ క్లెన్సింగ్.. చేస్తున్నారా ? ఎంచుకోవాలి. జిడ్డు యాక్నే ఉన్నవారికి ఫోమ్‌వి సరిపడతాయి. **ఎవరైనా చేయాల్సిందేనా ? ..** ఆయిల్ బేస్డ్ క్లెన్సర్లను జిడ్డు చర్మం ఉన్న వారూ ఎంచుకోవచ్చు. అయితే వాటర్ బేస్డ్ వాటి విషయంలో మాత్రం చర్మతీరును బట్టి ఎంచుకోవాలి. పొడి, సున్నితమైన, సాధా రణ చర్మతత్వం ఉన్న వారు పరిమళాలు మృదువైన రకాలు.. క్రీముల రూపంలో ఉన్న ఫేస్ వాష్‌లు ఎంచుకోవాలి. జిడ్డు, యాక్నే ఉన్నవారికి ఫోమ్‌వి సరిపడ తాయి.

# చిన్నారుల స్నేహం ..



పిల్లలు ఇంట్లో చలాకీగా ఉండి, స్కూల్లో, బయట ఎవ్వరితోనూ కలవకుండా ముభావంగా ఉంటారు. మీ చిన్నారుల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? అయితే వారికి బయటి ప్రపంచాన్ని తప్పక పరిచయం చేయాల్సిందే. లేదంటే సామాజిక నైపుణ్యాలు కొరవడతాయి. కాబట్టి.. వీటిని అలవాటు చేయండి. తోటివారితో, తోబుట్టువు లతో మాట కలిపేలా ప్రోత్సహించండి. అప్పుడే చిన్న బుర్రలకి బయటి ప్రపంచం పరిచయం అవుతుంది. ఇతరులతో ఎలా మెలగాలి, ఏం మాట్లాడాలన్నదీ వారికి తెలుస్తుంది. క్రీడల్లో వారిని భాగస్వాములను చేయాలి. అందుకోసం స్పోర్ట్స్ అకాడెమీలో వారిని చేర్పించండి. క్రీడలు మానసిక ఎదుగుదలకి దోహదపడతాయి. కొత్త స్నేహితులు పరిచయం అవుతుంటారు. దాంతో కొత్తవారితో మాట్లాడాలంటే బిడియం పోతుంది. కొంత మంది. తల్లితో తప్ప ఎవ్వరితోనూ పెద్దగా మాట్లాడని చిన్నారులు ఒకేసారి బయట ప్రపంచంలో కలవడం కాస్త కష్టం. ఆ ఇబ్బందిని మీతో పంచుకున్నప్పుడు మీరు దానికి సాను కూలంగా స్పందించాలి. లేదంటే ఆత్మన్యూనతకు లోనయ్యే అవకాశం ఉంది. వారు చెప్పే కారణాలకి మీ అనుభవాలను జోడించి స్నేహాన్ని ప్రయతిననంచమని చెప్పాలి. చిన్నపిల్లలకు ఇప్పుడు మనం ఏం చెబితే అదే వారి మనసులో బలం గా నాటు కు పోతుంది. అందువల్ల స్నేహాల్లో ఎటువంటి తారతమ్యం ఉండకూడదని వివరించండి. అప్పుడే భిన్న సంస్కృతులు, సంప్రదాయాల పట్ల వారికి అవగాహన ఏర్పడుతుంది.

# దోశ ప్రింటర్



ప్రింటర్ అవసరమైన కథనాలు కాపీలు తీస్తాం. అది మనందరికీ తెలి సిందే! దోశలు కూడా అలా తీయొచ్చు అంటే దోశ బొమ్మల ప్రింటవుట్ కాదండోయ్. అసలైన దోశలే. ఇదెక్కడి చోద్యం అనుకుంటు న్నారా? అలాంటి పరికరం నిజంగానే ఉంది మరి. ఇందులో పిండిని లోడ్ చేస్తే చాలు. 360 డిగ్రీల ఫుడ్ గ్రేడ్ కోటెడ్ రోలర్ లోంచి నిమిషంలో దోశలు డౌన్‌లోడ్ అవు తాయి. ఎంత మందం గా కావాలి. ఏ మాత్రం వేగాలి మొదలైన కంట్రోల్ బటన్‌లు కూడా ఉన్నా యి. దీన్ని కొను క్కున్నా మంటే చెమటలు కక్కుతూ దోశలు వేయాల్సి పనేలేదు. ఎంచక్కా మీట నొక్కితే చాలు. కరకరలాడే దోశలు వచ్చేస్తాయి.

# పూలు లేని పుష్ప గుచ్ఛాలు

పెళ్లి, పదోన్నతి లాంటి శుభ సందర్భాల్లో ఫ్లవర్ బొకె ఇస్తాం! కానీ అవి కొద్ది సేపటికే వాడిపోతాయి. అలాగని నోరూరిస్తున్నాయి! నచ్చితే మీరూ ప్రయత్నించండి.
























# సిరి ఉండే చోటు..



ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చే వరకు వేచి ఉండి తదుపరి తనువు చాలించేందుకు భీష్ముడు అంపశయ్య మీద ఉన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో భీష్ముడు సకల ధర్మాలూ తెలిసిన లోకజ్ఞాని, మహాత్ముడు. రాజ్యపాలన ఎలా చేయాలో ఆయన్ను అడిగి తెలుసుకో అన్నాడు. ధర్మజుడు అలాగేనని వెళ్లి తాతా! శీలం అంటే ఏమిటి? దానికి అంత ప్రాముఖ్యత ఎందుకిస్తారు? అనడిగాడు. ధర్మజా! దీనికి సంబంధించిన త్రేతాయుగం నాటి ఓ ఉదంతం చెబుతాను. విని అర్థం చేసుకో! ప్రహ్లాదుడు మూడు లోకాలనూ జయించి అధిపతి అయ్యాడు. రాజ్యం కోల్పోయిన ఇంద్రుడు మళ్లీ తన పదవి ఎలా సంపాదించుకోవాలో తెలుసుకునేందుకు దేవతల గురువు బృహస్పతిని ఆశ్రయించాడు. అతడు ప్రహ్లాదుడి గురువైన శుక్రాచార్యుణ్ణి అడగమన్నాడు. ఆయనేమో ప్రహ్లాదుణ్ణే అడగమన్నాడు. ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో వెళ్లి ప్రహ్లాదుడికి శుశ్రూష చేస్తూ మెప్పు పొందాడు. మహాత్మా ముల్లోకాలనూ జయించి పరిపాలించే శక్తి మీకెలా వచ్చింది. అనడిగాడు. నేనెన్నడూ గర్వించను. సకల లోకాలూ సుఖంగా ఉండాలని తమ తపస్సు ధారపోసే బ్రాహ్మణులను నొప్పించను ఆ సచ్ఛీలతే ఇందుకు కారణం అన్నాడు. అయితే మీ శీలం నాకు ప్రసాదించండి అని బతిమాలాడు. తన శీలం కోరుతున్నాడంటే ఇతడెవరో గొప్పవాడై ఉంటాడనే అనుమానం వచ్చింది. అయినా అడిగిన వారిని కాదనకుండా తన శీలాన్ని దానం చేశాడు. వెంటనే ప్రహ్లాదుడి దేహం నుంచి శీలం, ధర్మం, సత్యం ఇలా తేజో దైవస్వరూపాలు ఒక్కొక్కటిగా బయటకు రాసాగాయి. చివరిగా పద్మ ముఖంతో మరో రూపం బయటి కొచ్చింది. అందమైన ఆ రూపాన్ని చూస్తూ అమ్మా! నువ్వెవరివి? అనడిగాడు ప్రహ్లాదుడు. అతడికేసి జాలిగా చూస్తూ. నేను సిరిని. నీ శీలాన్ని దేవేంద్రుడికి దానం చేశావు కదా! శీలం ఉన్నచోట ధర్మం, ధర్మం, దగ్గర సత్యం, అది ఉన్నచోట నడవడి, దాని వెంట బలం ఉంటాయి. ఇవన్నీ కలిసి ఉన్నచో సిరిని నేనుంటాను. నీ నుంచి శీలం తొలగిపోగానే ఒకరొకరుగా అందరూ వెళ్లారు. వారితోపాటు నూనె వెళ్లిపోతున్నాను అంటూ సిరి వెళ్లి పోయింది. దేవేంద్రుడికి మళ్లీ అలా రాజ్యం వచ్చింది. కనుక సంపదలు కోరేవారికి శీలం ఉండితీరాలి. ఇదే శీల విశిష్టత అంటూ వివరించాడు భీష్మపితామహుడు.

ఆధ్యాత్మికం

# సర్దుకుందామిలా..

**ఇంటిని శుభ్రం చేయాల్సిన రోజు వస్తుందంటే చాలు.. మహిళల్లో కంగారు మొదలవుతుంది. ఉద్యోగినుల పరిస్థితి అయితే మరింత దారుణం. దీనికి కారణాలేవైనా కొన్ని మెలకువలు పాటిస్తే మాత్రం ఆ పని సులువే అంటారు నిపుణులు**



. వారికి ఇచ్చేయండి.. కొందరికి ఏ వస్తువులైనా పడేయాలంటే మనసొప్పదు. వంటపాత్రైనా, దుస్తులైనా సరే.. వాటినస్సలు వాకపోయినా సరే ఎవరికీ ఇవ్వడానికి ఒప్పుకోరు. కొందరు తల్లులైతే పిల్లల దుస్తులూ, బొమ్మలను జ్ఞాపకాలుగా చెబుతూ ఏళ్లతరబడి పోగేస్తుంటారు. ఏ జ్ఞాపకమైనా ఒకటీ, రెండు బాగుంటాయి. లెక్కకు మించితే ఇల్లంతా గందరగోళం. ఒకవేళ అదే కారణమైతే అమ్మ చీర, బుజ్జాయి మొదటిసారి వేసుకున్న డ్రెస్ వంటివాటిని చక్కగా ఫ్రేమ్ చేయించి గోడకు తగిలించండి. ఎప్పుడూ కళ్లముందు కనిపిస్తాయి. లేదంటే ఇలా ఓ రెండు మూడింటిని మీ దగ్గర పెట్టుకోండి చాలు. మిగిలిన అవసరమున్న వారికి ఇచ్చేయండి. అప్పుడు షెల్ఫ్‌లన్నీ ఖాళీ అవుతాయి. మిగిలినవాటిని ఎంచక్కా అమర్చుకోవచ్చు. సోటరేజ్ బాక్సులతో.. అవసరమున్నా లేకున్నా కనిపించిందల్లా కొని ఇంటిని నింపేసానతరు. చాలామందే కానీ, కొన్ని సార్లు అవి తమ దగ్గర ఉన్న విషయమూ వారికి జ్ఞాపకం ఉండదు. ఈ పరిస్థితి తలెత్త కుండా ఉండా లంటే.. ఆర్గనైజింగ్, స్టోరేజ్ బాక్సులు కొనండి. వీటిపై ఒక్కసారి పెట్టుబడి పెడితే.. ఏళ్లపాటు సులువుగా వాడుకోవచ్చు. సౌకర్యం కూడా. అయితే, ఇవి ఒకే రంగులోనో, ఒకే తరహాలో ఉంటే చూడ్డానికీ బాగుంటాయి. మదులూ, స్టేషనరీ, బ్యూటీ ఉత్పత్తులు పిల్లల యాక్సెసరీలను వేటికవే సర్దేయండి. ఏ వస్తువు ఎందులో ఉందో లేబులింగ్ చేసుకుని పెట్టుకోండి. దీంతో ఏది అవసరముందో దాన్నే బయటకు తీసి వాడుకుంటారు. శుభ్రం చేయాల్సి వచ్చినప్పుడూ అదే సూత్రాన్ని పాటిస్తే సమయం కలిసి వస్తుంది. శ్రమా ఉండదు. మడత పెట్టేవరకూ చాలా మంది ఇళ్లల్లో ఉతికిన దుస్తులే కుప్పలుగా పోసి ఉంటాయి. వాటిని మడతపెట్టే సమయం ఉండకపోవడమే ఓ కారణం. ఇలాంటప్పుడు వాటిని మంచాలమీదో, సోఫాల మీదో వేసి ఉంచేయకుండా ఆరినవాటిని ఓ పెద్ద బాస్కెట్ పెట్టి అందులో వేసేయండి. సమయం ఉన్నప్పుడు ఒక్కక్కటిగా ఫోల్డ్ చేసి షెల్ఫ్‌లో పెట్టేయొచ్చు. అప్పుడీ పని మీకు శ్రమ అనిపించదు.

# ఫైనాపిల్ రైస్



**కావలసినవి :** బియ్యం-4 కప్పులు, సోయా సాస్-3 టేబుల్ స్పూన్లు, జీలకర్ర, ధనియాలు, పసుపు, మిరియాల పొడి-చెంచా చొప్పున, శొంఠి పొడి-అరచెంచా, లవంగాలు-6, యాలకులు-2, దాల్చిన చెక్క-2 అంగుళాల ముక్క, బిర్యానీ ఆకులు-2, పచ్చి మిర్చి-4, పచ్చి బఠాణీలు - కప్పు, బీన్స్, టొమాటో, క్యారెట్ బంగాళదుంప ముక్కలు-అర కప్పు చొప్పున, అనాస ముక్కలు- ఒకటిన్నర కప్పు, జీడిపప్పు- అర కప్పు, నిమ్మరసం- చెంచా, పుదీనా, కొత్తిమీర తరుగు- చారెడు చొప్పున, అల్లం- అంగుళం సైజు ముక్క, నెయ్యి-3 చెంచాలు, ఉప్పు-తగినంత.

**తయారీ :** కూంగాయలు కడిగి ముక్కలు గా కోసుకోవాలి. కుక్కర్‌లో నెయ్యి వేసి.. యాలకు లు, లవంగాలు, జీలకర్ర, ధనియాలు, పసుపు, మిరియాల పొడి, శొంఠి పొడి, అల్లం-మిర్చి ముద్ద, బిర్యానీ ఆకులు, జీడిపప్పు, పుదీనా, బఠాణీలు, కూరగాయల ముక్కలు, అనాస ముక్కలు.. ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక.. 8 కప్పులనీళ్లు, కడిగిన బియ్యం, ఉప్పు వేసి మూత పెట్టాలి. మూడు విజిల్స్ వచ్చిన తర్వాత దించేసి.. నిమ్మరసం కొత్తిమీర తరుగు వేస్తే సరిపోతుంది.

## అండర్19 వరల్డ్ కప్‌లో..
# భారత్ బోణీ

### వెస్టిండీస్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు

### మరో మ్యాచ్‌లో మలేసియాపై 135 రన్స్‌తో శ్రీలంక విన్



**ఢిల్లీ:** అండర్19 మహిళల టీ20 వరల్డ్ కప్-2025లో భారత్ బోణీ కొట్టింది. కౌలాలంపూర్ వేదికగా వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌ను భారత బౌలర్లు 13.2 ఓవర్లలో 44 పరుగులకే కుప్పకూల్చారు. పరుణిక సిసోడియా మూడు, ఆయుశి శుక్లా, జోషిత్ వీజేతలో రెండు వికెట్లు పడగొట్టారు. దీంతో ముగ్గురు విండీస్ బ్యాటర్లు రనౌటయ్యారు. విండీస్ ఇన్నింగ్స్‌లో అసాబి ఖలందర్ 12 పరుగులు, కేనిక కస్సార్ 15 పరుగులు చొప్పున రెండంకెల స్కోర్లు మాత్రమే చేశారు. ఏకంగా ఐదుగురు విండీస్ బ్యాటర్లు డకౌటయ్యారు. ఇక 45 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 4.2 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గొంగడి త్రిష 4 పరుగులు చేసి ఔట్ అయింది. ఇక కమలిని 16 పరుగులు, సనికా ఛల్కే 18 పరుగులతో భారత్‌ను విజయతీరాలకు చేర్చారు. విండీస్ బౌలర్ క్లాక్స్‌టన్‌కు త్రిష వికెట్ దక్కింది. కాగా, ప్రస్తుత వరల్డ్ కప్‌లో భారత్, శ్రీలంక, మలేసియా, వెస్టిండీస్‌తో కలిసి గ్రూప్ ఏలో పోటీపడుతుంది. ఈ గ్రూప్‌ఏలో భాగంగా ఆదివారం జరిగిన మరో మ్యాచ్‌లో మలేషియాపై శ్రీలంక 139 పరుగుల భారీతేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మలేషియా 23 పరుగులకే ఆలౌటైంది.

# విజయ్ హజారే ఛాంపియన్ కర్ణాటక

### ఫైనల్లో 36 పరుగుల తేడాతో విదర్భ ఓటమి



**ఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ-2025 టైటిల్‌ను కర్ణాటక జట్టు చేజిక్కించుకుంది. విదర్భతో వడోదర వేదికగా జరిగిన ఫైనల్‌లో కర్ణాటక 36 పరుగుల తేడాతో నెగ్గి ఐదోసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో కర్ణాటక నిర్దేశించిన 349పరుగులు ఛేదనలో విదర్భ 48.2 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్‌షోరే 111 బంతుల్లో 110 పరుగులు,8ఫోర్లు, 2సిక్సలు కొట్టి శతకంతో చెలరేగినా విదర్భకు ఓటమి తప్పలేదు. కర్ణాటక బౌలర్లలో వాసుకి కౌశిక్, ప్రసిధ్ కృష్ణ, అభిలాష్ శెట్టి తలో 3 వికెట్లు పడగొట్టగా హార్దిక్ రాజ్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. భారీ ఛేదనలో విదర్భ స్కోర్ బోర్డు ముందుకు కదులుతున్న ప్పటికీ వికెట్లు క్రమంగా పడ్డాయి. యశ్ రాథోడ్ 22 పరుగులు, కరుణ్ నాయర్ 27 పరుగులు, జితేశ్ శర్మ 34పరుగులు చేసి భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. చివర్లో హర్ష్‌దుబే 63పరుగులుచేసి హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. చివర్లో పోరాడిన హర్ష్ దూబే మ్యాచ్‌పై ఆశలు రెకెత్తించినా, మరో ఎండ్‌లో వికెట్లు పడ్డాయి. ఇక అభిలాశ్ శెట్టి బౌలింగ్‌లో హర్ష్ దూబే క్యాచ్ ఔట్ అవ్వడంతో మ్యాచ్ ముగిసింది. ఇక విదర్భ కెప్టెన్ కరుణ్ నాయర్ ఒంటిచేత్తో జట్టును ఫైనల్ వరకూ తీసుకువచ్చాడు. భారీ ఛేదనలో కరుణ్ 27 పరుగులతో ఆకట్టుకోలేకపోయాడు. అయితే ఈ ఎడిషన్‌లో మాత్రంఅత్యధిక రన్‌స్కోరర్‌గా నిలిచాడు.8 మ్యాచ్‌ల్లో కరుణ్ 779 పరుగులతో టోర్నీని ముగించాడు. అంతకుముందు కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 348 పరుగుల తో భారీస్కోర్ సాధించింది.సమరన్ రవిచంద్రన్ 101 పరుగులు; 92 బంతుల్లో 7ఫోర్లు, 3 సిక్సర్లతో శతక్కొట్టాడు. క్రిష్ణన్ శ్రీజిత్ 78 పరుగులు, అభినవ్ మనోహర్79 పరుగులతో చెలరేగారు. విదర్భ బౌలర్లలో భూట్లే, దర్శన్ చెరో 2 వికెట్లు పడగొట్టగా యశ్ ఠాకూర్, యశ్ కాదం తలో వికెట్ తీశారు.

# లక్నో జెయింట్స్‌లో కెప్టెన్ రేస్

### పోటీ పడుతున్న సీనియర్లు

### పటిష్ట పరిచే దిశగా ఫ్రాంచైజీ



**ఢిల్లీ:** ఈసారి కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో ఇండియన్ సూపర్ లీగ్ (ఐపీఎల్)-2025లో సత్తా చాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సీజన్లో అయినా తొలి టైటిల్ కైవసం చేసుకోవాలని ఆ జట్టు ఫ్రాంచైజీ మాస్టర్ ప్లాను వేస్తుంది. లక్నో సూపర్ జెయింట్స్ గత సీజన్లలో ప్లే ఆఫ్ స్థాయి జట్టుగా నిలిచినప్పటికీ ఐపీఎల్-2024లో తమ ప్రదర్శనతో నిరాశపరిచింది. పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచిన లీలీబి లోనెట్ రన్ రేట్ కారణంగా ప్లేఆఫ్‌ను కోల్పోయింది. ఈ నేపథ్యంలో, ఐపీఎల్-2025 సీజన్‌కు ముందుగా తమ కొత్త కెప్టెన్‌ను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ తమ జట్టు కెప్టెన్ కెఎల్ రాహుల్‌ను వదులుకొని, రిషబ్ పంత్, నికోలస్ పూరన్‌నులో ఒకరిని కొత్త సారధిగా నియమించనున్నట్లు సమాచారం. రిషబ్ పంత్ తన అనుభవంతో ముందస్తు ఎంపికగా కనిపిస్తుండగా, పూరన్ కూడా సమర్థమైన ప్రత్యామ్నాయంగా ఉంది. ఇదే సమయంలో రిషబ్, పూరన్‌తో పాటు, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్, మోహ్సిన్ ఖాన్, ఆయుష్ బదోనీలు సైతం పోటీ పడుతున్నారు. అయితే కెప్టెన్సీ రేసులో వారిలో రిషబ్ పంత్, నికోలస్ పూరన్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. దీంతో ఫ్రాంచైజీ యాజమాన్యం కెప్టెన్సీ ఎంపిక విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధరగా రూ.27 కోట్లకు 2024 మెగా వేలంలో లీలీబి ద్వారా కొనుగోలు చేయబడ్డ పంత్, కెప్టెన్సీ రేసులో ముందు ఉన్నాడు. 2021-2024 మధ్య ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా ఉన్న పంత్, తన కెప్టెన్సీ అనుభవంతో ప్రత్యేకంగా నిలుస్తున్నాడు. 2023 సీజన్ మినహా, ఇతర సీజన్లలో అతని నాయకత్వం జట్టుకు బలాన్నిచ్చింది. అలాగే వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ పూరన్ లక్నో జట్టులో ప్రధాన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. 2024 సీజన్‌లో పూరన్ అత్యధిక రన్లు సాధించాడు. ప్రస్తుతం ఐఎల్‌టి20లో ఎంఐ ఎమిరేట్స్‌కు నాయకత్వం వహిస్తున్న పూరన్, ఫ్రాంచైజీ క్రికెట్‌లో కెప్టెన్సీ అనుభవం కలిగి ఉన్నాడు. కాగా 2022 నుంచి లక్నో కెప్టెన్‌గా వ్యవహరించిన రాహుల్, 2024 ఐపీఎల్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి తర్వాత యజమాని సంజీవ్ గోయెంకాతో వచ్చిన మనస్పర్ధల కారణంగా జట్టును విడిచాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు. గతంలో ముంబై ఇండియన్స్‌తో పని చేసిన జహీర్ ఖాన్, ప్రస్తుతం లక్నో జట్టుకు మెంటార్‌గా సేవలందిస్తున్నాడు. అతని మార్గదర్శకత్వంలో, జట్టు పునర్నిర్మాణం చేపట్టనుంది. దీనికి సంబంధించి ఈ నెల 20న కోల్‌కతాలోని ఆర్‌పి సంజీవ్ గోయంకా గ్రూప్ (ఆర్‌పిఎస్‌జి) ప్రధాన కార్యాలయంలో జరగబోయే విలేకరుల సమావేశంలో గ్రూప్ ఛైర్మన్ సంజీవ్ గోయెంకా కొత్త కెప్టెన్ పేరును వెల్లడిస్తారని సమాచారం. ఫ్రాంచైజీ కొత్త జెర్సీ ఆవిష్కరణ కూడా జరిగే అవకాశం ఉంది.

## సాత్విక్, చిరాగ్ జోడీ ఓటమి

### ఇండియన్ ఓపెన్‌లో ముగిసిన భారత్ ప్రస్థానం

**ఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో భారత ప్రస్థానం ముగిసింది. టైటిల్‌పై ఆశలు రేపిన భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి పోరాటానికి సెమీ ఫైనల్లోనే చుక్కెదురైంది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 18-21, 14-21తో మలేషియాకు చెందిన గో జి ఫి-నూర్ ఇజుద్దీన్ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఏడో సీడ్‌సాత్విక్, చిరాగ్‌జంట తొలి గేమ్‌లో మాత్రమేఒకింత దీటైన పోటీనిచ్చింది.అయితే కీలకమైన రెండో గేమ్‌లో ప్రత్యర్థికి సవాలు విసిరేందుకు ప్రయత్నించినా లాభంలేకపోయింది. మెరుపులాంటి స్మాష్‌లకు తోడు సుదీర్ఘమైన ర్యాలీలతో మలేషియా జోడీ పాయింట్లు ఖాతాలోవేసుకుని మ్యాచ్‌ను తమవశం చేసుకుంది.





# తొలి టెస్టులో పాకిస్థాన్ గెలుపు

### 127 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఓటమి

**ఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 127 పరుగుల తేడాతో గెలుపొందింది. ముల్తాన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ నిర్దేశించిన 251 పరుగుల లక్ష్య ఛేదనలో విండీస్ చేతులెత్తేసింది. పాక్ స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (15-3-50-5), అబ్రార్ అహ్మద్ (11.3-2-27-4), నౌమన్ అలీ (10-1-42-1) చెలరేగడంతో విండీస్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 123 పరుగులకే కుప్పకూలింది. విండీస్‌ను గెలిపించేందుకు అలిక్ అథనాజ్ (55) విఫలయత్నం చేశాడు. విండీస్ ఇన్నింగ్స్‌లో క్రెయిగ్ బ్రాత్‌వైట్ (12), మికైల్ లూయిస్ (13), టెవిన్ ఇమ్లాచ్ (14), కెవిన్ సింక్లెయిర్ (10) రెండంకెల స్కోర్లు చేశారు. కీసీకార్తీ 6, జస్టిన్ గ్రీవ్స్ 9, కవెమ్ హాడ్జ్, మోటీ, వార్రికన్ డకౌటయ్యారు. విండీస్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ జోమెల్ వార్రికన్ (18-3-32-7) స్పిన్ మాయాజాలం దెబ్బకు పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 157 పరుగులకే ఆలౌటైంది. గుడకేశ్ మోటీ ఓ వికెట్ తీయగా, ఇద్దరు పాక్ ఆటగాళ్లు రనౌట్ అయ్యారు. పాక్ ఇన్నింగ్స్‌లో షాన్ మసూద్ (52) టాప్ స్కోరర్ కాగా, ముహమ్మద్ హురైరా 29, బాబర్ ఆజమ్ 5, కమ్రాన్ గులామ్ 27, సౌద్ షకీల్ 2, మహ్మద్ రిజ్వాన్ 2, సల్మాన్ అఘా 14, నౌమన్ అలీ 9, సాజిద్ ఖాన్ 5, ఖుర్రమ్ షెహజాద్ డకౌటయ్యారు. అంతకు ముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 137 పరుగులకే కుప్పకూలింది. నౌమన్ అలీ (11-2-39-5), సాజిద్ ఖాన్ (12-0-65-4), అబ్రార్ అహ్మద్ (1.2-16-1) విండీస్ నడ్డివిరిచారు. విండీస్ ఇన్నింగ్స్‌లో 10, 11వ నంబర్ ఆటగాళ్లు వార్రికన్ (31 నాటౌట్), జేడన్ సీల్స్ (22) మాత్రమే 20కి పైగా పరుగులు చేశారు. బ్రాత్‌వైట్ (11), కెవిన్ సింక్లెయిర్ (11), మోటీ (19) రెండంకెల స్కోర్లు చేయగా, మికైల్ లూయిస్ (1), కీసీకార్తీ (0), కవెమ్ హాడ్జ్ (4), అలిక్ అథనాజ్ (6), జస్టిన్ గ్రీవ్స్ (4), టెవిన్ ఇమ్లాచ్ (6) సింగిల్ డిజిట్ స్కోర్లకే టపా కట్టేశారు. ఇక ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (84), మహ్మద్ రిజ్వాన్ (71) అర్ధ సెంచరీలు సాధించి పాక్‌కు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో షాన్ మసూద్ 11, ముహమ్మద్ హురైరా 6, బాబర్ ఆజమ్ 8, కమ్రాన్ గులామ్ 5, సల్మాన్ అఘా 2, నౌమన్ అలీ 0, సాజిద్ ఖాన్ 18, ఖుర్రమ్ షెహజాద్ 7 పరుగులు చేశారు. విండీస్ బౌలర్లలో వార్రికన్, జేడన్ సీల్స్ తలో మూడు వికెట్లు పడగొట్టగా, కెవిన్ సింక్లెయిర్ 2, మోటీ ఓ వికెట్ దక్కించుకున్నారు. ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టెస్ట్ ఇదే వేదికగా ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుంది.

# 53% పెరిగిన రియల్ ఎస్టేట్ విక్రయాలు

**న్యూఢిల్లీ, జనవరి 19:** భారతదేశంలో విలాసవం తమైన గృహాల కోసం డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుంది. ప్రత్యేకించి రూ.4 కోట్లు, అంతకంటే ఎక్కువ ధర ఉన్న గృహాల డిమాండ్ బాగా పెరిగిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్‌ఈ డేటాలో విశ్లేషించింది. ఈ గృహాల విక్రయాలు 2024లో ఏడు ప్రధాన నగరాల్లో 53 శాతం పెరిగాయని పేర్కొంది. గత ఏడాది విక్రయించిన మొత్తం లగ్జరీ హౌసింగ్ యూనిట్ల సంఖ్య 19,700గా ఉంటే, 2023లో విక్రయించిన 12,895 యూనిట్లుగా ఉంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం లగ్జరీ గృహాలకు అతిపెద్ద మార్కెట్‌గా అవతరించిందని ఆ డేటాలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ ఏరియా అమ్మకాల్లో గణనీయమైన పెరుగుదలను



నమోదుచేసిందని, 2024లో ఈ ప్రాంతంలో 10,500యూనిట్లు అమ్ముడయ్యాయి. అయితే 2023లో కేవలం 5,525 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. జాతీయ రాజధాని ప్రాంతంలో హై ఎండ్ రియల్ ఎస్టేట్‌కు పెరుగుతున్న డిమాండ్ పెరుగుతున్న విక్రయాల బట్టి అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. లగ్జరీ గృహాల అమ్మకాల జోరు భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని, రాబోయే త్రైమాసికాల్లో అమ్మకాలతో పాటు కొత్త గృహాల యూనిట్ లాంచ్‌లు రెండూ స్థిరంగా ఉంటాయని సీబీఆర్‌ఈ ఇండియా, సౌత్‌ఈస్ట్ ఆసియా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా ఛైర్మన్, సీఈఓ అన్షుమాన్ మ్యాగజైన్ చెబుతున్నారు. నోయిడా, బెంగళూరు, పుణె, చెన్నై వంటి నగరాల్లో మధ్యతరగతి అభివృద్ధితో సాంప్రదాయకంగా అనుబంధం ఉన్న నగరాల్లో ఉన్నతస్థాయి ప్రాజెక్టుల వైపు ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని చెబుతున్నారు. లగ్జరీ గృహాల డిమాండ్ పెరగడం అనేది గృహయజమానులపై ప్రజల అవగాహనలో ప్రాథమిక మార్పును ప్రతిబింబిస్తుందని నిపుణులు చెబుతున్నారు లగ్జరీ హౌసింగ్ మార్కెట్‌లో కీలకమైన ముంబైలో అమ్మకాలు బాగా పెరిగాయి. 2024లో 5,500 లగ్జరీ యూనిట్లు అమ్ముడుకాగా 2023లో 4,200 యూనిట్లు అమ్ముడయ్యాయి. పూణేలోని లగ్జరీ హోమ్ మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధించింది. ఈ నగరలంలో అమ్మకాలు 400 యూనిట్ల నుంచి 825 యూనిట్లకు పెరిగాయి. అయితే బెంగళూరులో స్వల్ప క్షీణత నమోదైంది. ఇక్కడ అమ్మకాలు గతేడాది 265 యూనిట్లు ఉంటే ప్రస్తుత త్రైమాసికంలో 50 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. అలాగే కోల్‌కతాలో, విలాసవంతమైన గృహాల విక్రయాలు 310 నుంచి 530 యూనిట్లకు పెరిగాయి.ముఖ్యంగా హైదరాబాద్‌లో లగ్జరీ గృహాల అమ్మకాల్లో స్థిరమైన పెరుగుదల కనిపించింది. 2023లో 2,030 యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే 2,100యూనిట్లకు చేరుకుంది. చెన్నైలో 2024లో 165-275 యూనిట్లకు పెరిగింది.

# వరల్డ్ నం.3 స్టార్టప్ ఎకోసిస్టంగా భారత్

**న్యూఢిల్లీ, జనవరి 19:** పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) జనవరి 15 నాటికి దాదాపు 1.59 లక్షలకు పైగా స్టార్టప్‌లను గుర్తించిందని, దీంతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఏర్పడినట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం (జనవరి 15) తెలిపింది. 2016 నుంచి 2024 అక్టోబరు 31 వరకు దేశ యువతకు 16.6 లక్షలకుపైగా ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించినట్లు వెల్లడించింది. ఇవి నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు గణనీయంగా దోహదపడ్డాయని పేర్కొంది. వీటిల్లో ఐటీ సర్వీసెస్ ఇండస్ట్రీ 2.04 లక్షల ఉద్యోగాలతో అగ్రగామిగా కొనసాగుతుంది. ఆ తర్వాత 1.47 లక్షల ఉద్యోగాలతో హెల్త్‌కేర్ అండ్ లైఫ్‌సైన్స్, దాదాపు 94 వేల ఉద్యోగాలతో ప్రొఫెషనల్ అండ్ కమర్షియల్ సర్వీస్‌లు తర్వాత స్థానాల్లో ఉన్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2016, జనవరి 16న భారత్‌లో ప్రారంభమైన 'స్టార్టప్ ఇండియా' తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుందని ఈ సందర్భంగా గుర్తు చేసింది. 2016లో ప్రారంభమైన స్టార్టప్ ఇండియా దేశంలోనే ఒక పరివర్తనాత్మక ప్రయాణమని కొనియాడింది. అందుకే జనవరి 16వ తేదీని 'నేషనల్ స్టార్టప్ డే'గా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. బెంగళూరు, హైదరాబాద్, ముంబై, ఢిల్లీవిదిళి వంటి ప్రధాన కేంద్రాలు స్టార్టప్ ఇండస్ట్రీలో ముందంజలో ఉన్నాయి. అయితే చిన్న నగరాలు దేశం వ్యవస్థాపక ఊపందుకోవడానికి ఎక్కువగా దోహదపడ్డాయని పేర్కొంది. ఫిన్‌టెక్, ఎడ్‌టెక్, హెల్త్‌టెక్, ఇ-కామర్స్‌లోని స్టార్టప్‌లు స్థానిక సవాళ్లను అధిగమించి ప్రపంచ గుర్తింపును పొందినట్లు పేర్కొంది.గుర్తింపు పొందిన స్టార్టప్‌ల సంఖ్య 2016లో 500 ఉండగా 2025 జనవరి 15 నాటికి వాటి సంఖ్య అనూహ్యంగా 1,59,157కి పెరిగినట్లుతెలిపింది. గతేడాది అక్టోబర్ 31నాటికి గుర్తింపు పొందిన దాదాపు 73,151 స్టార్టప్‌లలో మహిళా డైరెక్టర్‌లు ఉన్నారని, ఇది దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల పురోగతిని వెల్లడిస్తుందని కేంద్ర మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది.




## వాణిజ్యం

# ఈక్విటీ మార్కెట్లకు 11 కంపెనీల ఎంట్రీ

**ముంబై, జనవరి 19:** జనవరి నాలుగో వారంలోనూ ఐపీఓల హవా కొనసాగనుంది. మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు మెయిన్ బోర్డ్ నుంచి డెంటా వాటర్‌తో పాటూ ఎస్ఎంఈ విభాగం నుంచి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మరో 7 కంపెనీ షేర్లు దలాల్ స్ట్రీట్ లిస్ట్ కానున్నాయి.మెయిన్ బోర్డ్ నుంచి డెంటా వాటర్ అండ్ ఇన్ఫ్రా సొల్యూషన్స్ తొలి పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఐపీఓ ద్వారా రూ.220.50 కోట్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 75,00,000 తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ధరల శ్రేణిగా రూ.279-294ను నిర్ణయించింది. ఇష్యూ22న ప్రారంభమై 24న ముగియనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక్క లాట్ (50 షేర్లు)కోసం రూ.14,700 వెచ్చించాలి. జనవరి 29న కంపెనీ షేర్లు దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. ఎస్ఎంఈ విభాగం నుంచి కేపిటల్ నంబర్స్ ఇన్ఫోటెక్ పబ్లిక్‌ఇష్యూకు రానుంది. ఐపీఓ ద్వారా రూ.169.37 కోట్లు సమీకరించాలని చూస్తోంది. ధరల శ్రేణి రూ.250-263గా కంపెనీ నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ జనవరి 20న ప్రారంభమై 22న ముగుస్తుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 32.20లక్షల తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సెల్ ద్వారా రూ.84.69 కోట్ల విలువైన షేర్లు జారీ కానున్నాయి. జనవరి 27న షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో జాబితా కానున్నాయి. రెక్స్‌ప్రోలో ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా రూ.58.65 కోట్లు సమీకరించనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 32.50 లక్షల తాజా షేర్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 4.50లక్షల షేర్లు జారీ చేయనున్నారు. బిడ్డింగ్ విండో జనవరి 22న ప్రారంభమై 24న ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.145గా ప్రకటించింది. రూ.24.58 కోట్లు సమీకరించాలనే ఉద్దేశంతో ఎస్ఎంఈ విభాగం నుంచి జీబీ లాజిస్టిక్స్ కామర్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. సబ్‌స్క్రిప్షన్ జనవరి 24న మొదలై 28న ముగుస్తుంది. ధరల శ్రేణి




ఇంకా ప్రకటించలేదు. సబ్‌స్క్రిప్షన్‌లో మంచి ఆదరణను సొంతం చేసుకున్న డెంటల్ ఉత్పత్తుల కంపెనీ లక్ష్మి డెంటల్ లిమిటెడ్ షేర్లు జనవరి 20న జాబితా కానున్నాయి. కాబ్రా జ్యుయెలర్స్ జనవరి22, రిషబ్ సెక్యూరిటీస్ జనవరి22, ల్యాండ్‌మార్క్ ఇమిగ్రేషన్ జనవరి23, స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్ షేర్లు జనవరి 23, ఇఎంఎ పార్ట్‌నర్స్ జనవరి24న ఎంట్రీ ఇవ్వనున్నాయి.

# పాన్‌కార్డు అప్‌డేట్ పేరిట కొత్త సైబర్ క్రైమ్

**న్యూఢిల్లీ, జనవరి 19:** ఇటీవల కాలంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) కస్టమర్‌లు తమ పాన్ కార్డ్ వివరాలను అప్‌డేట్ చేయనందుకు 24 గంటల్లో తమ బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేసినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. అంతేకాకుండా ఆ మెసేజ్ లో అనుమానాస్పద లింక్‌లు ఉంటున్నాయని, వాటి ద్వారా పాన్ కార్డు వివరాలను అప్‌డేట్ చేయాలని సూచిస్తున్నాయి. అయితే ఆ మెసేజ్‌లను ఎవరైనా క్లిక్ చేస్తే స్కామ్ వెబ్‌సైట్‌లకు రీ డైరెక్ట్ చేస్తున్నాయి. ముఖ్యంగా స్కామర్‌లు ఫిషింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేస్తున్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఈసందేశాలను ఫేక్ అని స్పష్టంచేసింది. ఇండియా పోస్ట్ అటువంటి హెచ్చరికలను పంపదని స్పష్టం చేసింది. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం,వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం మానుకోవాలని ప్రజలకు సూచించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేసింది. ఫిషింగ్ స్కామ్ ద్వారా స్కామర్లు పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు లేదా క్రెడిట్ కార్డ్ నంబర్‌ల వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారు. సాధారణంగా మీ బ్యాంక్ లేదా షాపింగ్ వెబ్‌సైట్ వంటి విశ్వసనీయ సంస్థల నుంచి వచ్చినట్లుగా కనిపించే నకిలీ ఇ-మెయిల్‌లు, సందేశాలు లేదా లింక్‌లను పంపుతారు. మీరు ఆ లింక్‌లపై క్లిక్ చేస్తే లేదా మీ వివరాలను ఇచ్చినట్లయితే, స్కామర్‌లు మీ సమా చారాన్ని దొంగిలించి, మీకు హాని కలిగించేలా ఉపయోగించవచ్చు.




# శరవేగంగా విస్తరిస్తున్న క్విక్ కామర్స్

**ముంబై, జనవరి 19:** కిరాణా సరుకులు, నిత్యావసర వస్తువులను నిమిషాల్లో డెలివరీ చేస్తామని హామీ ఇస్తున్న క్విక్ కామర్స్ బిజినెస్ పట్టణ ప్రాంతాల్లో వేగంగా ప్రజాదరణ పొందుతోంది. ఇప్పటికి బ్లింకిట్, ఇన్స్టిమార్ట్, బిగ్ బాస్కెట్, జెప్టో వంటి సంస్థలు ఈ సర్వీసులు అందిస్తున్నాయి. అయితే ఈ బిజినెస్‌పై ప్రజాదరణతోపాటు విమర్శలు సైతం పెరుగుతున్నాయి. ఇందుకు కొన్ని కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. వ్యతిరేక పోటీ విధానాలు క్విక్ కామర్స్ సంస్థలు వ్యతిరేక పోటీ విధానాలను అనుసరిస్తున్నాయనే వాదనలున్నాయి. సాంప్రదాయ రిటైలర్లు, ముఖ్యంగా కిరాణా దుకాణాదారులపై క్విక్ కామర్స్ ప్రభావం భారీగా ఉంది. ఈ సంస్థలు అందించే డిస్కౌంట్లు, నేరుగా ఇంటికి డెలివరీ చేసే సేవలతో కిరాణాదారుల వ్యాపారం తీవ్రంగా దెబ్బతింది. వినియోగదారులకు వేగంగా సర్వీసులు అందించేందుకు స్థానికంగా డార్క్ స్టోర్లను, చిన్న, ఆటోమేటెడ్ గోదాములను ఉపయోగిస్తున్నాయి.సాంప్రదాయ రిటైల్ విధానంలో వివిధ దశల్లో ఉండే మధ్యవర్తుల కమీషన్ల బాదరబందీ లేకపోవడంతో క్విక్ కామర్స్ సంస్థలు ఆకర్షణీయమైన ధరకే ఉత్పత్తులను అందిస్తుండటం సైతం కస్టమర్లు వాటి వైపు మొగ్గు చూపేందుకు దేహదపడుతోంది. ఈ నేపథ్యంలో నిత్యావసరాల మార్కెట్లో ఆధిపత్యం ఉన్న కిరాణా స్టోర్స్ మనుగడ కోసం పోరాడి పరిస్థితులు నెలకొంటున్నాయి. క్విక్ కామర్స్ వినియోగం 2024-25లో 74%వృద్ధి నమోదు చేయనుంది. 2023-28 మధ్యలో 48% వార్షిక వృద్ధితో అత్యంత వేగంగా ఎదిగిన మాధ్యమంగా నిలవనుందని కొన్ని నివేధికలు చెబుతున్నాయి. విదేశీ పెట్టుబడుల దుర్వినియోగం క్విక్‌కామర్స్ వాణిజ్యం పెరగడం స్థానిక రిటైలర్లకు గొడ్డలిపెట్టుగా మారింది. సౌలభ్యం, తక్కువ ధరలకు ఆకర్షితులైన చాలా మంది వినియోగదారులు తమ షాపింగ్ అలవాట్లను మార్చుకుంటున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మార్పు ఫలితంగా సాంప్రదాయ దుకాణాల్లో అమ్మకాలు తగ్గిపోయాయి. రిటైల్ మార్కెట్‌ను పూర్తి తమ వైపు తిప్పుకోవాలనే ఉద్దేశంతో క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు విదేశీ పెట్టుబడులను దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.